UNIVERSAL LIBRARY
OU_204989
UNIVERSAL LIBRARY

బిడ్డల శిక్షణ

మారుతి బుక్ డిపో,
బుక్ సెల్లర్స్ & పబ్లిషర్స్.
మార్కెట్ వీధి.
[illegible]

గుడిపాటి వెంకటాచలం

పద్మరాణి

సత్యం శివం సుందరం

కన్నీటి కాల్వ

శశిరేఖ

చిత్రాంగి

సావిత్రి

శ్రీ

మాభర్త ఇట్లా కాలింది

దైవమిచ్చిన భార్య

మొదలు	3
తలితండ్రులు	10
శరీరం	20
భోజనం-నిద్ర-బట్టలు-శుభ్రం-వ్యాయామం-రోదుపు-అలవాట్లు	
శిక్ష	58
బిడ్డా-ప్రపంచమూ	71
ఆటాపనీ-తక్కినపిల్లలు-పెద్దవాళ్ళు-సేవా-ఆజ్ఞా	
ధర్మమూ-నీతి	91
ధర్మమూ-నీతీ-వ్యక్తిత్వం స్వార్థం-అబద్ధం-సానుభూతి-	
విద్య	127
బడి-కథలు-కళలు-సృష్టిజ్ఞానం	
ఆఖరిమాట	151

శరీరంలో, మెదడులో జబ్బు వున్నపిల్లలకు
ఈపద్ధతులు పనికిరావు.

పిల్ల, అని వ్రాసినప్పుడు. పిల్లవాడు,
ఆడది కూడా అర్థము.

ఈ పుస్తకంలో వ్రాసిన యీ నూతనవిధానంలో చాలాభాగము నేను కనిపెట్టిందికాదు. ఎన్నెళ్లో శ్రమపడి, ఎందరెందరో మహామహులు ఆచరణలోపెట్టి, నిర్ధారణ చేసిన పద్ధతుల్ని నేను చదివి, వాటిశ్రేష్టత్వాన్ని గ్రహించి, నాకు వీలైనంతవరకు ఆచరణలో పెట్టి, అనుభవానికి తెచ్చుకున్నాను. నేను పూర్తిగా యీపద్ధతుల్ని అనుష్టానములో పెట్టలేకపోయినాను. దానికి పరిస్థితులు చాలవరకు కారణము. కాని ఈ పద్ధతులు వుత్త 'థియరీ' కావనిన్నీ, సంపూర్ణంగా ప్రత్యక్షరము ఆచరణలో పెట్టడానికి వీలువుందనిన్నీ యీ పద్ధతుల వల్ల పిల్లలు పూర్వముకన్న చాలా బుద్ధిమంతులూ, ఆనందవంతులూ కాగలరనిన్ని నాఅనుభవంవల్ల తెలుసుకున్నాను,

దీనిలో వ్రాసిన పద్ధతులకు కారణాలు వ్రాయాలంటే చాలాశాస్త్రం వ్రాయవలసి వుంటుంది. చాలామందికి దాంట్లో అభిలాష వుండదని నేను ఆప్రయత్నం చెయ్యలేదు.

ఈ పుస్తకంలో చెప్పినవి సాధారణ (జెనరల్) పద్ధతులు, మార్గంలోపెట్టడానికి సూచనలు. ప్రత్యేకంగా ప్రతిశిశువునుపట్టి, పరిస్థితులను పట్టీ యెప్పటికప్పుడు, యెవరికివారు యోచించుకొని మార్పులను చేసుకోవాలి.

మనుష్యస్వభావాన్ని అభివృద్ధి పరిచేందుకు బాల్యమొక్కటే తగినవయస్సు. అప్పుడుగనక బిడ్డను తగినశిక్షణలో వుంచితే, ఆబిడ్డ పెద్దదైనప్పుడు, యిప్పుడు ప్రజలకివుండే మూఢత్వము, భయమూ, కలిగివుండక, ఉన్నతురాలవుతుంది. ఆ నైసర్గికస్వభావౌన్నత్యాన్ని బిడ్డలకు యివ్వగలిగితే, యింక చట్టాలవల్లా, సంస్కారంవల్లా, బోధనవాల్లా, కలిగించడానికి ప్రయత్నించే మార్పులు, యేశ్రమాలేకండానే ప్రజలలోతటస్తిస్తాయి.

వారు స్వంతంగా జీవనభాగం సమర్థించుకునే శక్తికలిగిందాకా, పిల్లలకి తలితండ్రులు చేసే సహాయంశిక్షణ. జంతువుల్లో, పక్షుల్లోకూడా, శత్రువులనించి, తప్పించుకోడమూ, యెగిరి ఆహారం సంపాయించుకోడమూ, మొదలైనవాటి విషయమై శిక్షణ కొంతవరకు వుంటుంది. పొట్టపోసుకోడం మాత్రమే ఐతే మనుషులు తమపిల్లలకైనా యెక్కువ శ్రద్ధతీసుకోనక్కర్లేదు. కాని రానురాను లోకం, చాలావిషయాల్లో 'కాంప్లెక్సు' అవుతోంది. చక్కగా తెలివిగా, యెదిగి వృద్ధిపొందాలంటే, పిల్లలకి చాలాశ్రద్ధతో యిచ్చిన జ్ఞానసంపన్నమైన శిక్షణ అవసరము. అందువల్లనే సృష్టిసంఘమూ, మన

షుల్లో పిల్లను చాలా కాలం పెద్దవారి మీద ఆధారపడేట్టు యేర్పాటు చేశాయి. గుఱ్ఱపుపిల్ల తల్లిమీద ఆర్నెల్లు ఆధారపడితే మనుష్యుల్లో తల్లిమీద పిల్ల యిరవైయేళ్లాధారపడుతోంది. లోకమింత విషమ మనుష్య భూయిష్టము కాకముందు పిల్లలు చిన్నవయస్సులోనే స్వతంత్రులయ్యేవారు. పదహారేళ్లకి రాజ్యాలేలేవారు. కాని యిప్పుడు లోకంమారినకొద్దీ వయసులో ఆలిస్యమైతేగాని సమర్థులు కావటంలేదు. చేతులకి బలంరాగానే వ్యవసాయానికై రైతుకొడుకు తయారవుతాడు ప్లీడరుకొడుకు యిరవైయేళ్ళు చదివితేనేగాని ప్లీడరీ చెయ్యలేడు. ఇప్పటిపరిస్థితుల ప్రకారం పట్టణాల్లో ధనార్జనకూ, జీవయాత్రలో విజయానికీ, కుయుక్తులూ, వక్రవర్తనలూ, అవసరం. పరిస్థితులకి, సమయానుకూలంగా మారని ప్రిన్సిపిల్సు పిల్లకు చిన్నప్పుడే నేర్పడంవల్ల, అనేకమంది జీవితంలో ఫైల్ అయిన కుర్రవాళ్లున్నారు. కనక లోకపు అవసరాల్ని గుర్తెరిగి, దేనికోసం తమకుర్రవాళ్లని తయారు చెయ్యబోతున్నారో ముందే నిర్ణయించుకోవాలి. ధనమూ మర్యాదా ఆర్జించి సుఖపడేందుకా, సద్గుణాలూ, ఆశయాలూ, పెట్టుకుని పోరాడేందుకా, విరాగికావడానికా, రసికుడుకావడానికా, యీ విషమద్వంద్వాన్ని సమన్వయంచేసే మార్గముందా, అని.

సరైనశిక్షణ యివ్వాలంటే, శిశువు పుట్టగానే శిక్షణ మొదలుపెట్టాలి. ఆలస్యంగా మొదలుపెట్టినకొద్దీ కష్టమౌతుంది పుట్టిన నిముషంనించి శిశువుల్లో అభ్యాసాలేర్పడతాయి. సరైన అభ్యాసాలు యివ్వకపోతే దురభ్యాసాలు అలవాటవుతాయి. కాని అభ్యాసాలు లేకుండా మాత్రం బిడ్డవుండదు. బిడ్డకు రెండు న్నర సంవత్సరాలయ్యేదు వొచ్చిందాకా జాగ్రతగా శిక్షణ యిచ్చారంటే యింక స్థిరంగా జీవితమంతా శాశ్వతంగా వుపయోగపడగల ప్రవర్తన యిచ్చారన్నమాటే. కాని మొదటి మూడుసంవత్సరాలూ వృధాచేశారా యింక వారి పని చాలాకష్టమౌతుంది. అప్పటికీ కొంత ప్రయత్నం చెయ్య వొచ్చు గాని యేశిక్షణఐనా ఆరేళ్లలోపునే గాని పైనలాభం లేదు. మొదటిశిశువును సరైనశిక్షణలో పెడితే తరవాత పుట్టే శిశువు విషయమై కష్టపడనక్కర్లేదు. మొదటి శిశువుకు శిక్షణలేకుండా చేశారా, తరవాత శిశువుల శిక్షణ కష్టమవు తుంది. దీనికి చిన్నపిల్లలు పెద్దపిల్లన్ని అనుకరించే గుణమే కారణము.

ఈపద్ధతుల్ని ఆచరణలో పెట్టడం సులభంకాదు. ఈ పుస్తకంచదువుతో వుంటేనే అర్థమవుతుంది తలితండ్రులెంత శ్రమపడాలో. అంతశ్రమ పుచ్చుకునేవారు అరుదు. రోగం

వొచ్చింతరవాత మందుపుచ్చుకునే వారేకాని, రాకుండాజాగ్రత పుచ్చుకునేవారుకొద్ది. అట్లానే బిడ్డఅల్లరిచ్చేసతరవాత, ఆ బిడ్డఅల్లరివల్ల బాధపడి దండనవల్ల అణచడానికి ప్రయత్నించి, బిడ్డకీ తమకీ శ్రమ కలగజేసుకుంటారు గాని, ఎంతచెప్పినా ముందు అల్లరిస్వభావం బిడ్డకి కలగకుండా జాగ్రత పడరు.

యీవిధంగా శిక్షణ పొందిన పిల్లవాడు తలిదండ్రులకు కలిగించే శ్రమకంటె, యీశిక్షణకోసం పెద్దవారు పడవలసిన శ్రమ చాలా తక్కువ. అదిగాక ఆశ్రమవల్ల పెద్దవారికి బాధ; యీపిల్లలు శ్రమపెడితే, పెద్దవాళ్లు యిచ్చేశిక్షలవల్ల పిల్లలకి బాధ. మొదటనే ప్రయత్నించి కొంతకాలం యీపద్ధతిని ఆచరణలో పెడితే, తరవాత ఆశ్రమలన్నీ వుండవు.

"పిల్లలకు శిక్షణయివ్వాలి వాళ్ళ పురోవృద్ధి బాధ్యత మనది. దానికోసం ముందు మనం శిక్షణని నేర్చుకోవాలి." అని తెలుసుకోవాలి పెద్దవారు. తమకియెట్లాతోస్తే ఆవిధంగా చెయ్యడం యిప్పుడు జరుగుతున్నవని. పిల్లనికనడం చాతకావడంచాత పెంచడంకూడా చాతనయిందనే ప్రజల వుద్దేశ్యం. లాయరుకావడానికీ, డాక్టరు కావడానికీ కష్టపడి చదువుకొని నేర్చుకుంటారు. కాని శిశువు నిర్మలాంతఃకరణం మీద అధికారం చలాయించడానికి అందరూ పెద్దలే. దిక్కుమాలిన

ఒకపిల్ల తమ అధికారంకింద దొరికిందికదా అని, దానిమీద ఆజ్ఞలుపెట్టి, తిట్టి, సకలబాధలూ పెట్టే తల్లితండ్రులనేకులున్నారు. తమకోపాలు ద్వేషాలు, లోభాలూ, పిల్లమీద చూపుతారు అనేకులు.

రెండోది బిడ్డలచేష్టల్ని నిదానించి, పరీక్షించి వారికేవిధమైన శిక్షణ మంచిదో, యెప్పటికప్పుడు నిర్ణయించుకుంటూ వుండాలి.

మూడోది, బిడ్డమీద ప్రేమ కలిగివుండాలి. ప్రేమప్రయత్నిస్తే వొచ్చేదికాదు. కాని, మొత్తానికి, మనకన్న, మనసౌఖ్యాలకన్న, బిడ్డనీ, బిడ్డఅభివృద్ధినీ యెక్కువ ముఖ్యంగా చూసుకోవాలి. సాధారణంగా తలితండ్రులకి బిడ్డలమీద ప్రేమకన్న, సెంటిమెంటు యెక్కువ. క్రమమైన శిక్షణకు సెంటిమెంటు ముఖ్యవిరోధి. "వీరు మనపిల్లలే, వీళ్లకిది చెయ్యాలి, అదిచెయ్యాలి, మనం యీమాత్రం చెయ్యకపోతే, లోకమేమంటుంది"? అనుకుంటారు. తల్లివిధియిదికదా, తండ్రివిధి యిదికదా అని పనులు చేస్తారు. ఆలోచనా, హేతువాదమూ, వివేకమూ, అన్నిటినీ 'సెంటిమెంటు' మింగిగుడ్డిగా పనులుచేయిస్తుంది. కనక, సెంటిమెంటును చంపుకుని, నిజమైన ప్రేమను చాతనైతే అభివృద్ధి చేసుకోవాలి.

కాని మంచిశిక్షణకు వుత్త ప్రేమ మాత్రమే చాలదు. ఆ ప్రేమను క్రమమైన మార్గాల వుపయోగించి, బిడ్డక్షేమానికై ప్రయత్నించేదిజ్ఞానము. బిడ్డయేడ్చి నప్పుడల్లా పాలిమ్మంటుంది ప్రేమ. అది అనారోగ్యమంటుంది జ్ఞానము. యీజ్ఞానానికి చోటులేకుండా చేసి, తరిమేస్తుంది "సెంటిమెంటు." కాని వాస్తవమైన ప్రేమవుంటే, జ్ఞానానికి స్థలముంటుంది. ప్రేమ లేకుండా వుత్తజ్ఞానమున్నా చాలదు. అప్పుడు యిల్లు 'హాస్టలు' లాగుంటుంది. కాని ప్రేమకన్న జ్ఞానమే ముఖ్యం. రెండూ కలిసి వుండడం అంతకన్నా ముఖ్యం.

యీ శిక్షణావిధానాన్ని ప్రవేశపెట్టాలంటే, పూర్వాచరణంలో వున్న అనేక ఆచారాల్ని వొదలుకోవాలి. శిశువూ, దాని పురోవృద్ధి మన ఆచారాలకన్న మన సెంటిమెంట్సు కన్న అధికమని నమ్మి, ఏఆచారాలు అటంకాలని తోస్తాయో వాటిని వొదిలిపెట్టాలి. నవీనశాస్త్రజ్ఞానమే ప్రాముఖ్యంగా విశ్వసించకపోతే, యీ శిక్షణావిధానాన్ని అనుష్ఠించడంలో అర్థమేలేదు.

బిడ్డ కలగడం; తల్లికీ, తండ్రికీ ఆత్మాభివృద్ధికి అవసరమని తోచినప్పుడే, బిడ్డని పోషించడానికి, బిడ్డకి తగిన శిక్షణనివ్వడానికి సరైన పరిస్థితులు వున్నప్పుడే. బిడ్డని సృజించుకోవాలి. గుడ్డిగా, అప్రయత్నంగా, తమవుద్దేశ్యమూ వాళ్ళా తెలీక, బిడ్డల్ని కని; తమనీ వాళ్ళని యీశ్వరుణ్ణీ కర్మనీ తిట్టుకునే స్థితిలో పడటం, బిడ్డని చంపడంకన్న ఘోరమైన కార్యం. వరసగా అంగవికలుల్ని, పిచ్చివారిని, రోగిష్టుల్ని, పుట్టగానే నరకబాధ పడి చచ్చేపిల్లల్ని కంటూ, చూస్తూ, యింకా యింకా, అజ్ఞానంలో, కీటకాలకన్న హీనంగా పిల్లల్ని పెడుతో యీశ్వరుణ్ణి నిందించే భక్తులూ, పతివ్రతలూ, పూజ్యమాతలూ, వేలకు వేలున్నారు.

చిన్నపిల్లలకి సరైన శిక్షణనివ్వ గలిగిన తలితండ్రులు యెప్పుడూ సంతోషంగా, దయగా, ఓర్పుగా వుండాలి. అనారోగ్యవంతులు యీగుణాల్ని కలిగి వుండరు. కనక చిరకాలము జబ్బుగావుండేవారు పిల్లలశిక్షణ బాధ్యత తీసుకోకూడదు.

పుట్టినది మొదలు, బిడ్డని యింటి కంతకూ ముఖ్యమైన దానివలె, అందరూ దానిసేవకూ, పురోవృద్ధికి జీవిస్తు

న్నట్టు భావించుకోవడం విధి. బిడ్డపుట్టగానే తలితండ్రుల జీవితానికి సాఫల్యం కలిగింది. వారి జీవితాలకు అర్థం బిడ్డని అభివృద్ధిలోకి తీసుకురావడంలో లీనమై పోయింది. కనక వారి శక్తి బిడ్డకోసమే ముఖ్యంగా వినియోగ పరచవలసిన అవశ్యకత కలుగుతుంది.

పిల్లలు అల్లరిచేసినప్పుడు, విసిగించినప్పుడు, వారిని పెద్దవారు శిక్షించేటప్పుడు, యెప్పుడూ దయగా ఆనందం కనపరచాలి. తీరుబడిచేసుకుని వారిసంగతి శ్రద్ధగా కనుక్కోవాలి. వాళ్ళ ఆటలూ, ఆలోచనలూ గమనించాలి. వాళ్ళు పలకరించినప్పుడు, ప్రశ్నలడిగినప్పుడు, అల్లరిచేసినప్పుడు శ్రద్ధగా వాళ్ళ అభిప్రాయాలూ, కష్టాలూ, అన్నీ విచారించేందుకు తీరుబడి కలగచేసుకోవాలి. కథలు చెప్పాలి, వాళ్ళతో ఆడుకోవాలి. అనేక విషయాలు తెలియచెయ్యాలి, అలవాట్లు నేర్పాలి, దిద్దాలి. వాళ్ళవిషయం అవసరమైనప్పుడు, అవతల పనియెంత తొందరదైనా, మానెయ్యాలి. ఏమన్నా కావాలని అడిగినా, ప్రశ్నలడిగినా, వెంటనే ప్రత్యుత్తరమియ్యాలి. కనక తీరుబడిలేని తలితండ్రులు, బిడ్డల్ని కనకూడదు.

బిడ్డకి శిక్షణనియ్యడం ప్రారంభించకపూర్వమే తమ

అహంభావాన్ని, తమ అధిక్యతని, ఆత్మసుఖాన్ని, అభిమానాన్ని, త్యజించడం మొదటిపని. బిడ్డకోసం అవసరమయిందా, తలితండ్రులు త్యజించలేని విషయా వుండకూడదు,

ఇంతకాలమూ బిడ్డలు తలితండ్రులకైత్యజించడం బోధించారు. అది అక్రమమనీ, బిడ్డలు పెద్దవారికై యేమీ త్యజించనక్కర్లేదనీ, పెద్దవారే బిడ్డకై త్యాగం చెయ్యవలిసినది విధి అనీ నేను యీనాడు బోధిస్తున్నాను. ఇంత తిండి పెట్టి బొమ్మలు కొనియిచ్చి, బిడ్డలకెంతో సహాయంచేశామని కలికినంతోషించేవారు పెద్దలు. అనవసరంగా బిడ్డకు హానికలిగేట్టు, ముద్దుచూపి, తాము బిడ్డకై సమస్తమూ అర్పించామని లోకమంతా చాటేవారు కొందరు. సర్వమూ బిడ్డకై, అవసరమైనప్పుడు, కాలము, ఆనందము, ధనము, బలమూ, అన్నియిచ్చివెయ్యడం పెద్దవారివిధి. బాల్యంలో బిడ్డను మాడ్చి, యేడిపించి, ధనమంతా కూడబెట్టి పెద్దవాడైనాక బిడ్డకి ఆస్తిగా కానయిచ్చే యీ వేనవేలు మూర్ఖులకి, మీకు మూర్ఖులు ఇంత చదువుకున్నా వ్యాపకమూ, తెలివిలేని మొద్దులని యెంత చెప్పినా అర్థంకాదు. ఎప్పటికో లోకం తమఅవివేకాన్ని గుర్తించడం? ఇదంతా బిడ్డక్షేమమనే పేరుతో తమస్వార్థాన్ని సమ

ర్ధించుకునే కపటం, అంతే. స్వార్ధమంటే తమమీద తమకే అసహ్యం కలుగుతుందిగనక ఆత్మగౌరవం నిలుపుకోడంకోసం ఆస్వార్థానికే పవిత్రమైన పేర్లుపెట్టి పేడకుప్పమీద పట్టుబట్టలు కప్పి తమని లోకాన్ని మోసపుచ్చుకుంటారు.

పిల్లలు తప్పుచేస్తే, పెద్దవారు తమకీ తమ అధికారానికీ అవకారంజరిగినట్లు చూచుకో కూడదు. తండ్రిననీ, గొప్పవాడననీ, లోకమంతా తనని మర్యాద చేస్తుదీసనీ, మరిచిపోవాలి. పిల్ల దూషించినా, కొట్టినా, యితరులముందు అవమానంచేసినా, కోపం తెచ్చుకోకూడదు. తనకి జరిగిన అవమానం సంగతికాక, పిల్లకితటస్థించిన ఆచెడ్డ ప్రవర్తనను గురించి చింతపడి పిల్లకి స్నేహితులవలె ప్రవర్తించాలి. గొప్పగా, భయంకరంగా, అధికారంగా వుండి హడలకొట్టకూడదు. వాళ్ళని 'ఆర్డర్' చెయ్యడమూ, 'చూసుకో నీ నిన్నం చేస్తానో' అని వారిని గర్భశత్రువులవలె చూడడమూ మంచిదికాదు. వాళ్ళు మంచిగా వుండేందుకై, సహాయంచేసే మిత్రులలాగు వుండాలి. తమకేమీ తెలియకపోయినా, అన్నీ తెలిసినట్లూ, లోకానికి సర్వాధికారులైనట్లూ, యెన్నడూ తప్పుచెయ్యని యీశ్వరులమనేనూ కనబడక, సహజంగా

దయగా వుండాలి. పిల్లలయెడల తాము తప్పుచేస్తే వారికి క్షమాపణ అడగాలి.

పిల్లల్లో యే సద్గుణాలు కలగ చేయ్యాలనుకుంటారో, ఆగుణాల్ని పెద్దవారు తాము అలవరుచుకుని, అనుష్ఠించాలి. వారినించి యే చెడుగుణాల్ని మాన్పించాలని వుంటుందో, వాటిని తాము వర్జించాలి. వుత్తబోధనవల్లా, దెబ్బలవల్లా యేమీలాభంలేదు.

పిల్లల గుణాలూ, అభిప్రాయాలూ, "టేస్టూ" అభినివేశాలూ, యెటువంటివో తెలుసుకుని, వాటి ప్రకారం, వాటినే. అభివృద్ధి చేసేందుకు, వాటిననుసరించి పెద్దవారునడవాలి. అంతేకాని తమఅభిప్రాయాల ప్రకారం పిల్లలస్వభావాలూ, ఆశయాలూ, యేర్పడాలని. నిర్ణయించుకుని, వారి సహజశక్తుల్ని గుర్తించక, కళ్లుమూసుకుని, వారిని వొంపు తియ్యడానికి ప్రయత్నించ కూడదు. వారిమృదు సహజస్వభావాలకి యెదురుగా, అడ్డంగా, శిక్షణనిస్తే, వారికున్న ఉత్తమశక్తులు ధ్వంసమవుతాయి.

బిడ్డమీద దానికోసమే దయగావుడాలి. అదిబుద్ధిమంతురాలైనంతకాలమూ పెద్దవాళ్ల ఆజ్ఞల్ని విన్నంతకాలమూ దానిపైన దయా ప్రేమా చూపి, అదితమ మాటవినకపోతే దానిపైన ద్వేషం చూపుతారు. పిల్ల పెద్దవారి ఆజ్ఞను బద్ధురాలెందుకు కావాలి? తనపురోవృద్ధికి. అంతే కాని పెద్దవారిని సంతోషపెట్టి, వారిఅధికారపు చలాయింపులు పడేందుకు కాదు. కనక అదితిరగబడి చెడిపోతే విచారంకలగాలి, కాని కోపంరాకూడదు. అది దుర్మార్గురాలైన కొద్దీ, దానిమీద ప్రేమమెక్కువ కావాలి.

కొందరు పెద్దవారు పిల్లల్ని తమఆటవాస్తువుల కింద చూసుకుంటారు. వాళ్ల చేత తమాషాలు చేయించుకోడమూ, బనాయిపడడమూ, లోకంముందు ఎగ్జిబిట్ చెయ్యడమూ, చేస్తారు. వాళతో తమాషామాటలు మాట్లాడతారు, అబద్ధాలూ బూతులూ పలికించుకుని, కొట్టించుకుని నవ్వుతారు. తప్పు.

కొందరు పిల్లలమీద నిష్కారణమైన దయ చూపుతారు. అది నిస్సహాయవి, కష్టంలోవున్నట్లూ, తాముదాన్ని

గా పాడుతున్నట్టూ, అదిపరిగెత్తకుండా, కాళ్లూ, చేతులూ కద పకండా, లోకాన్ని చూడకండా, కట్టేసి దానికివను లన్నీ చేసి పెట్టి, పాడుచేసుకుంటారు.

కొందరు తమ అభిప్రాయాల్ని, తమ కార్యాల్ని, తమ తదనంతరం లోకంలో వ్యాపింప చెయ్యడానికి సాధనాలనుకుంటారు పిల్లల్ని. కాముకోరి, తమజీవితం లో దేన్ని సఫలం చేసుకోలేక పోయినారో, ఆ ఆశయాన్ని త మకొడుకన్నా అతనిజీవితంలో, రియలైజ్ చేస్తేచూసి సంతో షించాలని ఆశపడతారు. కొందరు తామెటువంటివారో, ఆ లాగే పిల్లలూ తయారుకావాలని ప్రయత్నం చేస్తారు. కొంద రికి కొడుకులు ఉత్తరక్రియలు చేయడానికి, వృద్ధాప్యంలో పో షించడానికి కావాలి. అట్లానే తల్లులకి కూతుళ్లు తాము మానిన వ్రతాలు చెయ్యడానికీ, వరదాలు తీర్చడానికీ.

కొందరికి పిల్లలంటే అసహ్యం. వారు పుట్టినందుకు కోపం, ముఖ్యంగా ఆడపిల్లలు అట్లాంటివారు పిల్లల్ని కన కూడదను. అక్కర్లేకపోతే, పెంపకానికి యెవరికన్నా యివ్వాలి. అక్కర్లేనిపిల్లల్ని.కనడంకన్న భ్రూణహత్యనయం. పిల్లలు వారి

వారి స్వభావాలప్రకారం, వారి యిష్టంవొచ్చిన స్థానం ఆక్రమించుకోవలసిన స్వతంత్ర జీవులనీ, వాళ్ళని పెద్దవాళ్ళు తమ ఆశయాలకు వుపయోగించుకోకూడదనీ తెలుసుకోవాలి.

ఈ శిక్షణావిధానం అమలులో పెట్టడానికి తండ్రులెక్కువ సహాయపడలేరు. యిప్పటి సంఘపద్ధతిప్రకారం మొగవాడు బైట ఆర్జించేవాడు. కనక అతనికి వ్యవధి వుండదు. దాయీల నెప్పుడుకూడా పిల్లల్ని పెంచడానికి వుపయోగించకూడదు. బాగా మంచివిద్యావాసన గలిగి, పిల్లల శిక్షణలో తర్ఫీదై, తను పిల్లన్ని కలిగివుండి, దయా. జ్ఞానమూ. కల దాయీ యెక్కడోగాని దొరకదు. అట్లాంటివాళ్ళనైనా జాగ్రతగా తల్లులు పరీక్షించి కనిపెట్టివుండాలి. యెన్నడూ, వొక్క రోజుకూడా, తాము దగ్గరలేకుండా, పూర్తిగా పిల్లల్ని నౌకర్ల చేతుల్లో వొదలకూడదు. నౌకరికి పిల్లలపైన స్వతంత్రమిచ్చాగా, పిల్లలపాలిటి మృత్యుదేవతలైనారన్నమాట. యీనౌకర్లకన్న హానిచేసేవాళ్ళు- పిల్లలప్రాణాలకి పెనుభూతాలు. యింటోవుండే ముసలిబంధువులు- తాతా, అత్తా. నాయనమ్మా, అమ్మమ్మా మొదలైనవాళ్ళు- ముఖ్యం ముసలిఆడవాళ్ళు. వాళ్ళ గాలిసోకిందా, వాళ్ళుయింటో యేమూలనన్నా

వున్నారా, యింకపిల్ల అభివృద్ధి నశించదన్నమాట. పాముల నించీ, సింహాలనించీ, తప్పించినట్టే పిల్లల్ని యీ ముసలివారి నించి తప్పించాలి. బిడ్డ పుట్టకపూర్వమే వీరినందర్నీ, వారెంత మంచివారైనా సరే, యింటోనించి తరిమెయ్యాలి. యింకబిడ్డ మొదుగుతున్నవాళ్లా, వాళ్ళని యింటో కాలుపెట్ట నియ్య కూడదు.

ఈశిక్షణ నివ్వడానికి వుత్తమురాలు తల్లి. కాని యీదేశము యిప్పుడున్న స్థితిలో బిడ్డల గర్భశత్రువులు, మృత్యుదేవతలీతల్లులు. వీళ్ళచేతుల్లో పిల్లన్ని పోదలడంకన్న, పుట్టగానే చంపడం మంచిది. యేమీ తెలీని జడులు, తెలుసుకోడం యిష్టంలేని, అర్థంచేసుకోడం చాతకాని, మొద్దులు ప్రసూతివుతల్లులు. అనారోగ్యవంతుల్ని, పశువుల్నీ, బానిసల్నీ, మూర్ఖుల్నీ, తయారుచేసి తరతరాలనుంచి యీప్రజల్ని అధమస్థితిలోకి తోసింది, యింకా అనేక తరాలు యిట్లానే వుంచపొయ్యేదీ, యీతల్లులే. వీరు బాగుపబడితేనే కాని ఈ మానవకోటికి గతిలేదు. మొదటి రెండుమూడేళ్ళూ యీతల్లులచేతుల్లో గడిపిన తరవాత ఆబిడ్డ యెంత గొప్ప పాఠశాలల్లో చదివినా, ఎంత గురువులవద్ద శిక్షణపొందినా, ఎంత

జ్ఞానాన్ని సంపాయించుకున్నా యేమీలాభంలేదు. పురుషుడు తన కామంకోసం స్త్రీలను కుక్కలవలె కట్టేసుకున్నాడు. స్త్రీ తనపిలల్ని అధములుగా పెంచి, కసితీర్చుకుంటోంది పురుష జాతిమీద.

ఏవిద్యావాసనలేని పూర్వాచారపు స్త్రీలు యింకా నయం, వారికి ఇంకా 'ఇన్స్టిన్క్ట్సు' చావలేదు. బిడ్డమీద సహజమూ, ఆరోగ్యమూ, విన్ప్రేమా, బిడ్డ అవసరము గుర్తించే సమర్థతా, సహనమూ, వుంటాయి.

యీ స్త్రీల నభివృద్ధి చెయ్యడమూ, విద్యాలోకజ్ఞానమూ, స్వేచ్ఛాయివ్వడమూ, కలలోనివార్త. పైకి బిగ్గరిగా ఆమాటలనకూడదు. మతమూ, సాంప్రదాయము అడ్డమొస్తాయి. కనక యీతల్లులనించి పిల్లల్ని తప్పించాలి. యీ తల్లులు బాగా జ్ఞానాన్ని సంపాయించినా, అందరూ పిల్లల్ని పెంచగలిగిన వోర్పునీ, వ్యవధినీ, ఆపెంచే స్వభావాన్నీ, కలిగి వుండరు. కనక అప్పుడూ అట్లాంటివారు పిల్లల్ని తమంతట తాము పెంచరు. కొందరికి వ్యవధివుండదు. ప్రేమవుండదు. కొందరికి జ్ఞానముండదు. కొందరికి స్వభావముండదు. అటు

వంటివారు పిల్లల్ని కనకూడదు. కంటే, కొందరుతల్లుల్ని అవిధమైన ఆసక్తిగలవారికి, చక్కగా బాలశిక్షణ నేర్పే శాలేజీలలో తయారుచేసి వారిచేత 'నర్సరీ' పాఠశాలల్ని పెట్టించి యీడాదినిండగానే పిల్లల్ని పగలంతా వాళ్ళకి పెంపకానికై ఇవ్వాలి. శిక్షణకోసం

తలితండ్రులమీద భక్తి ప్రేమా పిల్లలకు కలిగేట్లు పెద్దవారు ప్రవర్తించవలసినదేగాని పూరికే బలవంతంచేస్తే వొచ్చేవికావు. చిన్నతనంలో తండ్రులమీద కొంచెం భక్తివుంటుంది. తల్లిమీద మొదటినుంచీ వుండదు. ఆతల్లిని ఇంట్లోఅందరూ తిడుతో, ఆమెచేత పెంటచాకిరిచేయిస్తో అధమంగా చూచేవారై తల్లిని తిడుతో ఆమెపిల్లని తాము ముద్దుచేస్తో, ఆతల్లిమీద పిల్లని భక్తికలిగి వుండమని వుపన్యాసాలూ, పద్యాలూ, చెపితే భక్తికలుగుతుందా ? కుర్రవాళ్లు ముందు తల్లుల్ని నీచంగాచూడడం నేర్చుకుంటారు. తరవాత తక్కిన స్త్రీలనీ, భార్యల్నీ అంతనీచంగానూ చూస్తారు. కొంచెం పెద్దవారుకాగానే, తండ్రి గొప్పతనము అబద్ధమనీ, అధికారం బూటకమనీ తెలుసుకొని తండ్రిమీది భక్తిని మానుకుంటారు.

ఇదివరకంతా తనకి అంతరాత్మ వేరే లేకుండా భర్త ఆజ్ఞే తన విధిగా భార్య ఎట్లా లోబడిందో, ఆ విధంగానే పిల్లలు కూడా అంతరాత్మలు వేరే లేకుండా. తండ్రి ఆజ్ఞనే పరమధర్మంగా వహించడం బోధించారు. తండ్రి ఆజ్ఞ అనే పేరుతో పిల్లలు సమస్త కార్యాలూ, పాపాలూ, దోషాలూ, విప్లవాలూ, చేసినందుకై పురాణాలు వారిని పొగిడి, వారికి మహిమలూ, అవతారాలూ, పుణ్యలోకాలూ, ప్రసాదించాయి. తండ్రి ఆజ్ఞలనే మహాపరకాన్నించి పిల్లల్ని తప్పించి, స్వబుద్ధిని వుపయోగించే శక్తి అభివృద్ధి చేస్తేగాని లోకం బాగుపడదు. ఇప్పుడు జరిగేదేమిటంటే, చిన్నతనంలో తండ్రి ఆజ్ఞలమీది గౌరవంచేత స్వబుద్ధిని వివరింపచేసుకోక, ధర్మాచరణంలో, నిగ్రహణశక్తిలో, తానెట్లా వున్నారో, ఆ స్థితిలోనే వుంటున్నారు. కాని కొంచెం పెద్దవారు కాగానే, తమ స్వార్థం కోసం తండ్రులతో ధనము కోసమూ ఆస్తి కోసమూ తగూలాడి, వారిని వినరానితిట్లు తిడుతో న్నూ వున్నారు,. కాని తండ్రుల్ని బూతులు తిట్టిన మహానుభావులే, యిట్లా తండ్రులకి విధేయులుగా వుండనఖ్ఖర్లేదని బోధిస్తే నేను విప్లవం బోధిస్తున్నానని నన్నుదూషిస్తారు, ఎందుకు! తమ పిల్లలు తమని

ఎవరిస్తారని. ఇట్లాంటి తండ్రుల్ని ఎట్లా దూషిస్తారు పిల్లలు. నేను వేరే బోధించాలా? వాళ్ళకి కళ్ళు లేవూ?

ముఖ్యంగా తలితండ్రులు కోరేది పిల్లల ప్రేమ. యీ ప్రేమని గురించి పురాణాలనిండా వుపన్యాసాలూ, కథలూ, బోధనలూ, వున్నాయి. పిల్లలు ప్రేమ చూపటం లేదని ప్రతికుటుంబములోను యేడుపులూ వున్నాయి. పిల్లలకు ప్రేమ కలిగేటట్లు ప్రవర్తించడం పెద్దవారివిధిగాని, ప్రేమించడం పిల్లలవిధి కాదు. యెందుకంటే, ప్రేమ బలవంతం చేసుకుంటే వొచ్చేది కాదు. కనక ప్రేమించగల వుదారస్వభావాన్ని మనము పిల్లలలో వృద్ధి చెయ్యగలము, అంతే.

కాదిచ్చే తిండికీ, గుడ్డకీ, జాగ్రతకీ, కష్టానికీ, చూపే ప్రేమకీ యెదురు జీతం, ప్రతిఫలం, పిల్లలనుంచి ప్రేమ అంటారు. కాని తలిదండ్రులు యివన్నీ తమకోసం చేస్తున్నారనే సంగతి తెలుసుకునే స్థితిలో పిల్లలు వుండరు. దయగల తలితండ్రులు పిల్లలకి రోజూ తాము చేసే వుపకారాన్ని గురించి చెవుల్లో నూరిపోస్తున్నా, వారు ప్రయత్నించి ప్రేమను తెచ్చుకోలేరు. వాళ్ళ మనసు అంత అభివృద్ధి చెందివుండదు. తాము ప్రేమించకపోవడంవల్ల తలిదండ్రులకి కలిగే బాధని పిల్లలు గుర్తించ

లేరు. తాము చిన్నప్పుడు యెట్లాతలితండ్రుల్ని ప్రేమించలేదో, వాళ్ళ కష్టాలు గుర్తించడం తమకెంత అసాధ్యమయిందో, పెద్ద వాళ్లు జ్ఞాపకం తెచ్చుకుని, తమపిల్లల మనసుకూడా ఆట్లాగే నని అర్థం చేసుకోవాలి.

అదిగాక చాలమంది తండ్రులు పిల్లల జాగ్రతతీసుకుంటారు కాని వారిపైన ప్రేమ చూపరు. ప్రేమంటే, రోజుకు పదిసార్లు ముద్దులాడడం కాదు. పిల్లలు కాంతినీ, ఆకాశాన్ని యెట్లా అనుభవించి ఆనందిస్తారో, అట్లానే పెద్దవారి జాగ్రత్తనూ, దయనూ అనుభవిస్తారు. కొంచెం యెదిగి అర్థమయింతరవాత కృతజ్ఞత చూపుతారు, అంతే. పిల్లలుమాత్రం, వాళ్లతో ఆడుకుని, వాళ్ళబాధలుతీర్చి, వాళ్లతో పాటలుపాడి, కథలు చెప్పే వాళ్లని ప్రేమిస్తారు. కనక పిల్లలప్రేమ పొందాలంటే, తలితండ్రులు వాళ్లని సంతోషపెట్టే స్నేహితులుగా కావాలి. శిక్షణా, పిల్లల అభివృద్ధీ, అనిపేరుపెట్టి పిల్లల్నికొట్టి తిట్టి, నీతిపుపన్యాసాలిచ్చి, బాధిస్తోవుంటే, యీతలితండ్రుల నెవరు ప్రేమిస్తారు? లోపల యెంతప్రేమ వున్నా, బైటికి వొచ్చేదిమాత్రం, దెబ్బలూ, తిట్లూ; యిష్టంవొచ్చినప్పుడు వూపిరాడని ముద్దులూ ఐతే పిల్లలనించి ప్రేమ యెట్లా వొస్తుంది?

యింటికి వొచ్చిన అత్తలమీద మామలమీద, పినతండ్రులమీద చాలా ప్రేమ చూపుతారు పిల్లలు. ఎందుకు? వాళ్లు కొత్తగనక, తలితండ్రులవలె వాళ్ళుకొట్టరు. కథలతో పాటలతో, ఆటలతో, పిల్లల్ని సంతోషపెడతారు; మిఠాయిలుకొని యిస్తారు గనక. అన్నమూ బట్టలూ యిచ్చే తమకన్న కంటే, వారిమీదే ప్రేమచూపుతారే అని తలితండ్రులకి ఆశ్చర్యం. బిడ్డల ప్రేమ సంపాయించాలంటే, మార్గమదే!

పెద్దవాళ్ళు ఎంతదయగా వున్నా, బిడ్డ ప్రేమచూపక పోతే, ఒదివాక కోపమును కోకూడదు.

దానిహృదయం కఠినమూ కాదు, అది దుర్మార్గురాలూ కాదు. సాధారణంగా ఆ తల్లితండ్రుల లోపమే, దానిది కాదు. బిడ్డదగ్గిర్నించి ప్రేమరాక పోతే, తలితండ్రులు బాధపడతారు. కాని తాము తమ ధర్మాన్ని నెరవేర్చి దానితోనే సంతుష్టి పడడం నేర్చుకోవాలి. పిల్లవాణ్ణిమాత్రం కృతజ్ఞత లేదని, నిందించకూడదు, నిర్బంధించకూడదు.

బాల్యంలో పెద్దవారియెడల ప్రేమచూపే పిల్లలు సహితం, పదేళ్ళుదాటగానే, తలితండ్రులనించి దూరమౌతారు. అదీ యేమీ దుర్గుణంగా యెంచకూడదు. ఆవయస్సుకదిసహజమే

పిల్లల దగ్గర్నుంచి వుత్తిప్రేమ చాలదు యీ తలితండ్రులకి. ప్రేమకి సూచకంగా వారు చెప్పినమాటల్లా పిల్లలు వినడం కావాలి. అదృష్టవశాత్తూ, పెద్దవారిమాటలు యెదిరించి స్వబుద్ధితో ప్రవర్తించడం పిల్లలస్వభావంలోనే వుందిగాని, అందరు పిల్లలూ తలితండ్రుల ఆజ్ఞని జవదాటకుండా నడుచుకుంటే, అంత నరకంతో సమానమైన ప్రపంచం యింకోటి వుండదు. అభివృద్ధి, మేధాశక్తి అన్నీ నశించి, చిన్నవాళ్ళందరూ, బానిసలూ, అప్రయోజకులూ, ముసలితొత్తులుగా తయారౌతారు. తలితండ్రుల మాటవినడం సుగుణంగా పరిగణించడం పోయి, అదో దుర్గుణంగా చూడ్డం మానాలి. లోకం బాగుపడాలంటే అదో సుగుణమని బోధించకూడదు. తమకు ధర్మమేదో, న్యాయమేదో, అది ఆచరించాలిగాని, తలితండ్రులేది చెప్తే అది చెయ్యమనడం మూర్ఖం. పిల్లవాడికి స్వబుద్ధి అంకురించి, మంచి చెడ్డ తెలియనంతవరకు, దారి చూపవలిసిందేకాని, తరవాత అతని యిష్టానికతన్ని వదలాలి. తలితండ్రుల మీద అతను ఆధారపడచూచినా, వాళ్ళు వొప్పుకోకూడదు. స్వతంత్రబుద్ధి పిల్లలకు చాలావిషయాల్లో ఏడో యేడుకి పూర్తి అవుతుంది.

ప్రేమవున్నా లేకపోయినా పెద్దవారియెడల పిల్లలకు మర్యాద నేర్పాలి. మర్యాద ఒక అలవాటు. అలవాటు నేర్పడం పెద్దవారివిధి. అంతే.

బిడ్డకి తిండిబెట్టి, బట్టయిచ్చి కాపాడినందుకు పెద్దవారి మాటవిని, వారి అభిప్రాయాలనే కలిగి, వారికి సేవచెయ్యాలని, పెద్దవారి అభిప్రాయం. చిన్నప్పుడు వింటేచాలదు. తాము కాపాడడంమాని, ఆబిడ్డే పెద్దవాడై, తమని కాపాడేటప్పుడుకూడా తమమాట ప్రకారమే నడుచుకోవాలంటారు. తలితండ్రులమీద భక్తి యెన్నటికీ వదలకూడదనీ, వారే ఈ భూలోక దైవాలనీ విధించారు. ఈ భక్తి తల్లితండ్రుల దగ్గర ఆగక అత్తలకూ అన్నలకూ, తాతలకూ, సమస్తమైన పెద్దవారికీ, కూడా, ప్రవర్తింపచేశారు. వయసులో పెద్దవాడైనంత మాత్రాన బిడ్డకు ఆజ్ఞలుపెట్టవాడైనాడు. పెద్దలమాట యెందుకు బిడ్డ వినాలని అడిగితే, శాస్త్రాల్లోకి వెళుతుంది వాదన. అన్నా, వదినా, అత్తా, యెందుకు పూజ్యులంటే, పెద్దవారు గనుక. ఏనుగూ, మర్రిచెట్టూ కూడా పెద్దతనాలవల్ల పూజ్యులేనా?

ఇంక తలితండ్రులసంగతి. ఇక్కడ కృతజ్ఞత అనే గొప్ప కారణంవొకటి చూపిస్తారు. తనని కనమని బిడ్డ తలితండ్రుల్ని

బతిమాలలేదు. వారి కామం వారు ఆపుకోలేక, బిడ్డ పుడుతుందనే జ్ఞానమున్నా లేక, కని, "అమ్మా! నిన్ను కష్టపడి తొమ్మిది నెలలు మోసి, బాధపడి కన్నానే! అందుకని కృతజ్ఞత కలిగి నామాటవిననే. నీయిష్టాన్ని చంపుకోవే" అంటుంది తల్లి. తండ్రీ అంతే. ఆ రెండు నిమిషాల ప్రజ్ఞకీ, తొమ్మిది నెలలు మొయ్యక యెట్లా తప్పుతుంది? బిడ్డకోసం మోసిందా? "ఈ పాడుకడు పొకటి వొచ్చింద"ని తిట్టుకుంటోనే వుంటుంది.

బిడ్డని కన్నతరవాత పాలుపోస్తారు. తింపి పెడతారు. రోగాలొస్తే విసుగు రానంతవరకు సేవచేస్తారు, తిట్టుకుంటో. ఎవరికోసం చేస్తారు? బిడ్డని యీలోకంలోకి రప్పించినవారు సేవ చెయ్యవద్దూ? తమవిధిని తాము నిర్వర్తించుకున్నందుకు కృతజ్ఞత యెందుకు? బిడ్డకి కృతజ్ఞత సహజంగా కలిగి తలితండ్రుల యెడల ప్రేమచూపితేసరే! కాని పెద్దవారుమాత్రం బిడ్డని కృతజ్ఞత చూపమనడం, అన్యాయం, అనవసరం. చూపకపోతే తిట్టటం యేడవడం, మూర్ఖం.

తలితండ్రులమీద భక్తి, యేమాత్రమూ వుండకూడదు. బిడ్డకు నవజీవనానికి చిహ్నమై లోకానికి యికముందు తోడ్పడ

పార్యో బిడ్డయెడల పెద్దవారు అతిభక్తిని చూపాలి. నూతన జ్ఞానాన్ని శక్తినీ సంపాయించి బిడ్డ అభివృద్ధికి తోడ్పడేందుకు ప్రయత్నించాలి.

ఈ తలితండ్రులయెడల భక్తిఅనేది పూర్వాచారం మీది భక్తికి మూలం. తలితండ్రులు పాతయుగంవారు. తాతలూ, నాయనమ్మలూ అంతకంటే. కనక వారిని వెనక వొదిలి బిడ్డముందుకి చూడాలి. వాళ్ల అభిప్రాయాలూ అనుభవాలూ, అన్నీ పూర్వకాలానికి చెందినవి. కనక ముఖ్యంగా వర్జించాలి. అట్లాగే తక్కిన పెద్దవారన్నా, వారి అభిప్రాయాల్ని, ఆజ్ఞల్ని, అన్నిటినీ ధిక్కరించి, తన స్వంతయోచనలను బిడ్డ అభివృద్ధి చేసుకోవాలి. ఈ పెద్దలమీది భక్తివల్లనే పూర్వశాస్త్రాలన్నా, చీకిన తాటాకులన్నా, పసుపుగుడ్డలన్నా, గడ్డమున్న బైరాగి దొంగలన్నా, ప్రజలకి తెలివిలేని భక్తికలుగుతోంది. చిన్నతనంనించి అన్ని పూర్వవాసనలకీ తిరగబడడం బిడ్డకి నేర్పి, ఎంత త్వరలో వీలైతే అంతత్వరలో తాము బిడ్డ దోవకి అడ్డంగా నిలవక తప్పుకోడం మంచిది.

శరీరం.

శిశువుకి అన్నిటికన్నా ముఖ్యం శరీరారోగ్యం. ఆస్తి కన్న, ధనంకన్న, విద్యకన్న, నీతికన్న అన్నిటికన్న, ముఖ్యంగా తలితండ్రులు బిడ్డకియ్యవలసింది ఆరోగ్యం. దీనికోసం ముందు తాము ఆరోగ్యవంతులై వుండాలి. అనారోగ్యవంతులకి బిడ్డల్ని కనే అధికారం లేదు. లోకాన్ని అనారోగ్యవంతులైన సంతతితో నింపేకన్న దేంటోనన్నా పడి చస్తే నయం. అనారోగ్యవంతులు అధమం గర్భనివృత్తి మార్గాలనన్నా అనుసరించితీరాలి. దైవం బిడ్డల్నిస్తున్నాడనీ, వాళ్ళకి రోగాల్ని యిస్తున్నాడనీ, కర్మవల్ల సంభవిస్తున్నాయనీ, మెట్ట వేదాంతాలు పలుక్కుంటో, తాము మాత్రం, తమ రాత్రి కర్మల్ని కొనసాగిస్తో, బద్ధకంగా, అంధంగా, మూర్ఖంగా, కీటకాలవలె పిల్లన్ని కంటారు. వాళ్ళు చస్తే, యేడుస్తారు. అంతకన్నా సుఖంగా బతకమని జ్ఞానాన్ని బోధిస్తే, సంఘప్రళయమూ, పాశ్చాత్తమూ, భౌతికమూ. అని అరిచి, మళ్ళీ తమ పనులు నిశ్చింతగా ప్రారంభిస్తారు. నోరులేని బిడ్డల్ని రోగిష్టులుగా కని. దినదినమూ, వారుపడే వేదనను చూసికూడా, మళ్ళీ ఆట్లాంటి పిల్లల్ని కనేమూర్ఖులు అనేకవేలు, మనచుట్టూ.

అనారోగ్యంగా పుట్టిన బిడ్డకి ఆరోగ్యం తీసుకూరావ రావడం చాలాకష్టం. ఆరోగ్యంగా పుట్టినబిడ్డనికూడా చాలా త్వరలో రోగిష్టినిగా చేసే మహామంత్రం వుపదేశంపొందారు యీతల్లులు. ఎంత యీ తల్లులు ఆరోగ్యాన్ని నాశనంచేసినా, బిడ్డ ఆరోగ్యం తిరగబడి మళ్ళీ పాతుకుంటూనే వుంటుంది. ఐనా తమగాఢ ప్రేమతో అరోగ్యాన్ని సమూలంగా నాశనం చేసి జయిస్తారు తలి తండ్రులు.

చిన్నప్పుడు ఆరోగ్యం చెడితే యింక మళ్ళీ కుదటపడదు. మొదటనే పూర్ణారోగ్యముంటే, తరవాత జీవితంలో యెంత అనారోగ్యాన్ని నిగ్రహిస్తుంది, శరీరం. పెద్దవారు శిశుఆరోగ్యశాస్త్రాలు చదవాలి. వాటిప్రకారం ఆచరించాలి. శిశు సంరక్షణ శాస్త్రవిద్యను తల్లిపొందివుంటేగాని, శిశువును కనడానికీ, పెంచడానికీ, హక్కులేదు.

శరీరవిషయమైన పనులు యెంతవరకు శిశువుమనసు మీాదా స్వభావంమీాదా ఇన్‌ఫ్లూయెన్సు కలిగివుంటాయో, అంతవరకే యిక్కడ వ్రాస్తాము. శిశుఆరోగ్యశాస్త్రాలు వేరే చదువుకోవాలి తక్కిన విషయాలకోసమై.

శరీరవిషయమైన ఆరోగ్యంచాలావరకు అలవాట్లమీద ఆధారపడివుంటుంది. కనక పుట్టినప్పటినించి, శ్రద్ధతో శిశువుకి మంచి అలవాట్లను స్థాపించాలి. ముఖ్యమైన అలవాట్ల విషయమై వ్రాస్తాను.

భోజనం.

పసితనంలో బిడ్డపుట్టినదినమునించికూడా, సరిగా వేళకు పాలివ్వాలి. ఎంతయేడ్చినా వేళతప్పకూడదు, చాలసార్లు యేడుపు ఆకలివల్ల కాదు. ఆయేడుపు వినలేక స్తనం నోట్లో పూపి గాడకుండా కుక్కి యేడుపు మానుపుతారు, నిజమైన కారణానికై వెతికే వోపిక లేదు. రాత్రిలు శిశువునోట్లో స్తనం వొదిలి పడుకోడం అసహ్యమూ, తల్లికీ శిశువుకీ అనారోగ్యకరమైన అభ్యాసం. చాలా ప్రత్యేకంగా అవసరం కలిగితే తప్ప సాధారణంగా రాత్రి పదిదాటిం తరవాత శిశువుకి యేఆహారము యివ్వకూడదు. అవసరంలేదు. తల్లి పడుకో బోయేముందు శిశువును లేపి పాలు పడితేచాలు.

అయ్యో ఆకలేస్తోంది, యేడుస్తోంది, అనే పిచ్చి సెంటిమెంటు మానెయ్యాలి.

భోజనంచేసే యీడొచ్చినప్పుడు, అన్నం కలిపి తినిపించకూడదు. బిడ్డ ఆకలి ప్రకారం దాన్నే తిననియ్యాలి. భోజనాల మధ్య శిశువు యేమీ తినకూడదు. యెవరన్నా యేమన్నా యిచ్చినా, భోజన సమయానికది దాచుకోవాలి. కంచంముందు కూర్చుని తినక, తాత్సారం చేస్తే, ఆడుకోనియ్యకూడదు.

పిల్ల అన్నం తినకపోతే ఆదుర్దా పడకూడదు. జబ్బువల్ల తినకపోతే, చికిత్స చెయ్యాలి. పెంకెతనంవల్లనైతే మాట్లాడకండా వూరుకోవాలి. బతిమాలకూడదు. ఆదుర్దా, జాలి చూపకూడదు. ఒకసారివొద్దన్న తరవాత అడిగినాగూడ మళ్లీ అన్నానికి కూచోనియ్యకూడదు. మరీ పశ్చాత్తాప పడితే ఒకటి రెండు సారులు వొప్పుకోవచ్చును.

నిద్ర

శిశువుని సరియైన కాలానికి పడుకోపెట్టాలి. వుయ్యాల వుపయోగించకూడదు, జోలపాడకూడదు. వేరే పక్క వుండాలి పిల్లకి పుట్టినప్పటినుంచి. మూడోనెలనించి వేరేగదిలో పడుకోపెట్టాలి. పరదాలన్నా అడ్డముండాలి. దీపం వుంచకూడదు.

పడుకోడమూ, నిద్రా, ఒకటిగా అలవాటు చెయ్యాలి. పక్కని చూడగానే శిశువుకి నిద్ర జ్ఞాపకం వొచ్చేట్టు చెయ్యాలి. నిద్ర సమయములో తప్ప ఆపక్కమీద పడుకో నియ్యకూడదు.

పిల్ల నిద్రపోకపోతే, యేమీ ఆదుర్దా చూపకూడదు. సరైన కాలానికి పక్కమీద శిశువును వొదిలి రావాలి, నిద్ర పోనీ, పోకపోనీ.

బట్టలు

వీలైనంతవరకు బట్టలు వెయ్యడంమాని పిల్లన్ని మొండి మొలతో వొదిలేసి తిరగనియ్యాలి. చలిలోనూ, బైటికివెళ్లే ప్పుడూ వెయ్యవొచ్చు. చలికికూడా క్రమంగా శరీరాన్ని అల వాటుచేసి వొదిలెయ్యాలి. బిడ్డ చలేస్తోందన్నదాకా బట్టలు వెయ్య నక్కర్లేదు. కొంతవయసు వొచ్చేప్పటికి పిల్లలు సిగ్గు పడి బట్టలు కావాలంటారు. అప్పుడు వెయ్యవొచ్చు. అప్పుడు కూడా కొంత కొంచెం వేస్తే అంత మంచిది. సిగ్గు బిళ్ళలూ, గోచీలూ తప్ప. ప్రత్యేకం ఆ అవయవాలు మాత్రం కప్ప డం మంచిదికాదు. బట్టలు వేసుకున్నా, అవి సంఘ నిర్ణయ ప్రకారం వేసుకుంటున్నారేగాని, స్వభావ సిద్ధమైన అవయవా

లగా యేమీ తప్పు వుండడం వల్లకాదనీ, వాటిల్లో సిగ్గూ, పాపమూ లేవనిన్నీ, వాటిని దాచడం అవసరంలేదనీ, వాటిని దాచడమే దుస్తుల వుద్దేశ్యం కాదనీ, పిల్లలకు చెప్పాలి. పరాయి వాళ్లని పిల్లల్ని, మొండి మొలతో వున్నానేం! అని వెక్కిరించ నియ్యకూడదు. ఎవరు వెక్కిరించినా లక్ష్యం చెయ్యక పోవడం పిల్లలకి నేర్పాలి.

బట్టలు నీటుగానూ వుపయోగంగానూ వుండేట్టు బుద్ధి నుపయోగించి కుట్టించాలి. ఫాషన్లూ అందాలూ ముఖ్యం గా చూసుకోకూడదు. బట్టలు పిల్లలు తమంతట తామే వేసు కునేందుకు వీలుగా వుండాలి. వెనక గుండీలూ, హుక్కులూ, మానాలి.

ఆడపిల్లలకీ మొగవాళ్లకీ ఒకే మోస్తరు బట్టలే వెయ్యాలి. జుట్టు మొదలైనవి ఒక మోస్తరుగానే వుంచాలి. పిల్లలకు స్వతంత్ర బుద్ధికలిగి తనకి తాను బట్టల విధమూ జుట్టు విధము నిర్ణయించుకోగానే, బిడ్డయిష్ట ప్రకారమే వుంచు కోనియ్యాలి. పెద్దవారడ్డపెట్టకూడదు. „గిలజాలు వొద్దు, నేను క్రాపు పెట్టుకుంటానంటే'' సరేననాలి ఆబాధ్యతంతా బిడ్డదే; పెద్దవారు వహించకూడదు. క్రాపుకి డబ్బుకావాల

లంటే, వుంటే యియ్యవచ్చు, లేకపోతే, మనం క్రాపుకి డబ్బు యిచ్చుకునేటంత భాగ్యవంతులం కాదు. నీకు డబ్బు రాగానే క్రాపు చేయించుకో. అనాలి. పట్టు చొక్కాలడిగినా అంతే "నేను పెద్దజుట్టు పెంచుకుంటాను" అంటే, "పెంచుకో, కాని ఆజుట్టు దువ్వుకోడం, మొదలైన పనంతా నువ్వే చూసుకోవాలి" అనాలి. అది అందవికారమైన బట్టలూ, వేషాలూ వేస్తోవుంటే దానికి అందమైన మార్గాలు చూపించాలి. కాని బలవంతం చెయ్యకూడదు. మొక్కుకికన్నా వెళ్ళేప్పుడు "అట్లాంటిది మర్యాద కాదు. కనక నిన్ను నాతో తీసుకు వెళ్ళడానికి వీలులేదు." అనవొచ్చు. కాని కారణం నిజమైనది ఐవుండాలి. పిల్లల్ని భడిపించి పెద్దవారి ప్రూవాలకు లోబరుచుకోడానికి ఆమాటలనకూడదు.

పిల్లలకి యిష్టంలేనిది బలవంతంగా బట్టలు వెయ్యడం నగలు పెట్టడం చాల ఘోరం. ముఖ్యంగా తమ కులాసాకోసం తను గొప్పకోసం, పిల్లలకి బలవంతంగా అలంకారాలు చెయ్యరాదు; గొప్పఖరీదునగలవి వేసినా, "జాగ్రతగా వాడుకో" అని చెప్పవొచ్చు; కాని అతని ఆటకు అన్ని భంగంకాకూడదు, ఆటలాడి చింపితే శిక్షించకూడదు. నగలు పారేస్తే కోపంచెయ్య

కూడదు. అసలు నగలు పెట్టనేకూడదు. బలవంతంగా ముక్కు
లు చెవులూ కుట్టి బిడ్డను బాధపెట్టడం హింస అని తెలియని
మూర్ఖులు వేసవేలు.

నగలూ బట్టలూ వేసి పిల్లవానికి తన అందంలో,
తన బట్టల గొప్పతనంలో గర్వం కలగ చెయ్యకూడదు. అట్లా
చేస్తే బట్టలవల్ల గొప్పతనం నిర్ణయించడం అలవాటు అవు
తుంది. ఇంకొకరికన్న తాను బట్టలవల్ల అధికుడననుకోని
కూడదు. అతని అందాన్ని పొగడకూడదు.

"ఛేస్టు" నేర్పాలిగాని, అందంలో అహంభావం
తెప్పించకూడదు.

శుభ్రం

పుట్టినప్పటినించికూడా సరైన వేళకి స్నానమూ, వొంటిని
శుభ్రముగా వుంచడమూ శ్రద్ధవహించాలి.

బిడ్డ కొంచెం పెద్దదికాగానే పళ్ళుతోముకోడం, అల
వాటు చెయ్యాలి. ప్రతిరోజూ పెద్దవారితో ఆటగా పళ్లుతోమి
స్తే అదే అలవాటై పోతుంది

తనే స్నానం చెయ్యడం త్వరలో పిల్లకి నేర్పాలి. యే విధంగా నీళ్లు పోసుకోవాలో నిర్ణయించుకోడం ఆమెకి స్వతంత్రముండాలి. యిష్టంలేంది తలంట్లు పోసి యేడిపించకూడదు. బిడ్డ అపరిశుభ్రమవుతుందని బిడ్డ ఆటల్ని అభ్యంతరపెట్ట కూడదు. స్వేచ్ఛగా బురదలో నీళ్లలో, మన్నులో, యిసికలో ఆడనివ్వాలి. జుట్టు బట్టలు, అన్నీ పాడైనాసరే యెన్నిసార్లైనా సరే, విసుక్కోక, కోప్పడక, పిల్లన్ని శుభ్రంచెయ్యాలి. వాళ్లనే శుభ్రం చేసుకోమనాలి.

యీ అలవాట్లన్నీ బిడ్డకి తెలికుండానే యుక్తవయసులో మొదలుపెట్టి స్థిరపరిస్తే, తరవాత పోవాలన్నాపోవు. కాని యీఅలవాట్లు స్థిరపరిచేప్పుడు బిడ్డకి కష్టమేమాత్రమూ కలగనీకూడదు.

మురికి ఐనప్పుడల్లా తనే శుభ్రపరచుకోడమూ, వొంటిమీద అపరిశుభ్రం సహించకపోవడమూ, తన శరీరంమీదా, దాని నిర్మలత్వం మీదా గౌరవమూ, బిడ్డకినేర్పాలి. వూరికే సూచిస్తే చాలు, బిడ్డ తెలుసుకుంటుంది. నోట్లోనూ, ముక్కుల్లోనూ వేళ్ళు పెట్టినప్పుడు కడుక్కోడమూ, ముక్కుకారుతో వుంటే తుడుచుకోడమూ, మొదట్లోనే

అలవాటు చెయ్యాలి. ఈవిధమైన అలవాట్లవల్ల బిడ్డ శరీరా రోగ్యానికేగాక, నైతికారోగ్యానికి చాలా సహాయం కలుగుతుంది.

వ్యాయామం

మొదటినెల దాటగానే పిల్లని మంచాల్లోనూ, తొట్లలో వుంచడంమాని చాపేసి కింద స్వేచ్ఛగావుంచాలి. మన్నూ హానికరమైన వస్తువులూ దూరంచెయ్యాలి. మెత్తకోకూడదు. మెత్తైనవాటిమీద పడుకోపెట్టకూడదు. రాత్రులైనాసరే బిడ్డకి ప్రత్యేకం మెత్తతక్కువ మంచం వెయడం విధి.

రోజూ పొద్దునా, సాయంత్రమూ, మొదటినెలనించీ, బిడ్డని వూరిబైటికి షికారు తీసుకువెళ్లడంవల్ల చాలా ఉపయోగం కలుగుతుంది. బిడ్డ స్వేచ్ఛగా పాకడానికి, నడవడానికీ, యిల్లంతా తిరగడానికీ, యేమాత్రమూ అభ్యంతరం వుండకూడదు. పైగా వుత్సాహంగా ఆడుకుని అల్లరిచేసేట్టు మాటలతోనూ, బొమ్మలతోనూ ప్రోత్సహించాలి, పెద్దవారు. నిర్జీవంగా, బద్ధకంగా, బిడ్డవుండనేకూడదు. నిచ్చనలూ, కర్రలూ కొయ్యగుర్రాలు మొదలైనవి శరీరవ్యాయామానికి తోడ్పడతాయి. ఇంకా పెద్దైన తరవాత బిడ్డకి తక్కిన బిడ్డల జతచేసి,

రోజంతా, ఆటలతో, పాటలతో, గంతులతో, అరుపులతో, గోలతో సంతోషంగా కాలంగడపనివ్వాలి

యేడుపు

బిడ్డకి మాటలు రాకముందు, యేడిస్తే, యేడుపుకి కారణం తెలుసుకోవాలి. కారణంలేకుండా యేడుస్తూవుంటే, అలిసి వూరుకున్నదాకా యేడవనియ్యాలి. యెత్తుకోకూడదు బిడ్డవేపు చూడకూడదు. మాట్లాడకూడదు. బిడ్డకి యెదన్నా అవసరముంటే ఆ సహాయం చేసి వూరుకోవాలి.

పిల్లల్ని యెన్నడూ యెత్తుకోకూడదు, వాళ్ళల్లో కూచోపెట్టుకోకూడదు. బిడ్డనేచూస్తూ, దాన్నికేంకావాలో అని ఆదుర్దాపడుతూ దానికి పాటలు పాడుతో కనిపెట్టుకుని కూచోకూడదు. జబ్బుగా వున్నాసరే. బిడ్డ స్వేచ్ఛగా స్వతంత్రంగా, వొంటిరిగా ఆడుకోవాలి, నిద్రపోవాలి. బిడ్డతో పెద్దవాళ్ళు మాట్లాడ్డానికి ఆడుకోడానికి ప్రత్యేకం వేళ వుంచుకోవాలి, పెద్దవారికి తీరుబడి అయ్యేవేళ.

తల్లితండ్రులకి యింక తనేగొప్ప అని, యింక తను లేకపోతే వాళ్ళు బతకరనీ, తను బాధపడితే, వాళ్ళూ బాధపడ

కారనీ, తను వాళ్ళని యేడిపించగలననీ, ఆడించగలననీ బిడ్డకు అభిప్రాయమేర్పడకుండా జాగ్రతపడాలి. పిల్లలకొరకై బాధ్యతా కష్టమూ పడాలి. కాని అట్లా ఆదుర్దాపడుతున్నామనే సంగతీ, వాళ్లసుఖం తమకి చాలా ప్రాముఖ్యమనీ పిల్లలకు తెలియనీయకూడదు. పిల్లల్ని మోసపుచ్చాలని కాదు. ఆదుర్దావున్నా కనపరచవొద్దని అభిప్రాయం.

బిడ్డయేడిస్తే ఆయేడుపుతో పెద్దవాళ్ళకేమీ జోక్యం లేనట్లుండాలి. యేడుస్తూ యెదన్నాఅడిగితే, "అది యిచ్చేవాణ్ణే కాని, నువ్వుయేడుస్తూ అడిగావు కాదూ అందుకుని వీల్లేదు." అనాలి. బిడ్డయెదన్నాకోరితే, వీలైనంతవరకు కోరిక నరవేర్చాలి. కాని వీల్లేనిదే నిరాకరించిన తరవాత, యెంత యేడ్చినా, మొత్తుకున్నా, గొంతుక చించుకున్నా, నిరాకరణాన్ని మానకూడదు.

యేడుపు విషయమై పెద్ద సెంటిమెంటు వుంది మనుషులకి. వూరికే అడిగితే, ముందుయివ్వరు. యేడుస్తూ అడిగితే, యింకా మారాం పడితే,అప్పుడు యిస్తారు. కొడతారు. తిడతారు చివరికి యిస్తారు. దానితో బిడ్డనేర్చుకుంటుంది, యేడిస్తే తప్ప

వనకి కోర్కెలు సాగవని. మొదట యేడ్పినప్పుడే పట్టుగా కోర్కె నిరాకరించి స్థిరంగావుంటే, యేడుపువల్ల లాభంలేదని తెలిసేట్లుచేస్తే, బిడ్డకు ఆ అలవాటు పోతుంది.

యేడుపుని భరించలేరు మనుషులు. దేనికై బిడ్డ యేడుస్తోందో అది తీర్చలేకపోతే వూరుకోమనడమో తిట్టడమో కొట్టడమో మరో చెయ్యకండా వూరికేవుండలేరు.

పసితనంలో బిడ్డయేడుపుకి కారణం వుంటుంది. ఆకారణం తెలుసుకునే తెలివివుంటే తెలుసుకుని అబాధని నివృత్తి చెయ్యాలి, లేకపోతే వూరుకోవాలి. అంతేగాని అరవకూడదు, తిట్టకూడదు, ఎత్తుకోకూడదు. ఎత్తుడుమరిగి చాలసార్లు యేడుస్తారు. ఏడిపించి యేడిపించి మొన్నడు మెత్తుకోక ఆయేడుపు అలవాటుమాన్పాలి. కడుపు నొప్పిలో అజీర్ణంలో పొట్ట వుబ్బి యేడుస్తూవుంటే దయగలతల్లులు పాలుపడతారు. అతిపికి పాపం బిడ్డ వూరుకుంటుంది అప్పటికి. ఆతల్లులకి తెలివిలేదు. సంఘం తెలివినివ్వదు. తండ్రులకి పట్టదు. ఇట్లాంటి క్రూరహత్య స్వంత పిల్లలకి జరుగుతూనే వుంటుంది; ప్రతిదినము యీతండ్రిగారు మాత్రం పంజాబు హత్యలకీ బెంగాలు వరదలకీ ధనంపోగుచేస్తూనూ శిశుఆరోగ్యవారం మీటింగులు

చేస్తూనో వుంటాడు. ఆభార్యకి మాత్రం తెలివి తెప్పించలేదు తన అధికారం చలాయించలేడు. ఆభార్య అంత మూర్ఖురాలుగా వుండకపోతే లేచిపోతుందని భయం

ఇంక కొంచెం పెద్దైనాక పెద్దల మనసులు కరిగించి తమ కార్యాలు కొనసాగించుకోవాలనే పిల్లలు ఏడుస్తారు. ఏడుపుమాత్రం పాడికొద్దీ వస్తారు. యీ ఏడుపే బాగా అలవాటై పెద్దవాళ్లై, ఆడవాళ్ళు పనిమిటి దగ్గిర యేడుస్తారు మొగవాళ్ళుకూడా లోకంలో తమకి కావలసిందంతా దొరకనప్పుడు అందరితోనూ మాటలలో చెప్పుకునియేడుస్తో శోకమంతా దానికి బాధ్యత కలిగినట్టు అందర్నీ తిడతారు. తమతో సానుభూతిని చూపలేదని పోట్లాడే వాళ్లూ, తగాదాలవాళ్లూ సణుగుళ్లవాళ్లూ, వీళ్ళందరూ చిన్నప్పుడు యేడుపుకి అలవాటుపడ్డబిడ్డలే. అంతాతమకే కావాలని యెవరికీ పంచకదాచుకునే భాగ్యవంతులూ తమకు లేదని యీర్ష్యతో యేడ్చే బీదవాళ్లూ, లేని జబ్బులతో బాధపడి వుత్తగోలలు పెట్టేవాళ్ళూ, అందరూ చిన్నప్పటి యేడుపు గొట్లే

యింటో యేడుపనేది వినపడకండా చెయ్యడం పెద్దవాళ్ల ముఖ్యమైనవిధి. యేడుస్తూవుంటే మాట్లాడకండా వొద

ండమూ, కొంచెం బిడ్డపెద్దదికాగానే యింటో యేడవనీక దొడ్లోకిపోయి యెవరి వినపడకకుండా యేడ్చిరమ్మనడమూ, చెయ్యాలి. దెబ్బతగిలినా సరే అంతే. యేడవడం అసహ్యమైన పని అనిన్నీ, యింక తప్పని సరియైనప్పుడు యితరులకి కనపడకుండా చెయ్యవలసినపని అనిన్నీ, నేర్పాలి

అలవాట్లు

మనుష్య జీవితం అలవాట్ల సమూహం. దేహశుచీ అశుచీ నీతీ అవినీతీ సర్వమూ అలవాట్లే. నీతిమంతులమనేవాళ్లందరూ అలవాట్లకు దాసులే. ప్రొద్దున్నే చన్నీళ్లస్నానం అలవాటైతే, ఆ అలవాటులేని వారికి ఆ స్నానం చెయ్యడం యెంతకష్టమో, ఉన్నవారికి స్నానంమానడం అంత కష్టమే. బూతుమాటలలవాటైన వారికి మానడం యెంత కష్టమో, అలవాటులేని వారికి ప్రయత్నించినా, అవి వుచ్చరించడం అంతకన్న యెక్కువ కష్టం. అబద్ధమో నిజమూ కూడా యిట్లానే అలవాట్లు. యెంత ప్రయత్నించినా మనిషిని చంపగలరా? దయార్ద్రహృదయుడైనా వాళ్లకి అలవాటుగనక సిపాయిలూ రాజులూ యుద్ధంలో శత్రువుల్ని చంపుతారు. కనక అలవాట్లమీద జీవితమంతా

దాని గొప్పతనమూ అల్పత్వమూ ఆధారపడివుంది. చిన్నప్పుడు అయ్యే అలవాట్లింక యెన్నటికీపోవు, మంచికీ చెడ్డకీ కూడా

పూర్వ జన్మనించి గుణాల్ని మనం తెచ్చుకుంటున్నామనే వేదాంతం నిజమైనా కాకపోయినా, పిల్లల శిక్షణ విషయమై దాన్ని మరిచిపోవాలి

శ్రమపడి బిడ్డలకు మంచి గుణాలే అలవాటుచేసి, దుర్గుణాల్ని నివారించి, నేర్చుకునే దుర్గుణాల్ని పోగొట్టగల శక్తి తమలో వుందని పెద్దవారు నమ్మాలి. పుట్టేప్పుడే పూర్వజన్మకర్మ ప్రకారం యేవో గుణాలతో పుడతారు, వాటిని మార్చడం యీశ్వరుడికితరం కాదనే కర్మవేదాంతం వాదించినా, దాని ప్రకారం నడచుకునే మూర్ఖుల్ని చూడబోము. అట్లానే నమ్మితే యీపుస్తకం చదవనూ అక్కర్లేదు, బిడ్డలయెడల శ్రద్ధ తీసుకోనూ అక్కర్లేదు. బిడ్డల్ని బాగుచేస్తామనుకుని వారిని కొట్టేప్పుడూ తిట్టేప్పుడూ ఆ వేదాంతన్ని మర్చిపోతోనేవున్నారు. కర్మ సిద్ధాంతంలోనైనా మనిషికి జరిగే కష్టసుఖాలు శాసింపబడతాయన్నారుగాని, అతని గుణాలు నిర్ణయింపబడతాయనలేదు. సుఖదుఃఖాలు పూర్వజన్మకర్మప్రకారం కలిగినా

వాటిని అనుభవించేపద్ధతి, వాటివల్ల పాశాల్ని నేర్పుకుని శా గుపడడమూ, వాటివల్ల నాశనము కావడమూ, మనిషి గుణాల మీద స్వభావంమీద, ఆధారపడి వుంటుంది. అలవాట్లద్వారా ఆగుణాల్ని పెద్దవాళ్లు చాలవరకు బిడ్డలో యేర్పరచగలరు.

ఆదిగాక మనిషిబుద్ధి యెప్పుడూ చెడుపే లాగుతుం దనీ, యెంతో ప్రయత్నంమీదగాని, యెన్నో దెబ్బల వల్లగాని, బిడ్డల్ని మంచితోవకి తీసుకురాలేమనీ, మనుష్యులు పాపంలో పుట్టారనీ, సంసారం పాపభూష్టమని, కోర్కెలు తుచ్ఛమని, బిడ్డయెప్పుడూ దుర్మార్గానికే ప్రయత్నిస్తుందని, బోధించే తుచ్ఛశాస్త్రాలని తగలవెయ్యాలి. మనుషులస్వభావం గుర్తెరగని మూర్ఖులు, తమయింద్రియాల్ని గ్రహించుకోలేని రోగిష్టులు, దుర్మార్గులు వ్రాసిన తప్పుడు వ్రాతలవి. బిడ్డల స్వభావమెప్పుడు సన్మార్గానికే ప్రయత్ని స్తుంది. దుర్మార్గమని తెలీక బిడ్డ పొరబాటుపడుతుంది. ఆపొరబాటు ప్రేమతో దిద్దడం పెద్దవారివిధి. అలవాట్లవల్లనే చెడు మార్గాలేర్పడతాయి. ఆచెడు అలవాట్లేర్పడకుండా పెద్ద వారు సహాయం చెయ్యగలరు. చెయ్యడంవారి విధి.

బిడ్డకి మంచి అలవాట్లను కలగచేస్తే వాళ్లకి చెడ్డపనులు చెయ్యడం కష్టమౌతుంది. చెడ్డ అలవాట్లనూ బిడ్డలకు రానిచ్చినా, వాళ్లని వుపేక్ష చేసినా, మంచిపనులు వారికి కష్టమౌతాయి. పిల్లల్ని పెంచడం చాతగాక, అలవాట్లని దిద్దడానికి అలవరచడానికి బద్ధకపడి, యెదోపూర్వ జన్మప్రకారం కాలక్రమంగా జరుగుతుందని నల్లమందు వేదాంతాన్ని నమ్మి, కొత్త జ్ఞానమంటే వులికిపడుతో లోకమిట్లా పడివుంది.

బిడ్డని కవీశ్వరురాలో, శూరురాలో, ఆరోగ్యవంతురాలూ, నీతివంతురాలూ, చేసేశక్తి పెద్దవారిలో కొంతవరకన్నా వుంది, ఆశక్తివున్నా లేకపోయినా, బిడ్డమాత్రం దుర్మార్గురాలూ, అవివేకీ నిష్ప్రయోజకురాలూ, ఐతే, ఆతప్పిదం చాలావరకు తలితండ్రులది.

తప్పుడుదోవలకీడ్చే యింద్రియాల్ని మనోబలఛాత శమదమాలచాత, కట్టసి, మంచిమార్గాని కీడ్వాలనే వేదాంతం శుద్ధఅబద్ధం, రుషులు చెప్పనీ, వారి తాతలుచెప్పనీ. ఇంకా అలవాట్లు యేర్పడని విషయాలలో యింద్రియాలు బుద్ధిని యీడుస్తాయి. అలవాటు యేర్పడ్డవిషయాలలో యీడవ్వు.

పొద్దున్నే సిగరెట్ కాల్చమని. ఆ అలవాటున్న వాణ్ణి యింద్రియాలు యీడుస్తాయి. అందర్నీ యీడుస్తాయా? అట్లానే పొద్దున్నే టెన్నిస్ ఆడడం అలవాటున్నవాణ్ణి ఆడమని యీడుస్తాయి. లేవగానే పళ్ళుతోముకోడానికి శమదమాలు వుపయోగించాలా? కనపడ్డ మనుషులనుఖ్ఖలుకొట్యాలండామనంయేం నిగ్రహముపయోగించాలి? ఆ అలవాటున్న వాళ్ళు వుపయోగించాలి ఆనిగ్రహం. ప్రతిపనికీ, గుణానికీ, యింద్రియాలిట్లా యీడుస్తూ వుంటే యింక మనుషులెవరికీ వేరేపని వుండదు, తమ యింద్రియవాంఛలతో నిగ్రహాన్నీ శమదమాల్నీ వుపయోగించి, పోట్లాడడం తప్ప. ప్రతినిమషమూ, చూసినదితాయి తినాలనీ, అందర్నీ తన్నాలనీ, దొంగిలించాలని, స్త్రీలనెత్తుకుపోవాలనీ తోస్తూవుంటే బతకడమెట్లా? మంచి తోవల మంచిపనులు చేసే అలవాట్లులేని వాళ్ళని యీడుస్తాయి యింద్రియాలు. రాత్రిపదిగంటలకి నిద్ర అలవాటున్నవాడు పడుకుంటాడు, ఆ అలవాటులేనివాడూ ఆ అలవాటుని చెడుపుకున్నవాడూ, నిద్రరాక యేంపనిచెయ్యాలా అని ఆలోచిస్తారు. చదువుకునే అలవాటున్నవాడు చదువుకుని ఆరోగ్యం చెడగొట్టుకుంటాడు. తాగేవాడు తాగి ఆ అలవాటు వృద్ధిచేసుకుని పాడౌతాడు.

కనక మంచిపనులకంటె చెడ్డపనులు చెయ్యటం సులభమని బోధించే వేదాంతం శుద్ధఅబద్ధం. మానవస్వభావం, ముఖ్యంగా చిన్నపిల్లల స్వభావం, యెప్పుడూ సన్మార్గము వేపే ప్రయత్నిస్తూ వుంటుంది. కాని పరిస్థితులవల్ల కలిగిన, చెడుఅలవాట్లనించి తప్పించుకోలేక, తంటాలు పడుతో వుంటుంది. చెడు అలవాట్లు కలవాడికి మంచిపన్లు చెయ్యటం యెంతకష్టమో, మంచిఅలవాట్లు కలవాడికి చెడ్డపన్లు చెయ్యడం అంతేకష్టం.

అలవాట్లు లేనివాడు, యీప్రలోభనాలతో పోట్లాడి, తనకున్నశక్తిని వృధాచేసుకుని అలిసిపోతాడు. మంచిఅలవాట్లున్న వాడికి పాడుకోర్కెలు అవిషయాల కలగనే కలగవు. యుద్ధమే అనవసరం.

పెద్దవాళ్లు నేర్పినా నేర్పకపోయినా పుట్టిన నిముషాన్నించి పిల్లకి అలవాట్లేర్పడుతోనే వుంటాయి. మంచివాటిని ప్రవేశపెట్టకపోతే చెడ్డవిఅలవాటవుతాయి.

ఒకటేపనిని చాలసార్లు వరసగా చెయ్యడంవల్ల అలవాట్లు యేర్పడుతుంది. కనక అవసరమైన అలవాట్లు నేర్పరచడానికి, అవన్నీఒకేస్థలంలో ఒకేకాలంలో, ఒకటేవేళకు ఒకటేమోస్తరుగా బిడ్డచేత వరసగా చేయిస్తోవుండాలి. బిడ్డకు బుద్ధితెలికముందే, శరీరంవిషయమైన అలవాట్లన్నయేర్పడిపోవా

ఈ పళ్ళతోను [illegible] స్నానం, బట్టలు, మాటలు, శుభ్రత సిగ్గు, మొదలయినవన్నీ బిడ్డకు బుద్ధి తెలిసింతరవాత వారికే మాటలు చెప్పి వూరుకుంటారు కొందరు. "ధైర్యముగా వుండు," నిజము చెప్పు' అని చెప్పి పెద్దవారు వూరుకుంటే అలవాటు ఏర్పడదు. [illegible] [illegible] [illegible] [illegible] దగ్గ రాదు [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible], [illegible], [illegible] [illegible] [illegible] అన్నీ చేసి చూపి నేర్పాలి. అవని బాగా అలవాటయిందాకా ఒకసారికూడా చేయించడం మానకూడదు. అలవాటయిం తరవాత అప్పుడప్పుడు తప్పిపోతే, అవసరాన్ని బట్టి మాన [illegible] [illegible] [illegible] అలవాట్ల [illegible], [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible], [illegible] [illegible]. కాని యిటా [illegible] [illegible] అలవాటు తప్పిపోతుంది. [illegible] పెద్దవాళ్ళు బిడ్డతో కలిసి [illegible], [illegible] [illegible] [illegible] [illegible]

పురాణపఠనంవల్ల, చివాట్లవల్ల, దెబ్బలవల్ల, యేమీలాభం లేదు. బిడ్డకి నీతిఉపన్యాసాలిస్తే పురాణాలవలె, తనూ శుష్కనీతివచనాలను బోధించడం నేర్చుకొంటుంది, తనప్రవర్తనమాత్రం దిద్దుకోదు. లోకంపుట్టి నప్పటినించి, యిప్పటివరకూ, నీతులు వినడంవల్ల, పురాణాలు చదవడంవల్ల, ఒక్కరూ బాగుపడలేదు. లక్షలకొద్దీ దొంగలు తయారైనారు. చివాట్లవల్ల దెబ్బలవల్ల, బిడ్డ తనఅలవాట్లను. పెద్దవారిదగ్గిరనించి దాచుకుంటుంది, నిర్మూలం చేసుకోదు. ఈలోకంలోవున్న భీరులు, పెద్దవారి దెబ్బలవల్ల తయారైన పెద్దమనుష్యులే.

చెడుఅలవాట్లు యేర్పడ్డప్పుడు వాటిని ఒకటితరవాత ఒకటి మెల్లిగాపోగొట్టాలి, తొందర పడకూడదు. అసలు జాగ్రతగా పెంచితే, చెడుగుణాలు అలవాటు కానేకావు. అయినప్పుడు వూరికే "యీగుణం పోగొట్టుకో ఆగుణంపోగొట్టుకో" అని ఆజ్ఞాపిస్తే లాభంలేదు. బిడ్డబలహీనత్వాన్ని, ఆఅలవాటు యెందుకు యేర్పడ్డదో ఆకారణాన్ని తెలుసుకుని, బిడ్డతో కలిసి పెద్దవాళ్ళుకూడా ఆచెడ్డ అలవాటు పోగొట్టడానికి ప్రయత్నించాలి. పోగొట్టేబాధ్యత పెద్దవారిది. బిడ్డదికాదు. సంతోషంగా దయగా, తమాషాగా, ఆటలాడుతున్నట్లు, చెడ్డఅల

వాట్లని తొలిగించాలి. ఒకవారమో నెలో గడువు పెట్టాలి ఆ అలవాటు పొయ్యేందుకు. నోట్లో వేళ్ళు పెట్టుకోడం మాన్పించాలంటే— "యిది అసహ్యం మనం ఒకవారంలో యీ పని మానెయ్యడం నేర్చుకోవాలి" అని బిడ్డతో అనాలి. వేలు పెట్టుకున్నప్పుడల్లా 'వేలు' అని జ్ఞాపకంచేస్తూ వుండాలి. వారం పోకపోతే, యింకా పోలేదు. నువ్వు మరిచిపోతున్నావు. జ్ఞాపకముంచుకునేందుకు వొకపద్ధతికనిపెడదాం. యీ సారి వేలు పెట్టుకున్నప్పుడు, నేను "వేలు" అంటాను. అప్పుడు నువ్వు గోడనొకసారి తాకుతూ వుండాలి." అని బిడ్డతో చెప్పాలి. మూడోవారం వొకగుంజీతియ్యాలి. అప్పుడప్పుడు ఆగుంజీవని పెద్దవాళ్ళు కూడా చెయ్యాలి. ఎందుకంటే, అవనిని బిడ్డకు శిక్షలాగు కనపడనియ్యకూడదు. అప్పటికీ పోకుండా వుండవు చెడు అలవాట్లు. కావలిసే బిడ్డ చేస్తున్నట్టుంటే, అదొక జబ్బులాగు చూడాలి. తరవాత శిక్ష అవసరమౌతుంది.

తలితండ్రులు బిడ్డపైన ప్రేమా దయా కనపరుస్తూ వుంటే బిడ్డ తప్పకుండా చెప్పినమాట వింటుంది. కాని సకాలంలో

[illegible]
[illegible]
వాళ్ళు తమ చెడుఅలవాటని అలానే వుంచుకుంటే బిడ్డకి అది అనాయాసంగా కనపడుతుంది. కనక పెదవాళ్ళుకూడా తమ అలవాటని యిలా పోగొట్టుకుంటూ వుండాలి.

బిడ్డకి [illegible] వాటల్లో వుండేసూత్రాలు [illegible] తానికై ప్రయత్నించ మనాలి. అన్నం ముందు చేతులు కడుక్కడం మొదలైన అలవాటు శుభ్రమనే సూత్రం చెప్పాలి. అలా చెప్పితే కొత్త విషయాల్లో ఆ ప్రిన్సిపిల్ బిడ్డ వర్తింప [illegible]

శిక్షణ

అల్లరికీ, తిరగబాటుకి, కోపానికీ, చిరాకుకీ, అసంతుష్టికి, వీలులేని పరిస్థితులలో పిల్లల్ని పెంచాలి. అందరూ దయగా నవ్వుతో ప్రేమతో వుంటే పిల్ల అల్లరి చెయ్యదు. అల్లరి పెంకెతనమూ, యే కారణాలవల్ల కలుగుతాయో ఆలోచించి వాటిని తొలిగించే ప్రయత్నం చెయ్యవలసివుంటుంది. బిడ్డ "టెంపరమెంట్" కనిపెడితేనేగాని శిక్షణ కష్టమవుతుంది. ఒక్కొక్కప్పుడు వొంట్లో కులాసాగా లేక, బిడ్డ అల్లరి చేస్తుంది. మాటల్లో అసంగతి చెప్పలేకపోతుంది. అట్లాంటిది పెద్దవారు కనిపెట్టాలి.

బిడ్డతో మాట్లాడేటప్పుడు తాము గొప్పవారైనట్టూ అది క్షుద్రురాలైనట్టూ చూడకూడదు. ఆబిడ్డ తమతోసమానంగా పెద్దదైనట్టే పెద్దవారితో యెట్లా మాట్లాడతారో అట్లానే బిడ్డతోకూడా గౌరవంగా స్నేహితులతో మాట్లాడినట్టే మాట్లాడ్డం అలవాటు చేసుకోవాలి. బిడ్డ మనస్వాధీనంలో వుందికదా, అనే అభిప్రాయంతో ప్రవర్తించకూడదు. బిడ్డ

చెప్పింది శ్రద్ధగా వినాలి. దాని 'ఫీలింగ్సు' యెట్లావుంటాయో అని ఆలోచించాలి. దాని అభిప్రాయాలకూ, యిష్టానిష్టాలకూ, తగిన విలువనివ్వాలి. అది తెలియపరచలేని భావాలూ, కష్టాలూ, కనిపెట్టాలి దయా సానుభూతి కలిగివుండాలి. బిడ్డ అల్లరి చేస్తే దాన్ని యెట్లానన్నా అణిచి నిర్మూలం చెయ్యాలని విరోధివలె డీకొని, "నీశక్తి యెక్కువో నాశక్తి యెక్కువో, చూస్తాను. నిన్ను మాన్పించలేనా? నేనెంతవాణ్ణో నీకేం తెలుసు?'' అనేట్లు ప్రవర్తించకూడదు. యేమీ చేతకానివాడుకూడా, అందరిచాతా తిట్లుతినేవాడుకూడా తనభార్యమీద బిడ్డలమీదా అధికారాలు చేసి యిష్టం చెలాయించి బలవంతాలు చేసి, దెబ్బలుకొడతాడు. బిడ్డ యెందుకు అల్లరిచేస్తోందో. దానికిబ్బంది యేమో అర్థంచేసుకోవాలి. అదికావలసి అల్లరిచెయ్యదనీ. అది సదుద్దేశ్యంతో చేసినవని పెద్దవారి తెలియకపోవడంవల్ల అల్లరిగామారుతోందనీ, దానిఅల్లరికి పెద్దవారే బాధ్యులనీ విశ్వసించి, అది అల్లరిచేసినప్పుడల్లా పెద్దవారు తమ శిక్షణావిధానాన్ని తమ వివేకాన్ని సహనాన్ని పరీక్షించుకుని, లోపాల్ని కనిపెట్టడం మంచిది. కాని బిడ్డలో లోపాలకోసం వెతకడం పొరపాటు. యీసమస్యలు వొచ్చినప్పుడు తమమాట మీరాడే అనే

అహంభావం మాని వోపికపట్టి, శ్రద్ధవహిస్తే, తరవాత చాలా యిబ్బందులు తప్పిపోతాయి.

అన్నిటికన్నా ముఖ్యవిషయం, పెద్దవారు బిడ్డని ఆజ్ఞలు పెట్టి చేయిస్తున్నట్టూ బలవంతం చేస్తున్నట్టూ వుండకూడదు. బిడ్డ తనంతట తనయిష్టప్రకారమే తనని తనే అదుపులో పెట్టుకునేట్టు ప్రోత్సహించాలి. అందులో నేర్పుంది తెలివంతా, నేర్పరితనమంతా. బిడ్డ శిక్షణంతా ఆటలాగుండాలి. చీట్లాడుతున్నారు. రంగుకి రంగు వెయ్యాలి అనే నియామకముంటుంది. తమంతట తామే వొప్పుకుంటారు. ఆనియామకానికి ఆడేవాళ్ళు ఆనియామకాలకి లోబడేందుకు యెవరన్నా బలవంతం చెయ్యాలా? ఆనియామకాలు ఆడేవాళ్ళు యేర్పరచుకున్నవే. అవి వుంటేనే కాని ఆటసంతోషమే లేదు- యిట్లో శిక్షణా అంతే. పెద్దవాళ్ళూ చిన్నవాళ్లూ కలిసి కొన్నినియామకాలు యేర్పరచుకుంటారు. చిన్నవాళ్ళు నియామకాలు మరిచిపోతారు, గనక పెద్దవాళ్ళు జ్ఞాపకం చేస్తారు అంతే.

చాలమంది అనుకోడం యేమిటంటే- పిల్లలబుద్ధి యెప్పుడూ అల్లరివేపూ దుర్మార్గానికీ యీడుస్తూ వుంటుందనిన్నీ

పెద్దవాళ్ళు దెబ్బలతోనూ చీవాట్లతోనూ వాళ్ళని సన్మా ర్గానవుంచాలనీ. కాని నిజం ఆలోచించి చూస్తే, పిల్లలకి అల్లరి చెయ్యాలని వుండదు. వాళ్ళకీ మంచివాళ్ళుగానే వుండి సుఖ పడాలనే వుంటుంది. దెబ్బలూ చివాట్లు వాళ్ళకి గుర్తుండవు, పెద్దవాళ్ళని యేడిపిస్తే వాళ్ళకేమీ సంతోషంలేదు. కానివాళ్ళ కిప్రవర్తించవలసిన మార్గం తెలీక యెట్లా తమశక్తుల్ని అభివృద్ధి పరుచుకోవాలో అర్థంగాక, పెద్దవాళ్ళ ఆజ్ఞలూ యిబ్బందులూ స్పష్టంకాక, తటపటపడతారు.

అల్లరిపనులవల్ల కలిగిన ఆనందంకన్న వున్నతమైన ఆనందమిచ్చే కార్యాలున్నాయాని చూపడం పెద్దవాళ్ళవిధి, పెద్దవాళ్ళఆజ్ఞలకన్న అయిష్టంకన్న దెబ్బలభయంకన్న బలగల ఆమోఘాలైన మహాశక్తులు బిడ్డల్ని అనేక కార్యాలకి పురిగొల్పుతో వుంటాయి. వాళ్ళఅల్లరికంతా అదేకారణం. పెద్దవాళ్ళు యెంత వాటిని నిర్మూలం చెయ్యాలనిచూసినా, అవి నిర్మూలంకావు. బిడ్డ నిర్మూలమూ కాదుమధ్య, ఆశక్తుల్ని, అర్థం చేసుకుని వాటిని క్రమమైన మార్గాల ప్రవహింపచెయ్యడం పెద్దవారివిధి. పిల్లలపనులు అల్లరికాకుండా చేసుకోడం పెద్ద

వారి తెలివిలో వుంది. బైట బంతులెగరేస్తే ఆట. యింటో యెగరేస్తే అల్లరి, అంతే భేదం. బిడ్డని యేంచేసినా సరే, బయూలెగరెయ్యడం మానదు. బంతులెగరెయ్యని పిల్లపనికిమాలినది. బంతులెగరెయ్యకుండా అదిమితే, బిడ్డపనికిమాలినదౌతుంది. కనక బైటనే బంతులెగరేసేట్టుగా బిడ్డని శిక్షణలో వుంచడమే నేర్పరితనం. ఒకపని ఒకవిధంగా చేస్తే మంచిదీ; యింకొకవిధంగా చేస్తే అల్లరీ అవుతుంది. బిడ్డచేసేపని అల్లరిగా పరిగణించడానికి పెద్దవారి తెలివితక్కువ ముఖ్యకారణం.

క్రమమైన శిక్షణకి ముఖ్యం సరైనఅలవాట్లు. మంచి అలవాట్లని చేశారా, యింకఅల్లరిలేదన్నమాటే. యింకా అలవాట్లుగా యేర్పడని కొత్తవిషయాలు బిడ్డ యెదుగుతున్నకొద్దీ సంభవిస్తూవుంటాయి. ఆకోర్కెలన్నిటినీ బిడ్డఅణుచుకోవాలని పూర్వాభిప్రాయం. తంతామనే భయంవల్ల బిడ్డల్ని సాధిస్తారు. కాని అది అదివరైన మార్గంకాదు. ఆకోర్కెలు అక్రమమైనవైతే, అని అణుకోడంవల్ల ప్రస్తుతం కష్టంకలిగినా, ముందు సుఖం కలుగుతుందని బిడ్డలు నేర్చుకునేట్టు చెయ్యాలి. ఆభవిష్యత్సుఖం కోసం యీవర్తమానసౌఖ్యాన్ని

వాక్షులుకోవాలి. ఎవరన్నా తినడానికి పళ్ళిస్తారు. అప్పుడే అతిథివరక భోజనందాకా దాచుకోడం అలవాటు చేసివుంటే, దాచిపెట్టుకుంటారు; అప్పుడే తింటామనే అల్లరివుండదు. 'భోజనంలో కలిపితింటే, యింకా బాగుంటుంది. అప్పుడు చాలా తినవొచ్చు, యిప్పుడుతింటే అజీర్ణం" అని తెలియచేసి, ఆ కోర్కని అణుచుకోడం నేర్పాలి. అలవాటు ఐనవిషయంలో పెద్దవారి జోక్యమే అక్కర్లేదు; బిడ్డే సరిగాచేస్తుంది. కనక మంచిఅలవాట్లని వృద్ధిచెయ్యడమూ, చెడుఅలవాట్లని తప్పించడమూ ముఖ్యమైనపని.

పుట్టిన ఆర్నెల్లలోపున బిడ్డఅల్లరి ఎరగదు. కనక ఆవయసు లోపల శిక్షలువుండవు. అంతకన్న చిన్నవయసులో కూడా, బిడ్డల్నికొట్టేమాతృదేవతలు లేకపోలేదు. బిడ్డగొంచెం గుర్తించడం తొమ్మిదో నెలనించి మొదలు. అప్పుడు చెడ్డపనిచేసినప్పుడు పెద్దవారి ముఖంలో అయిష్టమూ, మంచిపనికి సంతోషమూ కనపరిస్తే చాలు.

సంవత్సరం నిండితేనే కాని, తప్పుచేసిందని బిడ్డపైన పూర్తిగా కోపంచూపకూడదు. ఒకసారి కోపంచూపి పూరుకోవాలి గాని, ఆదేపనిగా పీడించకూడదు.

యెప్పుడూ ప్రేమగా సంతోషంగా, స్నేహంగా పిల్ల వాడి యెడలవుంటే, కొంచెం కష్టం, కోపం, విచారం, విముఖత్వం చూపితేచాలు; అంతకన్న శిక్షం అక్కర్లేదు. సాధించటం, పిసినించడం, తృణీకరించడం, వెక్కిరించడం, యివేమీ యేమాత్రమూ పనికిరావు. కోపం చూపేప్పుడు కంఠం హెచ్చించకూడదు. సాధారణమప్పటి కన్న తగ్గించాలి.

శిక్షించే పరిస్థితులూ, శిక్షించే "ఎట్మాస్ఫియర్" వుండనీకూడదు.

బిడ్డతప్పుచేస్తే, కోపం తెచ్చుకోకూడదు. పెద్దవారు తమయెడల అపరాధంగా చూసుకోకూడదు. తమఆధిక్యత మరిచిపోవాలి. బిడ్డయేంచేసినాసరే కోపం తెచ్చుకోకుండా శిక్షణలో పెట్టుకోవాలి. కోపంపోతేగాని శిక్షకూడదు. యెప్పటిప్రేమ బిడ్డమీదకలిగింతరవాత విచారించాలి అవశ్యం. అల్లరిఅవస్థలో బిడ్డపడ్డదే అని జాలీ ప్రేమా కలగాలి, జబ్బుగావున్న బిడ్డమీద కలిగినట్టే. బిడ్డకిఆశ్చర్యమూ, భయమూ కలగచెయ్యకూడదు. స్నేహమూ సానుభూతి చూపాలి. దాని స్థితిలో తామున్నట్టుగా పెద్దవారు యోచించుకుని, బిడ్డయొం

దుకా అల్లరి చేసివుంటుందో యోచించాలి. ఒక వేళ తన 'యిన్స్టింక్ట్సు' వల్ల అట్లా చేశిందేమో! బిడ్డ బైట తిరిగి వొచ్చినందుకు కొట్టేవాళ్ళున్నారు. సృష్టిలో తిరగాలని కొందరూ, స్నేహితుల మీది ప్రేమ చేత కొందరూ, యింటివద్ద పరిస్థితులు బావుండక కొందరూ, తమ ఆట శక్తుల్ని వుపయోగపరచుకునేందుకు కొందరూ, బైటికి వెడతారు పిల్లలు. యీ సంగతులర్థం చేసుకోక, వాళ్లని దండించడం అన్యాయం. దెబ్బలన్నా తింటారుగాని వెళ్లడం మానరు. ఆ యిన్స్టిక్టు, అంతబలమైనది. పిల్లని తనకి లోబరుచుకుని ఆడిస్తుంది. ఆకలికొన్న కుక్క యెన్ని దెబ్బలన్నా తింటుందిగాని, అన్నం వెతకడం మానుతుందా? అది తన 'యిన్స్టింక్టు' ప్రకారం చేస్తే, దాన్ని యింకో అపాయం లేని మార్గాన తిప్పడానికి ప్రయత్నం చెయ్యాలి. బిడ్డ బైటికిపోతే యెందుకు కొట్టు బిడ్డని? అపాయం కలుగుతుందని. కనక అపాయం కలుగకుండా యెవరినన్నా వెంటపంపాలి. లేకపోతే, యింటిదగ్గిరే బిడ్డని ఆకర్షించేందుకు ఆటలు కల్పించాలి. 'బిడ్డయిన్స్టింక్టు' కారణం కాకపోయిన విషయాల్లో, పిల్లని నెమ్మదిగా పిలిచి, యెందుకు చేసిందో అడగాలి. అల్లరి పని చెయ్యగానే పిలవాలి. ఆలస్యం చెయ్యకూడదు. 'యింకా అల్లరి యెక్కువై యీసారి చేస్తే చూద్దాం లే' అనివూరుకో కూ

డదు. ప్రేమతో అడిగితే చెప్పుతుంది. చాలసార్లు దానికే తెలీదు. అప్పుడు కొంచెం ప్రశ్నలువేసి దానిమనసు దానికి తెలియ చెయ్యాలి; అది చేసినపని యెందుకు తప్పో, అదే చెప్పేట్టు చెయ్యాలి, కాని వాదన పెట్టుకోకూడదు.

'యిప్పట్టు' మంచితోవల మళ్లించేమార్గం ఆలోచించాలి. కత్తెరతో పంచలు కత్తిరించాడు. 'యెందుకు కత్తిరించావు!' అని అడిగితే, అతనికే తెలీకపోవచ్చు. కత్తెర వుపయోగించాలనే చేతిదురద సహజం. కనక కాయితాలిచ్చి, పిచ్చిబట్టలనిచ్చి పంచల్ని వొదిలి, వాటిని కత్తిరించమనాలి. బిడ్డబియ్యం పారపోశాడు. యెందుకు? చీమలకనో ఆటకనో అంటాడు. 'అట్లాపారపొయ్యకూడదు. పెద్దవారినడిగి, కొంచెంగా తీసుకువెళ్ళవొచ్చు' అనాలి. బియ్యం విలువ తెలియచెయ్యాలి.

పెద్దవాళ్లు చెప్పినా, తనుచేసినపని యెందుకు తప్పో తెలుసుకోకపోతే, పెద్దవాళ్ళమాట విని తప్పనివొప్పుకుని, ఆపని చెయ్యననాలి.

యింకో కొత్తఅల్లరి చేస్తే, మళ్లీయింతే. కాని చెయ్యొద్దన్నపని మళ్ళీచేసిందనుకో, దానికి మూడేకారణాలు.

1 మరిచిపోవడం.

2 చాతగాకా, నిశ్చయశక్తి లోపంచేతా.

3 నిర్లక్ష్యంవల్లా

యేకారణమో అడిగి తెలుసుకోవాలి. కారణం పెద్ద వాళ్ళు బిడ్డకి సూచించకూడదు. మరిచిపోవడమైతే, యీసారి మరిచిపోకుండా జ్ఞాపకముండడానికి, యేదో వొక మాట, మరిచిపోను, ముద్దులేనది అనడమో, రెండునిమషాలు వూరికే నుంచోడమో, యీసారి చేస్తావనిపించాలి. పాఠంమరిచిపోయినట్టే ఆబిడ్డ తనకి వుపయోగకరమైన పని మరిచిపోయినట్టు వుండాలి. మిఠాయి తినడం మరిచిపోయినట్టు, అంతా ఆటగా వుండాలి. శిక్షగా కనపడకూడదు. జ్ఞాపకముండడానికి యేంచేస్తుందో బిడ్డచేత చెప్పించాలి. బలవంతంలాగుండకూడదు. బిడ్డే తనకితాను శిక్షవిధించుకోడం చాలావుత్తమమైన పద్ధతి.

తక్కిన రెండుకారణాలూ బిడ్డ తనుఅర్థం చేసుకొని చెప్పలేదు. కనక పెద్దవారే అర్థంచేసుకోవాలి.

బలహీనత్వంచాత లోబడితే. దానికి కారణమాలోచించాలి. చక్కెరతింది. యిదివరకు తినసంది. మళ్లీతింది. ఎందుకు? తినాలనిపించింది; దానికి శిక్షలేదు. భోజనంలో మిటాయి పెట్టాలి. యింకా తినడంమానలేదు. ఇంకా చక్కెరతినాలనివుంది. అది ఆరోగ్యంకాదు. కనక నిగ్రహించుకోవాలి. కనక చక్కెరతినేబుద్ధి పుట్టినప్పుడు పెద్దవాళ్ళ దగ్గిరికివొచ్చి చెప్పాలి. పెద్దవాళ్ళు యింక వెగటుపుట్టేటట్టు బాగాతినిపించడం ఒకమార్గం. రెండోది కొంచెంకొంచెం తగ్గించి పెట్టడం రెండోది. నిగ్రహించుకోవాలనిచెప్పి, నిగ్రహం క్రమక్రమంగా నేర్పాలి. "నీకు యీపని చెయ్యకుండా వుండడంచాతకావటంలేదు. కనక నేను సహాయంచేస్తాను. మనిద్దరమూ కలిసి యీకోర్కెని నిగ్రహించేశక్తిని తెచ్చుకోవాలి" అనాలి. నిగ్రహించుకోవలసిన కారణంచెప్పాలి. చక్కెరతినడం అనారోగ్యం. కనక మితం నేర్చుకోవాలి. లేకపోతే అంతచక్కెర కొనడానికి డబ్బులేదు. కనక నిగ్రహం నేర్చుకోవాల'ని బోధించాలి.

నిర్లక్ష్యంవల్లచేస్తే భయపెట్టాలి. కొంచెం కోపంచూపడం అన్నిట్లోకీ గొప్పశిక్ష. అంతకన్న యేమాత్రయినా భయ

పెట్టకూడదను. అవనిమళ్ళీ చేస్తే, బిడ్డ తమనిర్ణయించుకున్న శిక్ష ని తాననుభవించాలి. ఒకకూర మానడమో. కొంచెం ఒక మూలనుంచుని ఆలోచించడమూ, మొదలైనవి.

బిడ్డ చెయ్యకూడనివని చేసినప్పుడు సహజంగానే శిక్ష కలిగేట్లైతే ఆశిక్ష కలగనియ్యాలి; పెద్దవారికి ఆయాసమేవుండదు. ముందుమాత్రం 'వారన్' చెయ్యాలి.' ఆబండమీద కాలు జారవొచ్చు, వెళ్లకు' అంటారు. వినక బిడ్డ వెడతానంటే, ఆప నక్కర్లేదు. వెళ్ళనియ్యాలి. పడితేపడుతుంది. అదేశిక్ష. రోడ్డు మీద వాళ్ళనవరినన్నా బిడ్డతిడుతుంది. ఇతరులను తిట్టడం మంచిపని కాదని చెప్పవొచ్చు: కాని ఆమాటవినక తిడతానంటే 'తిడితే వాళ్ళుకొట్టవొచ్చు' అనాలి. కాని అడ్డపెట్ట నక్కర్లేదు. వాళ్ళొచ్చి ఒకవేళ పెద్దవాళ్లతో చెపితే, 'ఆబిడ్డ మామాట వినలేదు. మీరే శిక్షించండి' అనాలి.

క్రమంగా పెంచిన బిడ్డ అలివిగాని అల్లరి యెన్నడూ చెయ్యదు. చాలా పెంకెతనమూ, దూకుడూ, తిరగబాటు చేస్తే, గదిలోకి పోయి గ్రహం వొదిలింతరవాత రమ్మనాలి. వెళ్ళకపోతే పంపాలి. అసలు భక్తిగలిగి యేమాత్రమూ శిక్ష

ణాలో పిల్లవాన్ని పెళ్ళనను. వెళ్లనన్నా, కోపగించకపవరచకూడదు 'నీకీఋణం పోవాలి, తప్పదు. యిదే చికిత్స (మందు)' అనాలి. బిడ్డకేదో జబ్బుచేసినట్లూ, పెద్దవాళ్లు దానికి ప్రేమతో మందులిస్తున్నట్టుండాలి. బిడ్డకేదో అల్లరిఆపద కలిగినట్లూ, అది యింకాఆపదలో పడిపోకండా పెద్దవాళ్లు కాపాడడానికి ప్రయత్నం చేస్తున్నట్లుండాలి. యిట్లాచెప్పడం వల్ల తలితండ్రులపైన బిడ్డకి విరోధంకలగదు. కరుపుచేస్తే, కోసి బాధకలిగించినట్టే

అందరితో అన్నంతినక పోవడం యిందుకే. కాని యీ పద్ధతిని చాలా సక్రమంగా వాడాలి.

యీనాడు యిట్లాచేస్తే, నిన్న యీప్రకారం శిక్షిస్తానంటే, అట్లాగే శిక్షించితీరాలి బెదిరించేప్పుడే ఆలోచించి తగినశిక్షలనే బెదిరించాలి. మాటనిర్లక్ష్యంచేసి, ఆతప్పే చేస్తే, ఆశిక్షని విధించితీరాలి. నీవు బద్దలుకొడతా నంటే బద్దలుకొట్టితీరాలి. ఆశిక్షభయంవల్ల బిడ్డ ఆఅల్లరిపనిని మానుతుందిలే. పెద్దశిక్షతో పూరికే బెదిరిస్తేనేం? ఆశిక్షే అవసరముండదని ఆశపడి, అలిపికాని శిక్షలతో, అన్యాయమైన శిక్షలతో బెదిరించకూడదు.

బిడ్డ చేసిన అల్లరికి 'ప్రిపోర్షనేట్' గా వుండాలి శిక్ష. ఆపిల్ల చేసిన పనుల పర్యవసానాల పైన ఆధారపడకూడదు. అగ్గిపుల్లతో ఆడడం తప్పే ఐతే, ముందే ఆఆటని ఆపాలి. కాని ఆడేప్పుడు బద్ధకించి వూరుకుని, తీరా యెదన్నా తగలపడితే మాత్రం, అప్పుడు శిక్షించకూడదు. పిల్ల కర్రతో ఆడుతున్నంతసేపూ వూరుకుని, కర్రతగిలి అద్దం పొరబాటున బద్దలైతే, కర్రతో ఆడినందుకు శిక్షించకూడదు.

గదిలోకి పంపడంకన్న, కొంచెం అవమానించడంకన్న, యెక్కువ శిక్ష యెప్పుడూ వుపయోగించకూడదు. సరిగా మొదటినించి శిక్షణలో వుంచితే యీ శిక్షా అవసరమే వుండదు. కాని యెంత చెప్పినా, అనాదిగా వొస్తున్న శిక్షలూ తిట్లూ, దెబ్బలూ యివ్వడం మానెయ్యమంటే మానరు. దెబ్బలు చాలా సులభమైన పద్ధతిగా కనపడతాయి. అదిగాక కొట్టకుండా పెంచేపద్ధతి కొత్తది. భూతాల్నీ, భూకంపాల్నీ చూస్తే ఎంతభయమో కొత్తపద్ధతుల్ని చూస్తే అంతభయం ప్రజలకి. యేమో! దెబ్బలులేక పిల్ల చెడిపోతే? యింతేగాక, తిట్టే, కొట్టే, అలవాట్లో పడతారు పెద్దవాళ్ళు. కోపం రాగానే పిల్లవాడి వీపుమీద చెయ్యిజాడిస్తేనేగాని వూరుకోలేరు, లేకపోతే చెయ్యితిమ్మిరి వొదలడమెట్లా? బూతులు తిట్టాలి!

లేకపోతే నాలికదురద యెట్లాపోదలుతుంది? కోపం అణుచుకోపడం యెంతశ్రమ? యెందుకదంతా? యిష్టంవొచ్చినన్ని తన్నులు తినేందుకు నోరుకేని, దిక్కుమాలిన పిల్లలు చేతికింద వున్నారుగా! అదిగాక దెబ్బలెంతసులభమైనపద్ధతి! అల్లరిచేసిన కొద్దీ బాదితే, యెవరికోసం వూరుకుంటుంది పిల్ల! పైగా యీ దెబ్బలు పిల్ల వుపయోగార్ధమేనని సంతుష్టి. యీతలి తండ్రులకి చాలమందికి ప్రేమవుండదు. వుత్త 'సెన్టిమెంటు': వున్న ప్రేమంతా తమమీదనేగాని, బిడ్డలమీద ప్రేమవున్నదనడం శుద్ధఅబద్ధం. ప్రేమలేదని వాళ్లకే తెలీదు. ప్రేమలేదని యెవరన్నా అంటే వాళ్లు రాక్షసులలాగు కనపడతారు.

శాస్త్రాలలోనూ, పురాణాలలోనూ, కథలలోనూ, నీతుల్లోను, బోధించి, వూహించిన, తలితండ్రులకు బిడ్డలమీద వుండనే ప్రేమకన్న అబద్ధం యింకోటి లేదు. నిజమైన ప్రేమ యెప్పుడూ, ఇతరుల సౌఖ్యానికై ప్రయత్నిస్తుంది. ఆసౌఖ్యం కోసం ఏత్యాగాన్నైనా చెయ్యడానికి వెనుతియ్యదు. నిజమైన ప్రేమే వుంటే, యిన్నివందల సంవత్సరాలనించి బిడ్డల్ని కొడుతోనేవుంటారా? బిడ్డల్ని కొట్టడంవల్ల తలితండ్రులకి బాధకలు

గుణోరంగా? కొట్టడం తప్పనిసరి అయివుండకదా, అనిపుఖ్యపడు తున్నారా? కొట్టకండా నిలులేదా. అని ప్రయాలు వెతుకు తున్నారా!

బిడ్డని కొట్టడంవల్ల పెద్దవారికి ఆనందం కలుగుతుంది. కొట్టాలనే వాంఛ వారిమనసుల్లో వుంది. కోపంరాగానే యితరులని కొడితే మళ్ళీకొడతారు. దిక్కుమాలిన బిడ్డ మళ్ళీ కొట్టలేదు. కొట్టాలనే దుర్వాంఛవల్ల బిడ్డల్ని బాదే వుపాధ్యాయులున్నారనే సంగతి [illegible], కొట్ట కూడదని [illegible] తమకోపా న్ని [illegible]; [illegible] విద్యార్థులు, జ్ఞానసంపన్నులు, [illegible] తమ [illegible] కార్యం [illegible], [illegible] మోసని, [illegible], [illegible], ప్రేమా, మాతృ ప్రేమా, అని పవిత్రమైన పేరుపెట్టి సమర్థించుకుంటారు, దె బ్బలులేకపోతే చెడిపోతారని తమమనసుల్ని తామే మోస పుచ్చుకుని సుఖిస్తారు.

బిడ్డ వచ్చింతరవాత కాని ఆ ప్రేమ బైటపడదు. ఆదుర్దా, 'సెంటుమెంటు' బిడ్డద్వారా తమ స్వలాభాన్ని తీర్చుకునేవాంఛా, వుంటాయి; వాటినే ప్రేమ అనుకుంటారు. ప్రేమవున్న వాళ్ళు బాదరు. కోపమే రాదు వాళ్ళకి, దెబ్బలుకొట్టడం వశుత్వం. స్వరక్షణార్థంతప్ప యెవరినన్నా సరే, చెయ్యిచేసుకునే వాళ్ళు కుమ్ముకునే పశువులకన్న అధమం. అందులో దిక్కులేక అసహాయులై, సంపూర్ణ విశ్వాసంతో పెద్దవారి మీద ఆధారపడ్డ పిల్లల్ని కొట్టే వారంత పరమనీచులెవరూ వుండరు. ప్రేమవల్లకాదు కొట్టేది. వాళ్ళ తెలివికోపం, అహంభావం, వీటివల్ల కొడతారు. కొట్టడంవల్ల పెద్దవారిలో క్రూరత్వం వృద్ధి అవుతుంది. అదిగాక వారికి తెలీకండానే పెద్దవారికి ఈర్ష్య వుంటుంది. మనం దెబ్బలతో పెరిగామే. దెబ్బలులేకండా మన పిల్లలెందుకు పెరగాలి అని.

తరతరాలనించీ వాస్తూ, తమ తండ్రినీ తాతనీ, ముత్తాతనీ. తమనీ వుద్ధరించిన యీ సనాతనాచారమైన దెబ్బల్ని వొదిలి, యీ కొత్త కిరస్తానీపద్ధతుల్ని ప్రవేశిస్తే యేదేవు

ళ్ళకి కోపమొస్తుందో, యేఅశుభమవుతుందో, బిడ్డ చెడిపోతాడో

పిల్లలకి, తలితండ్రులకీ ఏవిశ్వాసమూ స్నేహమూ వుండడం అతిముఖ్యమో, అవి యీ దెబ్బలతో నశిస్తాయి. అంతటితో శిక్షావిధానమంతా మట్టితో కలుస్తుంది.

బిడ్డలో వుండే, దృఢత్వమూ, ధైర్యము, శ్రద్ధ, చదివి "కొట్టొద్దు, కొట్టొద్దు" అని [illegible] యేడ్చే నీచజీవిగా తయారౌతుంది. దెబ్బకొడితేగాని చెప్పిన మాటవినదు. కోమలత్వమూ, 'జాలి కేసీ' దయాపోయి క్రూరజీవి అవుతాడు. పెద్దవాడైనా దెబ్బలకటప్పకి దడిసి, లొంగిపోతాడు. పిరికివాడవుతాడు. తనూ యితరుల్ని కొడతాడు. యీ యుద్ధాలూ, హత్యలూ, అన్నీ చిన్నప్పుడు దెబ్బలుతిన్న పిల్లలవల్లనే జరుగుతున్నాయి,

కనక కొట్టడమనేదీ తిట్టడమనేదీ శిక్షావిధానంలోంచి తీసేస్తేనేగాని లాభంలేదు. బిడ్డనికొట్టారా, మళ్లీ బిడ్డలచాత వెంటనే దెబ్బలుతినాలి. కొట్టడంతప్పని వొప్పుకోవాలి.

బిడ్డా - ప్రపంచము

ఆట - పని.

పిల్ల ఆటలకి యెన్నడూ యేవయసులోనూ, ఆటంకం చెయ్యకూడదు. ఒకటిన్నర సంవత్సరం వొచ్చేవరకూ పిల్లలు వాళ్లంతటవాళ్లే వొంటరిగా ఆడుకుంటారు. పెద్దవాళ్ళు వూరికే వాళ్లని వూసుపని యెత్తుకుని, ఆడించి పాడుచెయ్యక పోతే చాలు. యెన్నడూ బిడ్డని అనవసరంగా ఆడించడం, బాధించడం కూడదు. బిడ్డవంక చూడక, మాట్లాడక ఆడుకోనివ్వాలి.

పసితనంలో ఆడుకోడానికి యేమీ అక్కర్లేదు. కాని నాల్గు నెలలనించి బిడ్డకి బొమ్మల సరదా యెక్కువ. ఏడాదినించి బిడ్డ వొస్తువులతో అదేపనిగా వాటిని వుపయోగిస్తూ ఆడుతుంది. బిడ్డ అడగ్గానే, యియ్యడానికి వీలైనవొస్తువల్లా యివ్వాలి. ఇవ్వడానికి వీల్లేనివైతే, ఖరీదువైతే, అట్లాంటివే చవకవిచేయించీ; వంటవొస్తువులడిగితే అట్లాటివే పిడతలిచ్చీ, కలంకాయితాలడిగితే పనికిరానివి యిచ్చీ; చాకులవంటి అపాయకరమైన

అడిగితేవి. అపాయంకలగకుండా చేసి, యిచ్చి, బిడ్డని సంతుష్టి పెట్టాలి. తెగనికత్తులూ మందులేని నిప్పుపుల్లలూ, ఖరీదులేని పుస్తకాలూ మొదలైనవి. బిడ్డకు యెట్లాంటివొస్తువులమీద అభిలాషో, కనిపెట్టి అవి యివ్వాలి. నీళ్ళమీద యిష్టమైతే, యింటో నీళ్ళుపారపొయ్యవొద్దనిచెప్పి, వేరేకుండలో దూరంగానీళ్ళుంచి ఆడుకోమనాలి. బురదయిష్టమైతే అదియిచ్చి దూరంగా ఆడుకోమనాలి. అగ్గిపెట్టె యిష్టమైతే, బట్టలుతీసేసి తగలపడేవి యేమిలేకంచా చూసి ఆడుకోమనాలి.

పెద్దవాళ్ల వొస్తువులు ఆటకి యివ్వకూడదు. యిస్తే పాడుచేసినా వూరుకోవాలి. ఒక్కొక్కప్పుడు పిల్లలు వాళ్ళ ఆటలతో పెద్దవారికి యిబ్బంది కలగచేస్తారు. అప్పుడైనా ఆ యిబ్బంది తప్పేవిధం ఆలోచించాలి. కాని, పిల్లల్ని ఆట మానమనకూడదు, మధ్యాహ్నం పెద్దవాళ్ళు నిద్రపొయ్యేటప్పుడు డబ్బాకొడితే, దూరంగా కొట్టుకోమనాలి.

బిడ్డ ఆటనెన్నడూ అభ్యంతర పరచకూడదు. ఏదోవొకటి తనచేతులతో చెయ్యాలనే అణపరాని గొప్ప ప్రోద్బలం బిడ్డని అడిస్తోవుంటుంది. ఆవుత్సాహం, ఆమహాశక్తిని యెట్లాహా వొకలాగు బిడ్డ వుపయోగించకండా వుండలేదు. కదల

కండా విగ్రహాల్లాగు కూచోలేరు. కనక యిట్లా వస్తువులిచ్చి ఆసక్తిని సరైనమార్గాల నుపయోగించకపోతే, యేదో ఒక వక్రమార్గాన అది వ్యయంచేస్తారు. పెద్దవారు వస్తువులు ఇవ్వకపోతే పెద్దవారివస్తువులు పాడుచేస్తారు. దానికి పిల్లల్ని శిక్షించడం అన్యాయం. అశిక్షవల్ల అనేకదుర్గుణాలు కలుగుతాయి. అమూల్యమైన ఆటశక్తి చచ్చిపోతుంది. యీ పనులు వారిచే చేయించే సహజశక్తి ముందుముందు మేధాశక్తిగా ప్రయోజకశక్తిగా మారుతుంది. బలవంతంగా బిడ్డని ఆటలనించి బంధించారా బిడ్డ యెదిగినకొద్దీ మొద్దవుతుంది. బిడ్డసోమరిగా పెద్దవారి పనులలో కలవకూడదు. 'యేంచెయ్యను?' యేంతోచడంలేదు.' అనే స్థితికి రాకూడదు. పిలిచినాపలకనంత ఆసక్తిలో పొద్దస్తమానం ఆడాలి.

బిడ్డకు ఆటలకై సామానుల్ని విరివిగాయివ్వాలి. గొప్పఖరీదైన వస్తువులూ బొమ్మలూ అక్కర్లేదు. కొంటేఅవి దాచి తమాషాకి చూపాలి, అద్దాల బీరువాలో అందానికి

వుంచాలి. అంతేకాని రోజూ ఆడుకునేందు కియ్యకూడదు. కొయ్యముక్కలు, పిడతలు, గిన్నెలు, యిసిక, మన్ను. నీళ్ళు కాయితాలు, అట్టలు గుడ్డపీలికలు, పూసలు యివ్వాలి. కొన్నవాస్తువులతో బిడ్డయేదో చేసి ఆడుకునేట్టుండాలిగాని, ఆబొమ్మ యేదో చేస్తోవుంటే, బిడ్డ వూరికే కూచుని ఆనందించేట్టు వుండకూడదు; కీ యిస్తే తమాషా చేసేరైళ్ళా, బొమ్మలూ వృథా. పైగా బిడ్డమనోవృద్ధికి చెరుపు.

కొంచెం పెద్దదికాగానే, తక్కినపిల్లలతో కలిసి తన ఆటవస్తువుల్ని బిడ్డ తనే తయారుచేసుకోవాలి. యిళ్ళు, మంచాలు, చొక్కాలు, పరుపులు, కూళ్ళు, బుట్టలు, పడవలు మొదలైనవి. సీమసున్నమిచ్చి బల్లలమీద, నేలమీద బొమ్మలు గీయించవొచ్చు. మళ్ళుతవ్వించడం మొక్కలునాటించడం, నీళ్ళుపోయించడం, దూడలకీ పావురాలకీ కోళ్ళకీ మేతవేయించడం చెయ్యవొచ్చు. వంటలో సహాయం చేయించుకోవొచ్చు. యిదంతా ఆటగాచేసి నప్పుడే పిల్లలు సంతోషంగా చేస్తారు. వాళ్ళు ఆటగాచేసేపనే, బలవంతంగా చెయ్యమనగానే వాళ్ళకి కష్టమవుతుంది. వూరికే

వస్తువుల్నిచ్చి, ప్రోత్సాహం వాళ్ళకే కలిగేట్టు చెయ్యాలి. పెద్దవాళ్ళు చేసి చూపించి ప్రోత్సాహం కలిగించకూడదు. ఆటల రూపాన ఇంటికి కావలసిన పనులన్నీ చేయించుకోవచ్చు. వాళ్ళతో కలిసి పెద్దవాళ్ళు అప్పుడప్పుడు ఆడాలి. కాని వాళ్ళయిష్టాలు చూస్తూ వాళ్ళ ఆజ్ఞలకు లోబడి ప్రవర్తించాలి ఆటల్లో.

ఇట్లా ఆడవలసిందే గాని, బిడ్డ చేసుకోగలిగిన పని కాని ఆటగాని వొక్కటి పెద్దవాళ్ళు చేసిపెట్టకూడదు. కంచాలు పెట్టుకోడం, అన్నం వొడ్డించుకోడం, నీళ్ళు పోసుకోడం, బట్టలు వేసుకోడం, మొదలైన పనన్ని వాళ్ళే చేసుకోవాలి. ఆటల్లో కూడా బిడ్డలకి కొత్త ఉత్సాహం కలగడానికి వాళ్ళకి చాతకాని పనులకు మార్గం చూపి వాళ్ళని చెయ్యమనాలి. ఆ పనులు సరిగా చెయ్యలేక పోయినా బిడ్డే చెయ్యాలి. నౌకర్లూ ముసిలమ్మలూ, సహాయం చేస్తో సోమరిగా పెరిగిన పిల్లలంత అప్రయోజకులెక్కడా వుండరు.

పిల్లకి మూడేళ్ళు వచ్చేప్పటికి తల్లితో బాటు ఇంటి పనులన్నీ చేస్తో తోడ్పడాలి బిడ్డ. తల్లి పనులు చేస్తో బిడ్డని వెంటబెట్టుకుని తనతో పనులు ఆటవలె చేయించుకోవాలి. దీనికి

చాలా తెలివి ఓర్పు నేర్పు, కావలసి వుంటుంది. పెద్దవారికి సహాయం చెయ్యాలనే విధికిందగాక, ఆటలకింద అలవాటై పోవాలి. ఆటలలో వుపయోగించే ప్రోద్బలాన్ని యీ పనులకు మళ్లించేట్లు చెయ్యడమే తెలివి. అన్నిపనులూ పెద్దవాళ్ళచేత చేయించుకుంటూ, తాముమాత్రము సహాయం చెయ్యని బిడ్డలు చాలా దౌర్భాగ్యులు.

తక్కిన పిల్లలు.

బిడ్డకి రెండేళ్ళు రాగానే స్నేహితులు కావలసివస్తారు నేర్పరితనమూ, పనివాడితనమూ, సంపాయించాలనీ, లోకంలో తాను అనేకపనులుచేసి, శక్తిసంపాయించాలనీ, గొప్పతనాన్ని పొందాలనీ వుంటుంది. బిడ్డకి యీ సహజవాంఛని సాఫల్యపరుచుకునేందుకు, అనేకమంది పిల్లలతో కలిసి ఆటలు ఆడడం ముఖ్యం. తాము రాజులైనట్లూ, వీరులైనట్లూ, రైలుయింజనులైనట్లూ, రాక్షసుల్నీ, పర్వతాలీ సాధించినట్లూ, ఆటలుకల్పించి ఆడుకుంటారు. పెద్దవారుకూడా, యింకావారికి భావనాశక్తి తోడ్పడి, యీమాయకథలకు కల్పించి ఆడించాలి. అందరూ కలిసి ఆటపాటలైనలూ, గోతులు

చెట్లు, కంచెలు, కొలవలు, చెయ్యడం, చిన్ననాటకాలు, పాటలు, తమాషాయాత్రలు, మొదలైనవి ఆడటం మంచిది.

ఒకటిన్నర యేడువొచ్చినప్పటినుంచి మూడేళ్లొచ్చేందాకా పిల్లలకి వాళ్ళకంటే కొంచెంగా పెద్దపిల్లలతో స్నేహం అవసరం. వాళ్ళని అనుకరించి చాలాజ్ఞానాన్ని సంపాయిస్తారు.

మూడేళ్ళనించి ఆరేళ్ళదాకా వాళ్లకంటె చిన్నపిల్లల స్నేహం అవసరం. చినవాళ్ళతో మెలగడంవల్ల కొన్నిసుగుణాలు అలవడతాయి.

నాలుగేళ్ళనించి సమానవయస్కులు అవసరం. కనక పిల్లల్ని ఆవయసునించి బడికిపంపాలి. చాలాబలహీనులూ, గొప్పమేధాశక్తిపంతులూ, భయస్థులూ తప్ప తక్కినపిల్లలందరూ బడికి వెళ్లితీరాలి. పరాయిపిల్లలు యింటికి వచ్చినప్పుడు తమపిల్లల్ని వాళ్లని సమానంగా చూడాలి పెద్దవారు. దయగా ప్రేమగా ప్రవర్తించాలి. యేపిల్లలయెడలనన్నా తాము నిర్దయగా ప్రవర్తించవలిసివొస్తే, తమపిల్లలకు ఆనిర్దయకు కారణం చూపాలి పెదవారు. తన ఆటవొస్తువులూ, తిండివొస్తువు

లూ, తక్కిన పిల్లలతో విరివిగా పంచుకొనేట్లు నేర్పాలి. బలవంతంగా పెద్దవారు పంచకూడదు. పంచడం మంచిదని చెపుతో వుండాని. పెద్దవారు తమవాటిలో యితరుల కివ్వాలి. పిల్లచేత యితరులకి బలవంతంగా యిప్పించడం కంటె, స్వార్థంగా పిల్లల్ని వుండనియ్యడమే మంచిది. తమకన్న చిన్నపిల్లలకి సహాయపడేట్లూ, వాళ్లజాగ్రత తీసుకునేట్లూ, ప్రేమించేట్లూ, బాధ్యత వహించేట్లూ నేర్పాలి.

వీలైనంతవరకు పిల్లలపోట్లాటలు పిల్లల్నే తీర్చుకోనివ్వాలి. ప్రయత్నపూర్వకంగా పెద్దపిల్లలు చిన్నపిల్లల్ని యేడిపిస్తేనేగాని, పెద్దవాళ్లజోక్యం కలిగించుకోకూడదు. క్షమార్పణ నేర్పాలి. "నన్ను కొట్టింది" అనిఫిర్యాదు చేస్తే, "పోనీలే, వూరుకో రాదూ! దాన్నేమన్నా చేస్తేనీకేం లాభం? నువ్వు వూరుకుంటే అది యీసారి యేమీచెయ్యదు." అనాలి. క్షమించివూరుకోడం, గౌరవం ధర్మం అనాలి. ఆవిషయమై కథలు చెప్పవొచ్చు. కొట్టిన బిడ్డని తప్పని గట్టిగా ఖండించాలి. కాని దెబ్బలుతిన్న బిడ్డ, ఇన్నిచెప్పినా తాను వూరుకోనంటే పెద్దవారు అడ్డపడి వూరుకోపెట్టకూడదు.

కలియుపడరా వంటే కలియబడనివ్వాలి. కొట్టినబిడ్డని శిక్షించమంటే ఆబిడ్డచేత క్షమాపణ అడిగించాలి. అదీ తృప్తి కాకపోతే, దెబ్బలు తిన్నబిడ్డచేత, అన్ని దెబ్బలూ కొట్టించాలి; ఆ కొట్టినబిడ్డ పరాయి బిడ్డని చిక్కకపోతే, ఆబిడ్డని యింటికిరానీకూడదు, తమబిడ్డని ఆ బిడ్డతో ఆడవొద్దని సలహాయివ్వాలి సలహావినక ఆడితే, యీసారి ఆబిడ్డ కొడితే, పెద్దవారిబాధ్యతలేదు. కలిసి కోర్టుగా చేసి శిక్ష వేయించాలి. క్రమంగా పిల్లలు వారిపోట్లాట ఫిర్యాదుల్ని పెద్దవారిదగ్గరికి తేకుండా, వాళ్లే తగూలు తీర్పుకునేట్టు? న్యాయమూ, అన్యాయమూ, క్షమార్పణా, యీఉద్దేశ్యాలు నేర్పాలి. పిల్లలు ఫిర్యాదు తీసుకొస్తేతప్ప, వాళ్ళపోట్లాటల్లో పెద్దవారు జోక్యం కలగచేసుకోకూడదు. కాని పోట్లాటల్లో కర్రలూ, రాళ్లూ వుపయోగించడమూ, అపాయకరమైన దెబ్బలు తగిలించుకోడం యివి చెయ్యనీకూడదు. ఒకపిల్ల వోడింతరవాత యింకా కసికొద్దీ రెండోపిల్ల కొడుతోవుంటే అడ్డపెట్టాలి. అట్లాంటిపనికి ఆబిడ్డ సిగ్గుపడేట్టు చెయ్యాలి. కొట్టుకోడం పశుత్వమని చెప్పాలో పెద్దవారు తామెవరినీ కొట్టక మార్గంచూపాలి.

కొందరు పిరికిపిల్ల లుంటారు. బలమున్నా సరే, యీడున్నా సరే పోట్లాడరు. తన్నులుతిని, పెద్దవాళ్ళతో చెప్పుకుంటారు. అట్లాటివాళ్ళకి పౌరుష మెక్కించి, స్వరక్షణను నేర్పాలి. పౌరుష మెక్కిందాకా, దెబ్బలు తిననియ్యాలి. "నీకు చాతనైతే కొట్టు. చాత కాకపోతే, దెబ్బలుతిను" అనాలి. బాధకలిగించి భయం పోగొట్టాలి. మరీ యింకా చచ్చుగా దెబ్బలకి లోబడుతో వుంటే, జోక్యం కలగ చేసుకుని ఆపాలి. కొట్టేవాళ్ళనిమాత్రం నిస్సహాయుల్ని కొట్టినందుకు సిగ్గుపడేట్టు చెయ్యాలిసిందే

కొట్టుకోడం, పోట్లాడ్డం, పిల్లలకు అవసరం. అసహజ కార్యాన్ని ఆపినట్టయితే అక్రమమార్గాల అల్లరిచేస్తారు. కసకయిష్టం వొచ్చినట్టు తగూలాడనియ్యాలి, కొట్టుకోనివ్వాలి. గట్టిగా కొట్టుకుంటున్నా అడ్డపెట్టకూడదు. బాగాపోట్లాడు పిల్లలే యెక్కువ స్నేహపాత్రులవుతారు. పోట్లాట ఆపితే హృదయంలో కోపం మండుతూ వుంటుంది. అది అనారోగ్యం

పెద్దవారేమాత్రమూ పక్షపాతం చూపకూడదు. తమ పిల్లలోనైనా సరే, యితరులలోనైనా సరే, ఒకపిల్లతో చేరి మాటలని రెండోవారిని బాధపెట్టకూడదు. అతనెంత దుర్మార్గుడైనా సరే.

పెద్దపిల్లలు చిన్నవాళ్ళని వెక్కిరించినా, కొట్టినా యేడిపించినా కఠినంగా శిక్షించాలి. బాగా కోపం చూపాలి. పెద్దపిల్లలు, చిన్నవాళ్ళని, బెదిరించి, లంచాలిచ్చి యేడిపించి, వాళ్లచాత అల్లరిపనులు చేయించి, తాము తప్పుకుంటారు. పెద్దపిల్లల చెడ్డసలహాలు వినవద్దనీ, వాళ్లేమన్నా చేస్తే తమతో చెప్పమనీ వాళ్ల బెదిరింపులకి దడవవద్దని, చిన్నవాళ్ళతో చెప్పాలి. పెద్దపిల్లల్ని శిక్షణలో పెట్టాలి.

పిల్లలు చెడ్డసావాసాలు చేస్తే వొద్దనాలి. కాని బలవంతంగా మాన్పకూడదు. యెప్పుడూ చెడ్డగా ఆస్నేహితుల్ని గురించి మాట్లాడుతూ వుండకూడదు, క్రమంగా యితరమైన పనులూ, కొత్తస్నేహితులూ, కల్పించి ఆ సావాసాలు తప్పించాలి,

పెద్దవాళ్లు

పెద్దవారిస్నేహితులూ బంధువులూ, యింటికి చూడ్డానికి వొస్తూవుంటారు. వాళ్ళలో చాలమందికి పిల్లలపైన నిజమైన సరదా వుండదు. అటువంటి వారినించి పిల్లల్ని దూరంగా, వుంచాలి. ముద్దుకదా అని, పిల్లల్ని వాళ్లనెత్తినరుద్ద కూడదు.

వాళ్లలో కొందరు పిల్లల్ని చూస్తే సరదా లేకపోయినా, మర్యాదకి వున్నట్లు నటిస్తారు. మర్యాదకోసం పిల్లల్ని వారి నించి తప్పించెయ్యాలి, పిల్లలకి వీరు శత్రువులు

పిల్లలమీంద వాస్తవమైన యిష్టమున్న వారితో పిల్లల్ని స్వేచ్ఛగా తిరగనియ్యాలి. వారితో వాళ్ళయిళ్ళకు కొంత కాలం పిల్లల్ని పంపుతో వుండవొచ్చు. కాని యీసహవాసం వల్ల తామిచ్చేశిక్షణకు భంగంకలగకండా విరుద్ధమైన అభిప్రాయాలు పిల్లలు నేర్చుకోకండా జాగ్రత తీసుకోవాలి. మంచి అలవాట్లేర్పడ్డ తరవాత పంపవొచ్చు.

కొందరికి పిల్లల్ని యేడిపించడం, విసికించడం, సరదా. కొందరికి అతిముద్దుతో పిల్లలకిష్టంలేక పోయినా, కష్టపెట్టడం సరదా. వీళ్లు పిల్లల అభివృద్ధికి విపత్తులవ్యాలు. వారెంత గొప్ప స్నేహితులైనా, దగ్గిరబంధువులైనా వెంటనే వారినించి పిల్లల్ని తప్పించాలి. పిల్లలకి యిష్టంలేనిది ప్రశ్నలు వెయ్యనీకూడదు. వాళ్ళఆటల్లో వొస్తువులతో జోక్యం కలగచేసుకో కూడదు. పిల్లలకి యిష్టమైనా, చివరికి తలితండ్రులు కూడా

పిల్లల్ని నలపడమూ, అతిముద్దుచెయ్యడమూ, పనికిరాదు. వారుకాని యెవరు కానిపిల్లని అందమైనదనీ, తెలివైనదనీ, భాగ్యవంతురాలనీ, పొగడకూడదు.

పిల్లలకు మర్యాద నేర్పాలి. ఇంటికి వొచ్చినవాళ్ళ యెడల వాళ్ళు మర్యాద చూపడం ఒక అలవాటు. కనక పెద్దవారు శ్రద్ధతీసుకుని ఆఅలవాటు నేర్పాలి. ఏమిచెయ్యాలో యెట్లామాట్లాడాలో చూపాలి. అంతేగాని మర్యాదగా వుండమని ఆజ్ఞాపించడంవల్ల లాభంలేదు. అమర్యాద కార్యాలను ఆటలరూపంగా పోగొట్టవొచ్చు. ఇంటికివొచ్చినవారిని స్నేహితులను సంతోషపెట్టాలనే ఆసక్తి బిడ్డలకి వుండాలి. కాని కాని సత్యంకూడదు. తనమర్యాదను కాపాడుకోవాలి బిడ్డ.

ఇంటికివొచ్చిన వారు బిడ్డలయెడల అమర్యాద చూపినా, బిడ్డ అమర్యాదగా ప్రవర్తించకూడదు. మర్యాద యితరులకొరకు కాదు. తనప్రవర్తన సరిగావుండడమే ముఖ్యోద్దేశ్యము. కాముమాత్రము, ఏపరిస్థితులలోనూ తమసహజ కొదారాన్ని విడనాడకూడదనిన్నీ, మర్యాదను మీరకూడదనిన్నీ చెప్పాలి.

కానిపిల్లలు అమర్యాదస్తులయెడల అమర్యాద చూపితే తలితండ్రులు అభ్యంతర పెట్టకూడదు. కాని మర్యాద చూపడమే ఆదర్శమని మాత్రం తమ ప్రవర్తనవల్ల పెద్దవారు చూపాలి. పిల్లలకి నిష్కారణంగా కొందరియెడ అయిష్టం కలుగుతుంది. అటువంటివాళ్ళతో బిడ్డమాట్లాడ నంటే, పెద్దవాళ్ళు నిర్బంధించ కూడదు. కాని మాట్లాడితే బిడ్డమర్యాదగా మాటాడాలి. లేకపోతే దూరంగా వుండవొచ్చు. ఆ అతిథులు కూడా యిష్టపడని పిల్లల జోలికి పోకూడదు. ఒక్కొక్కప్పుడు పిల్లలు కొందరియెడల అమర్యాద చూపుతారు. తలితండ్రులు దానికి పిల్లల్ని శిక్షిస్తారు. కాని అస్నేహితులు రహస్యంగా పిల్లల్ని యెప్పుడో యేడిపిస్తో వుండటమే కారణం. కనక తలితండ్రులటువంటి విషయాలు కనుక్కుంటో వుండాలి. దయగా పిల్లల్ని పిలిచి అడగాలి.

అప్పుడప్పుడు యీపిల్లలే కొత్తవాళ్ళని యేడిపించి విసికిస్తారు. మర్యాదవల్ల ఆకొత్తవాళ్ళు వూరుకోవొచ్చు. తలితండ్రులదికనిపెట్టి పిల్లల్ని ఆక్రొత్తవారి యిష్టప్రకారం శిక్షించుకో

మని వాళ్లతోనే చెప్పాలి. వాళ్ళు శిక్షించనివారైతే పిల్లల్ని దూరంగా పంపాలి. కొత్తవాళ్లూ పిల్లలూ సమానంగా పోట్లాడుతో వుంటే, పెద్దవారి జోక్యం అనవసరం

పెద్దవాళ్ళు మాట్లాడేచోట పిల్లలు అల్లరిచేస్తే దూరంగా పంపాలి. కొత్త వాళ్ళెవరన్నా రాగానే పిల్లలుకూడా గుమికూడే అలవాటు మాన్పాలి. కాని పిల్లల్నికూడా పెద్దవాళ్ళదగ్గిరికూ వోమని బలవంతంచేసి, వాళ్ళు అల్లరిచేస్తే శిక్షించనంతవ్వు.

ఇంటికి వొచ్చేప్రతివారినీ, పెద్దవాళ్లు, సమానంగా చూడాలి. స్నేహ తారతమ్యమే గౌరవ తారతమ్యాన్ని కలిగించే ప్రధాన సూత్రంగా వుండాలి. కులమూ, లింగమూ, భాగ్యమూ, మొదలైన భేదాలన్ని యేమాత్రమూ గౌరవవిషయంలో పాటించకూడదు.

స్నేహితులూ బంధువులూ వారిగుణాలూ, చర్యలూ, బిడ్డముందు ఖండించరాదు. మనుష్యుల్నిగురించి చెడ్డగామాట్లాడడం మానాలి; ముఖ్యంగా స్కాండల్సు

బాలుడి వేషభాషలూ పనులూ, ఆచారాలు, లోకంతో బాటుగా, అందరికీ సమ్మతమయ్యేట్టు వుండాలి. అందరికీ

విశృంఖలంగానో, వివాదంగానో, నూతనంగానూ, విరుద్ధంగానూ కనపడనీకూడదు. లోకంమీద తృణీకారభావమూ అసహనమూ నేర్పకూడదు. కాని బిడ్డ కావలిసి కాని విరుద్ధంగా నడుస్తానని, తెలిసి పట్టుబడితే, పెద్దవారు అభ్యంతర పెట్టకూడదు.

కాని బిడ్డ తననడవడిని లోకాభిప్రాయం మీద ఆధారపెట్టుకోకుండా వుండడం నేర్పాలి. లోకాన్ని ప్రేమించాలి గాని, లోకం తప్పుమార్గంలో వుందని విశ్వసించినప్పుడు, నిర్లక్ష్యంగా, తిరగబడాలి. తన అంతరాత్మకి తోచినట్లు చేసితీరాలి. యెవరేమన్నాసరే, వచ్చేకష్టాలనూ, నిర్లక్ష్యంగా, సంతోషంతో, ధైర్యంతో భరించాలి. కాని ముఖ్యవిషయాల్లో తిరగబడ్డా సాధారణవిషయాల్లో లోకంతో స్నేహంగా వుండడానికే ప్రయత్నం చెయ్యాలి.

కాని లోకానికీ, స్నేహితులకీ భయపడనే కూడదు. లోకంతో కలిసిమెలిసి, వారిప్రకారం నడుచుకోవలిసిందే గాని, లోకం వెక్కిరిస్తుందనీ, తననడవడిని ఖండిస్తుందనీ, భయపడి,

తనకి న్యాయమూ, సత్యమూ అని తోచినదానిని బిడ్డ వొదులుకోకూడదు.

సేనా — అర్ధనా.

బిడ్డకి ప్రతి నెలా 'పాకెట్ మనీ,' యివ్వాలి. అది యెంతో కుటుంబ స్థితిగతుల్నీ, బిడ్డ వయసుతోనూ మారుతుంది. బిడ్డ అల్లరి చేసినా, పని చెయ్యకపోయినా, వస్తువులు పాడుచేసినా, ఆ డబ్బు తగ్గించకూడదు. ఆ జీతం తన యిష్టం వచ్చినట్లు వుపయోగించుకోవచ్చు. కాని అనారోగ్యాలూ, హానికరాలూ, ఐన పదార్థాలు కొనడానికి వుపయోగించకూడదు. ఆ డబ్బుని వీథులో పారేసినా అందరికీ మూర్ఖంగా పంచిపెట్టినా వూరుకోవాలి. కాని మళ్ళీ యెక్కువ డబ్బులు మధ్యమధ్య యివ్వకూడదు. దాచుకుని వుపయోగించుకునే పద్ధతి నేర్చుకోవాలి బిడ్డ. దుర్వినియోగపరిచి నష్టపడ్డప్పుడు ఆ విషయం మనసుకి నచ్చచెప్పాలి. "చూశావా ఆ డబ్బంతా ఒకసారే తగలేశావు. దాచుకుంటే, యిప్పుడు పిల్లంగోవి కొనుక్కుని వుండవొచ్చును కదా!" అనాలి

డబ్బులు బిడ్డ చేతికివ్వాలి. దాచిపెట్టుకుంటే, దాచాలి. మళ్ళీ ప్రతినిముషం అడగనివ్వకూడదు. అడిగితీసుకునేందుకు వేళలుండాలి.

కాని వూరికే డబ్బు అయిపోతుందే అనే కాపీసంతో డబ్బు దాచుకోడం పెద్దవారు 'ఎన్కరేజ్' చెయ్యకూడదు. తెలివిగా వుపయోగకరంగా ఖర్చుపెట్టడం నేర్పాలి. గాని దాచుకోడం కాదు; వస్తువులు కొననియ్యాలి బిడ్డని. కాని ప్రియంగా కొంటున్నప్పుడు బిడ్డ యెట్లామోసపోతోందో చూడాలి. సరిగా, సరైనధరలకు కొనడం తెలుసుకునేట్టు చూపాలి పెద్దవారు. ధనమువిలువా, దానిసద్వినియోగమూ నేర్పడం ముఖ్యోద్దేశం. వూరికే కూడబెట్టడమూ పనికిరాదు. బుద్ధిలేక ఖర్చుపెట్టడమూ మంచిదికాదు.

బిడ్డఇంట్లో పనికి సహాయం చెయ్యాలి. ఆపని మూడువిధాలు

1 ప్రేమతో చేసే సహాయం

మూడేళ్ళురాగానే తమసహాయార్థం పనిచెయ్యమని బిడ్డని అడగవొచ్చు, కాని బిడ్డచెయ్యనంటే బలవంతపెట్టకూడదు: బిడ్డఆడుతో వుండగా 'డిస్టర్బు' చేసి పిలవకూడదు;

"నామీద ప్రేమ లేదా? పని చెయ్యకపోతే నీమీద కోపమొస్తుంది. నీతో మాట్లాడను" అనకూడదు. బిడ్డ ఆనందంతో ప్రేమతో చెయ్యాలి. ఎదన్నా యిష్టంలేని పని వాళ్ళు చెప్పవద్దు, ఆసంగతి చెప్పి, బిడ్డసహాయం అడిగితే బిడ్డతప్పకుండా వొప్పుకుంటుంది. స్నేహితుల్ని సహాయం అడిగినట్లు. వారు సహాయం చెయ్యకపోతే బలవంతం చెయ్యగలమా! వారికి సహాయం మనంమానేస్తాము. అట్లానే బిడ్డ పెద్దవారికి సహాయం చెయ్యకపోతే, దానికి సహాయగుణం నేర్పడానికై, పెద్దవారు పిల్లకి గాలిపటాలూ, నాటకాలూ, మొదలైన హాయిఆటల్లో, సహాయం నిరాకరించవొచ్చు. బిడ్డ భయపడి సేవచేస్తోందీ, ప్రేమతో చేస్తోందీ కనిపెట్టాలి. పెద్దవారు సోమరిగా కూచుని బిడ్డని నౌకరుకింద వుపయోగించుకోకూడదు. తమపని తామే చేసుకోవాలి. బిడ్డని మంచినీళ్ళిమ్మనీ, విసరమని కాళ్ళుపట్టమనీ అడిగిచేయించుకుంటారు. కానిబిడ్డఅడిగితే, నువ్వుచేసుకోలేవా? చేతులులేవా?" అంటారు. అదిఅన్యాయం. పెద్దవారికిచిన్నవారు సేవచెయ్యాలనే ఉద్దేశ్యం నశించాలి. అందరూ, పరస్పరసహాయం చేసుకుంటూ, ఒకయింటో వుండేసమానస్తులైన, స్నేహితులనుకోవాలి. అవసరమైతే అన్నివిధాలా ఒకరికొకరు సమా

నమైన సహాయం చేసుకోవాలి. అవసరం లేకండా ఒకరిమీద యింకోరు అధికారం చేసి సేవచేయించుకోకూడదు.

“మేము బిడ్డకి వొండటంలేదా, పెంచటంలేదా;” అంటారు పెద్దవారు. బిడ్డని కన్నందుకు ప్రతిఫలాపేక్ష లేకండా పెద్దవారు చెయ్యవలసిన విధి అది. అందుకోసం బిడ్డని సేవచెయ్యమనడం తప్పు, తాము చేసుకోగలిగినవన్నీ చేసుకుని అవసరమైనప్పుడు, బిడ్డలనించి పని తీసుకోవాచ్చు.

2. విధిగా చేసేపని.

యిది ఒకయింటో తనుకూడా ‘మెంబరై’ నందుకు, అందరివలెనే తనూ విధిగా చెయ్యవలసినపని వయసునూ తీరికనూపట్టి దీనిపరిమితీ, దీనివిధమూ మారుతో వుంటాయి. అదియెట్లా చెయ్యాలో నేర్పాలి. అదిచేసే సమయం నిర్ణయించాలి. యీపని చెయ్యకపోతే ఆపనికిసంబంధించిన హక్కులు పోతాయి. కూరలు తరగడంపని బిడ్డదై, తరక్కపోతే కూర తినడానికి వీల్లేదు.

3. కూలికి చేసేపని

బిడ్డకి డబ్బుకావలసినప్పుడు, పెద్దవారికి కావలసినపని చేసిపెట్టి, డబ్బుసంపాయించుకునేందుకు వీలువుండాలి.

భయమూ నీతి

భయం

భయం పిల్లలకు సహజంకాదు. ఇతరులనించి నేర్చుకుంటారు. ముఖ్యంగా తలితండ్రులూ దాదులూ, ముసలివాళ్లూ అన్నలూ అక్కలూ కారణం, ఈ చిన్నప్పటి భయాలమూలంగా జీవితమంతా పిరికివారై బాధపడడమే కాకుండా, క్రూరులౌతారు. బిడ్డలలో యింత సామాన్యంగా వుండేదీ పాడుదీ, బిడ్డని జీవితమంతా యింతగా బాధపెట్టేదీ, నిర్మూలించడానికి కఠినమైనది యింకో గుణంలేదు; కనక బిడ్డభయంనేర్చుకోకుండా మొదటనే చాలాజాగ్రత్త తీసుకుని, భయంనేర్చుకున్న వెంటనే తలెత్తకుండా చంపిలేకండా చెయ్యాలి. యితరులకి సిగ్గుపడీ భయపడీ, బిడ్డ భయాణ్ణిముసుకునేట్టుగా కాక, అసలు భయమే లేకుండా వుండాలి. తనపెద్దవారిని తలితండ్రుల్ని చూసినా, భక్తి వుండాలిగాని, భయం వుండకూడదు

పిల్లలకి భయంలేకుండా వుండాలంటే ముందు పెద్దవాళ్లు తమభయాల్ని వొదులుకోడమూ మనసులోంచి ఆభయాల్ని తరిమెయ్యడమూ తప్పదు. దెయ్యాలు, రైళ్ళు, దొంగలు, పోలీసులు, అధికార్లు డాక్టర్లు, స్కూళ్లు నిప్పులు, పాపాలు

కర్మాలూ, యీ భయాలన్నీ తామే కాక, యింటో బిడ్డలతో కలిసేవాళ్ళనించి వొదిలించాలి. భయంలోపల వుంచుకుని బిడ్డకి ఆ భయం వుందని బిడ్డకి తెలీకుండా ప్రవర్తించడం అసాధ్యం. భయాలు వొదులుకోని ముసలమ్మలు మొదలైన వాళ్ళని తరిమెయ్యడం తప్పనిసరి. చచ్చే ముసలమ్మ యెక్కువా నూరేళ్ళు బతకవలిసిన బిడ్డ యెక్కువా.

బూచి మొదలైన మాటలు అని బిడ్డని దడిపించకూడదు. పెద్దవాళ్ళు బిడ్డ యేమవుతుందో అని భయంపడితే ఆ భయం బిడ్డలో ప్రవేశపెడతారు. తమకి ఆ భయం కలిగించినందుకు బిడ్డని కొడతారు. బిడ్డ బావి దగ్గిరిగా, రైలు దగ్గిరిగా వెళితే భయంకొద్దీ బిడ్డని దండిస్తారు.

దెయ్యాలు, బూచులు, నరకం, పాపం, యిట్లాంటివనీ శాస్త్రరీత్యా అర్థం చెప్పినట్లైతే భయం పోతుంది. వురుములూ మెరుపులూ, సుడిగాలీ, చీకట్లో చప్పుళ్లూ గ్రహణాలూ, మొదలైనవి, అర్థం తెలీగానే, వాటి భయం పోతుంది. తెలియరాని భయమంతా, అజ్ఞానంవల్ల కలిగిందేనని బిడ్డకి తెలియ చెయ్యాలి.

శిక్షలతో దడిపించి బిడ్డను పెద్దవాళ్ళకు భయపడేట్లు చెయ్యకూడదు. యితరుల కోపానికీ శిక్షకీకూడా దడవనక్కర్లేదు. యెవరిదన్నా వొస్తువు బిడ్డ తాకితే 'వాళ్ళు కోప్పడతారు. తాకకు' అనక, "యింకొకరివొస్తువులు వాళ్ళ అనుజ్ఞలేనిది తాకడం మర్యాదకాదు. వాళ్ళకి యిష్టం వుండక పోవొచ్చు" అనాలి. పూరికేనే బిడ్డలపైని కేకలు వేసేవారుంటారు. "వారికదో విధమైన జబ్బు; గానికి దడవకూడద"ని చెప్పాల,

దేన్నన్నా చూసి బిడ్డ భయపడుతో వుంటే ఆభయం యావుమూపేదాకా పెద్దవారయినకోకూడదు. ఆవొస్తువుని బిడ్డ భయపడనంత దూరానవుంచి, క్రమక్రమంగా దగ్గిరికి తీసికెళ్ళి మెల్లిగా బిడ్డకి అలవాటు చెయ్యాలి. ఆవొస్తువును బిడ్డనించి తప్పించనూ కూడదు, బిడ్డమీద ఒకసారిగా వెయ్యనూకూడదు.

బిడ్డకు బిచ్చగాడిపంచి చూస్తే భయమనుకోండి. అప్పుడు బిచ్చగాడి నంచిని విప్పిచూపి, బిడ్డచేతే దాంటో వొస్తువులు తీయించి, బిచ్చగాడిచేత బిడ్డలతో దయగా మాట్లా

డిస్తేసరి, దానికి ఆభయం పోతుంది. అభయం పూర్తిగా పోయిందాకా ఆవస్తువును క్రమక్రమంగా చూపుతోనే వుండాలి. బిడ్డ భయపడుతో వుంటే, బలవంతంగా భయంకలిగించే వస్తువు దగ్గిరికి లాక్కెళ్ళకూడదు. ఆవస్తువును మీదపడేయ్యకూడదు. అసలు పెద్దవాళ్లు యెవ్వరో ఆసంచి విషయం భయపెట్టకపోతే, బిడ్డకి భయం కలగనేకలగదు. ఈ భయాలు పోగొట్టడం చాలాముఖ్యం. కనక పెద్దవారు చాలాశ్రద్ధ వహించాలి. ఈ చిన్నభయాలే ముందు ముందు చాలావిపరీతమైన భయాలకు మూలకారణాలు. పెద్దవారు తాము భయము చూపక, దయగా నవ్వేస్తే చాలాభయాలు పోతాయి.

భయపడ్డమనేది బిడ్డ సిగ్గుపడాలి, గాని ఆసిగ్గువల్ల భయం పోవాలిగాని, సిగుపడి భయాన్ని దాచుకోకూడదు. బిడ్డ ధైర్యం చూపినప్పుడు పెద్దవారు ఎప్రీసియేషన్' చూపాలి. వారికే తనభయాలతో బాధలతో, పెద్దవాళ్లు సానుభూతిని చూపుతో వుండాలనే ఆశని బిడ్డనించి తొలిగించడం ముఖ్యం. దెబ్బతగిలి బాధపడితే, వోర్చుకోవాలని చెప్పాలిగాని

బిడ్డతో కూడా పెద్దలు అబ్బోఅని అధైర్యపడకూడదు. బిడ్డ బాధపడుతున్నంతసేపూ పెద్దలు వెంట బాధపడుతూ వోదారుస్తూ కూచోకూడదు. వోదార్పులు పూర్తిగా అన్నివిషయాలా మానాలి. బాధపడే బిడ్డకే పెద్దవాళ్ళ హృదయాల్లో బాధవుంటుంది. కాని కనపరచకూడదు. బిడ్డ తనే యేడ్చుకుని, తనే మాన్పుకుని తిరగాలి. "యింతేనా? దీనికే యేడుస్తారా? లే. పరిగెత్తు. అనాలి" దెబ్బకికట్టూ అదీకట్టవలిసివొస్తే, డాక్టరు కట్టినట్టు కట్టేసి, పోయిఆడుకో మనాలి. ఆ దెబ్బ మరిచిపోయేట్టు ఆటకల్పించ వొచ్చు, ఆబాధతో బిడ్డ యేడ్చినా, న్యూసెన్సు కాకండా వేరే యెక్కడన్నా యాడవాలి. పెద్దవాళ్లకి దెబ్బతగిలినా, తేలుకుట్టినా అంతే. బిడ్డని చూడమన్నా, నాకెంత దెబ్బతగిలిందో! నాకెంతజబ్బుచేసిందో! అని జాలిపొందించి ప్రేమలాగాలని ప్రయత్నించకూడదు. బిడ్డకి జబ్బుగావున్నా అంతే. మందిచ్చి, వొచ్చేయ్యాలి. దగ్గిర కూచూడం, ఆదుర్దాపడడం, ముద్దుకోడం, చాలాతప్పు.

భయంలేకండా పనిచేసే అవసరంగల పనులు భయం పోగొడతాయి, బైస్కిలెక్కడం, పట్టాలమీద నడవడం, దూ

కడం, చెట్లెక్కడం, యీదడం, ఎన్నోచేసి చెయ్యాలి. భయం పోగొట్టడానికి బడి మంచిది. కాని పిల్లల్ని కొట్టే బడికి పంపితే భయాలెక్కువౌతాయి, మంచిబళ్లో పిల్లలభయాల్ని తక్కిన పిల్లలు ఒక్క నిమిషంలో పోగొడతారు. ఆ పిల్లలు వెక్కిరి స్తారనన్నా భయాలు వొదిలించుకుంటారు.

ఆడపిల్లలకీ యింతే. ఆడవాళ్ళు భయపడడం సహజమనీ అందమనీ చెప్పిసిగ్గూ పాతివ్రత్యమూ, యీ పేర్లతో, భయాలు స్త్రీలకినేర్పి వారిని తమఅధీనం చేసుకున్నారు మొగవాళ్ళు. మాటల్లోకూడా ఆడదానిమల్లే భయపడతావేం! అంటారు. అవన్నీ నశింపచెయ్యాలి.

పెద్దవారియెడల దేవుళ్లయెడల గురువులయెడల నరకంయెడల భర్తయెడల పాపంయెడల వున్న యిప్పటి భయమంతా, భక్తిగా మారనన్నా మారాలి, పోనన్నాపోవాలి. ఈచిన్నప్పటి భయాలే, లోకంలోని, యీయుద్ధానికీ, దాసినత్వానికే, క్రూరత్వానికే, కారణం, కనక భయాలను నిర్మూలం

చెయ్యగలిగితే ప్రపంచం యింతకన్న చాలా ఆరోగ్యవంత మవుతుంది, ప్రజల స్వభావాలు యింతకన్న చాలాఔన్నత్యాన్ని, పొందుతాయి.

భయంవల్లనే అనేక వికృత్యాలు జరుగుతాయి. పిల్లని దెబ్బల్ని, దెయ్యాల్ని, ఆపదల్ని, రోగాల్ని, అధికారుల్ని, చావుని పోలీసు వాళ్ళని, పరకాన్ని కాషాయ బట్టల్ని, పెద్ద గడ్డాల్ని, పెద్దకోట్లని, దేన్నిచూసినా భయమే. ఎన్నడూ రాని జరగని ఆపదలు వొచ్చినట్టే తలచుకుని భయాలతో వొణుకుతో, ఏడుస్తూ జీవితం గడిపేవాళ్ళు వేనకువేలు. కొత్తమార్పు, కొత్త అభిప్రాయం అనగానే గజ గజ వొణికే వాళ్లు కోట్లకొలది. కొన్నిపిట్టల అరుపులు, చీకటి, వురుగులు గాలి, వీటిని చూసికూడా భయమే. భయంతో తప్ప నీతినీ, సన్మార్గాన్ని బోధించడం చాతకాని అవివేకులు తెచ్చిపెట్టిన అనర్థం యిదంతా. నరకమూ భయంకరమైన దేవతలూ, కసి తీర్చుకునే దెయ్యాలూ, యిదంతా వాళ్ళ జాడ్యపు మెదడులో పుట్టిన కుళ్లే.

బిడ్డల్ని శిక్షణలో పెట్టడం చాతగాక పెద్దవారు భయాలు నేర్పుతారు. అదుగో "బూచి" అనేది ముఖ్యం. దొంగలు, టీకాలు, పోలీసులు, దెబ్బలు, బిచ్చగాళ్ళు, పిల్లి, చీకటి వీటిసన్నిటిని ఉపయోగిస్తారు పిల్లల్ని వూరుకోపెట్టేందుకు. అదుగో "బూచి" అన్న ముసిలమ్మలల్లా విచారణ లేకండా వురితియ్యాలి. యిలాలోకం బాగుపడాలంటే ప్రభుత్వంవారా పనిచెయ్యకపోతే, వూరివారన్నా, వాళ్ళని వూళ్లోంచి తరిమెయ్యాలి.

శిక్షణ కోసం పెద్దవారు పిల్లల్ని దెబ్బలతో కేకలతో భయపెడతారు. అది యింకో తప్పు. శిక్షణ ఆటవలె జరగాలి, ఆజ్ఞలతో జరగకూడదు. బిడ్డకి పెద్దవారిని చూసినా సుతలామూ భయం వుండకూడదు. పెద్దవారి మీది చిన్నప్పటి భయమే పెద్దైనా బిడ్డని బానిసగా మారుస్తోంది. ముఖ్యం దెబ్బల భయం.

ఈ భయాలు ముఖ్యంగా ఆడపిల్లలకి యెక్కువ. ఎందుకు? ప్రపంచ జ్ఞానమే తెక్కపగనక. గ్రహాణాలూ, లోక

చుక్కలూ, చీమలూ దెయ్యాలూ అన్నీ భయాలే. ఇవన్నీ నిర్మూలమైతేగాని దిక్కూ సౌఖ్యమూ వుండవు ప్రజలకి.

అదిగాక, బిడ్డక్షేమం కోసం పెద్దవారు తమభయాలనన్నిటినీ బిడ్డకి ప్రసాదిస్తారు. రైలొస్తోందంటే, పదిగజాల దూరానికి బిడ్డని లాగడం, కాలవనీళ్ళలో కాలుపెట్ట నీకపోవడం, అగ్గిపుల్ల గీస్తే యిల్లుతగల బడ్డట్టు అరవడం, చీకటిలో వెడితే అదుర్దా పడడం, పక్కల్లో పడుకోపెట్టుకోడం, తిండితినకపోతే, యేడిస్తే, అదుర్దా పడడం, జ్వరంరాగానే, వేలుతెగగానే బిడ్డచచ్చినట్టు యాడవడం, యివన్నీ పెద్దవారిలో దుర్గుణాలు

బిడ్డ యేవొస్తువన్నా పాడుచేస్తున్నా, యెదన్నా అపాయంలోకి వెడుతున్నా, చప్పున పెద్దవారు అరిచి, బిడ్డని హడలగొట్టకూడదు. ముందు పెద్దవారు తమభయాన్ని అదుర్దాని, అణుచుకుని తీరాలి.

నీతి

బిడ్డను నీతిప్రపంచంలో పెంచాలి. అవినీతీ, దుర్మార్గమూ, నిరీశ్వరత్వమూ దూరాన వుంచడంవల్ల, నీతియుక్తమైన అలవాట్లే యేర్పడతాయి. బిడ్డకు ప్రలోభనము కలిగే పరిస్థితులూ, చెడ్డపనులు చెయ్యవలసిన అవసరమూ సాధ్యమైనంత వరకు కలగ చెయ్యకూడదు. శిక్షిస్తారనే భయంలేక పోతే అబద్ధమాడదు. అడిగింది యిస్తే దొంగిలించదు అట్లానే.

బిడ్డ దుర్మార్గంగా మొదట్లో ప్రవర్తించినప్పుడు, యెప్పుడూ శిక్షించకూడదు. ఎందువల్ల అట్లా చేస్తోందో విదాసించి చూడాలి అతిప్పుపని ఏదో పొరపాటులాగుం చూడాలిగాని పాపమనీ ఘోరమనీ, చూపువల్ల మాటవల్ల తెలియచెయ్యకూడదు తలితండ్రుల్ని పడక గదిలో రాత్రులు చూసి, అది తాము కూడా ఆడేవాళ్లున్నారు పిల్లలు. అది ఘోరంగా అనుకుని దండించారా, బిడ్డకి ఆ అలవాటు తప్పకుండా యేర్పడిందన్న మాటే. దండన వల్ల యేమిలాభం లేదు. దేవుడికి కోపమనీ నరకమనీ పాపమనీ యేపనిచేసినా బెదర కొట్టకూడదు.

"ఇట్లా చేశావేం? ఛా! అట్లా కాదు, అనాలి. ఎట్లానో చెప్పాలి, చూపాలి. అంతే" "ఇంత ఘోరం చేశావే!" అని పెద్దవారన్నారా, "నేనేకదా యింత ఘోరం చెయ్య గలిగాను! చాలా గొప్పదాన్ని మళ్లీ. గొప్పతనం వహిద్దాము" అనుకుంటుంది బిడ్డ. నరకం, పాపం చెప్పి బెదరకొట్టాగా, ఆ సంగతే ఆలోచించుకుని, భయపడి, భయపడి ఆ అలవాటులోనే పడుతుంది. చెడ్డపనుల నించి మనసు తప్పించాలి, అవి చేసే అవసరాన్ని తొలిగించాలి.

బిడ్డకి నీతి నేర్పాలని ప్రయత్నించే పెద్దలు బిడ్డ స్వభావంలో విశ్వాసముంచడం చాలా అవసరం. బిడ్డ యెప్పుడూ మంచిగా వుండడానికే ప్రయత్నిస్తుంది. దుర్నీతి అనగా, అల్లరనగా, నీతీ, మంచితనమూ, లేని లోపమని గ్రహించాలి పెద్దవారు. చెడ్డ తనమూ మాయా అశాశ్వతము. బిడ్డ తన శక్తిగా తాను విశ్వసించాలి. అందుకోసం పిల్లలతో మంచి గుణాల సంగతే మాట్లాడాలి.

నువ్వు చెడ్డవాడివి, అల్లరివాడివి, దొంగవు, అనకూడదు. "ఇది మంచివాడు చేసేపనికాదు. నువ్వు మంచివాడివి"

అనాలి. నీఖర్మం నీగుణమే అట్లాంటిది అని అధైర్య పెట్టకూడదు. యెన్నిసార్లు తప్పుపనిచేసినా, బిడ్డ ఆపనికన్న అతీతుడని తెలుసుకుని "యీసారి ప్రయత్నించు. తప్పదు. నువ్వు సన్మార్గానికి రాగలవు." అనేధైర్యమూ విశ్వాసమూ ఇవ్వాలి. తప్పుపని చేస్తే, పెద్దవారు ఆశ్చర్యపడి. యిదేమిటి యింత పొరపాటు చేశావు? నీవంటిది చేసే పని కాదే. అనాలి.

బిడ్డలను సన్మార్గంలో వుంచాలని, ఇతరులతో పోల్చి, చూడు సోమనాధం యెంత మంచివాడో, "అనకూడదు." ఇట్లా చేస్తే అందరూ నవ్వరూ? అందరూ యేమనుకుంటారు? అని బిడ్డ ప్రవర్తన యితరుల అభిప్రాయంమీద ఆధారపరుచుకోడం నేర్పడం చాలాతప్పు. ఈ అలవాటు వల్లనే, యీకాలపు ప్రజలు, స్వంత అభిప్రాయాలనేవేలేక, నీతికీ దుర్నీతికీ విచక్షణను ఎరగనే ఎరగక, తక్కినవారు మంచిదనేదాన్ని తాము అనుసరిస్తూ, అంతరాత్మల్ని చంపుకుని తిరుగుతున్నారు. బిడ్డ అట్లాంటి అవస్థలో పడకండా కాపాడడం తలితండ్రులవిధి. తనకు మంచిదని తోచడం చాతనే, తనస్వబుద్ధిని

వుపయోగించి తన నడవడిని నిర్ధారణ చేసుకోవాలి బిడ్డ.

చివరికి నాన్నకి కోపమొస్తుందమ్మా అని కూడా అన కూడదు. ఆపని మీద విశ్వాసం చేతనే చెయ్యడం నేర్పాలి బిడ్డకి. సత్పురుషులనూ, సదాశయాలనూ, సత్కథలనూ సన్మార్గాలనూ చెప్పి చూపాలి. కాని వాటి ప్రకార మాచరించాలని బలవంతపరచ కూడదు.

ఉదహారణం:- యితరులతప్పుల్ని క్షమించడం వుత్తమ గుణమని చెప్పాలిసిందే. యింకొక పిల్ల కొట్టినప్పుడు క్షమించమని చెప్పాలి. కాని క్షమించి తీరాలని బలవంతం చెయ్య కూడదు. బలవంతంగా సన్మార్గంలోకి తిప్పడంకంటే, దుర్మార్గంలో వుండనిస్తేనే మంచిది. సన్మార్గాన్ని బిడ్డకి అలవాటు చెయ్యాలి. కాని బిడ్డ స్వభావం దుర్మార్గానికి యీడ్చినప్పుడు పెద్దవారు సన్మార్గంలోకి బలవంత పరచ కూడదు. బిడ్డకి దుర్మార్గానికి స్వేచ్ఛనిచ్చి, అది మనస్పూర్తిగా సన్మార్గాన్ని ప్రేమించి అదే యిష్టపడి 'ధర్మ మాచరించేట్టు చెయ్యాలి.

వ్వారికే వృత్తి ధర్మాలు బోధించి వుపన్యాసలియ్య కూడదు. ఆటల మూలకంగా అలవాట్లు నేర్పరచి, దురల వాట్లను తొలగించి, కొంచెం పెద్దదికాగానే ఆ అలవాట్లలో వుండే ధర్మాలను తెలియచెయ్యాలి. తప్పు చేసినప్పుడు ఆ దెట్లా తప్పో చూపాలిగాని, పుత్తప్పుడు తప్పులసంగతి బోధిస్తూకూచో కూడదు. తప్పు చేస్తే ఆ తప్పు సంగతే మాట్లాడాలిగాని, అదే సమయమని సమస్త ధర్మాలూ, బిడ్డ యెప్పుడో చేసి మరిచిన దుర్మార్గాలూ యేకరు పెట్టకూడదు.

పెద్దవారు బిడ్డకి బోధించేదానికి వ్యతిరిక్తంగా తామే నడుచుకున్నారా, యీ నీతి శిక్షణ అంతా సంపూర్ణంగా వృధా. బిడ్డని వ్యయం చెయ్యొద్దని పెద్దవారు డబ్బు వ్యయం చేస్తే, అబద్ధమాడవద్దని బిడ్డని శిక్షించి తమే అబద్ధమాడితే, [బిడ్డతోనైనా సరే యితరులతోనైనా సరే] అసలు బిడ్డకి నీతి శిక్ష నివ్వడం మానుకోడం మంచిది. బిడ్డ పెద్దవారిని అప్పుడు కపటులనన్నా అనకోదు. తనకో నీతి చట్టమూ పెద్ద వారికో నీతిచట్టమూ యేర్పరచుకున్నారనే కోపమన్నా

కలిగి వుండదు. పెద్దవారు చేసేపనులన్నీ పిల్లతప్పకుండా కనిపెట్టగలదు. దానికి తెలీదనుకోడం గొప్ప పొరపాటు. దుర్నీతిపరురాలే గాక, ఒకటి బోధించి ఒకటి చేసే కృత్రిమురాలుగా తయారవుతుంది. యింకతప్పని సరైనప్పుడు "నేను అబద్ధాలాడతాను పెద్దవాణ్ణే; లోకంలో విధిలేక వొప్పించా: అంతకన్న నాకుచాత కాలేదు. కాని అది మంచిపనికాదు. నువ్వు నాకన్న మంచివాడవు కావాలి" అని పెద్దవాళ్ళు అనడం కొంతవరకు పనిచెయ్యవొచ్చు.

ఒకవేళ బిడ్డ లౌకికురాలు కావాలనీ, ప్రపంచంలో చాలు అబద్ధాలూ, దొంగతనాలూ, మోసాలూ, పైకైనప్పుడల్లా, యితరులు పట్టుకోకుండా చెయ్యవొచ్చుననీ పెద్దవారి అభిప్రాయమైతే, అట్లానే బోధించాలిగాని, అలివిగాని ఆదర్శాలను బోధించకూడదు.

వీలైనంత గొప్ప ఆదర్శాలను తమప్రవర్తనవల్ల పిల్ల దృక్పథంలో వుంచాలి పెద్దవారు. వాటిననుష్ఠించడానికి ప్రయత్నించాలి. అపజయం పొందితే వొప్పుకుంటూ వుండాలి

లోకంలో ఆచరణలో వున్నవాటికన్న వున్నతాదర్శాలను బోధిస్తే, పిల్ల వ్యర్థురాలు, కావొచ్చు; కాని లోకంలోని. సాధారణ శుష్కజీవనులవలె నిరర్థకంగా బతికే. డబ్బు సంపాయించి, కీర్తిపొందడంతో సంతుష్టిపడడంకంటే, యీ గొప్ప ఆదర్శాలతో అపజయం పొందడమే వుత్తమం.

వ్యక్తిత్వం.

యితరుల పొగడ్తలకుగాని, హాస్యానికిగాని, నిందలకుగాని, లక్ష్యంచెయ్యక, పిల్ల తనకుమంచిదని తోచినపనులనే చెయ్యడం నేర్వాలి. మరీచిన్నతనంలో యేవిషయాలోనూ బిడ్డకు స్వతంత్రాభిప్రాయాలు వుండవు. అప్పుడు పెద్దవారి అభిప్రాయాల ప్రకారమే బిడ్డని వుంచవొచ్చు. కాని రెండో యేడు వొచ్చేప్పటికే బిడ్డకి స్వతంత్రాభిప్రాయాలు బైలుదేరతాయి. అప్పుడు వీలైనంతవరకు, బిడ్డ తనస్వాంత అభిప్రాయాల ప్రకారమే నడుచుకునేట్టు చెయ్యాలి. అవితప్పూ హానికరమూ ఐనాసరే పెద్దవాళ్లు తమఅభిప్రాయాలనూ అనుభవాలనూ, పిల్లతో చెప్పాలి. కాని అది వాటి ప్రకారం వుండడానికి వొప్పుకోకపోతే, వూరుకోవాలి; దాన్ని బలవంతం

చెయ్యకూడదు. లోకం అభిప్రాయాలనుకూడా లక్ష్యపెట్ట వొద్దని సలహా యివ్వాలి. బిడ్డ చీమల్ని చంపుతోంది. పెద్ద వారు అభిప్రాయమా చంపడం మంచిదికాదని చెప్పవొచ్చు "పాపం, వాటికి యెంతనొప్పి!" అనవొచ్చు. "యెందుకు చం పుతావు? చంపితే నీకేం లాభం!" అని అడగవొచ్చు. పెద్ద వారు తమ అభిప్రాయాలకు కారణాలు చెప్పవచ్చు. బిడ్డతో 'ఆర్గ్యూ' చెయ్యాలి. కాని చంపవొద్దని ఆజ్ఞాపించకూడదు. మాటవినక పోతే శిక్షించకూడదు. తన అభిప్రాయం మా ర్చుకునే సంగతి బిడ్డకే వొదలాలి. అభిప్రాయం మారితేనేగాని ఆచరణ యితరుల కొరకుగాని, తలితండ్రులకొరకుగాని మార్చుకోవొద్దని సలహాయివ్వాలి. బిడ్డ చీమల్ని చంపుతో వుంటే, యితరులు, "తప్పు తప్పు" అంటారు. కాని వాళ్ళ మాటల్ని నిర్లక్ష్యంచేసి చంపమని చెప్పాలి. ఆ యితరులు బిడ్డజోలికి వొస్తే పెద్దవారడ్డపడాలి. యీలోపల చీమలు చస్తు న్నాయే అంటే, చీమల ప్రాణాలమీద యీ పెద్దవారిని యెవరన్నా కావలి పెట్టారా? ఇంకో స్నేహితులు చంపుతో వుంటే యేంచేస్తారు? మత విషయమై, నీతి విషయమై కూడా యింతే. వినాయకపూజ చెయ్యనని పిల్లవాడంటే,

లేక మసీదుకు వెడతానంటే, వద్దనడానికి పెద్దవారికి అధికారంలేదు. యితరుల మాటల ప్రోద్బలంచాత చేస్తున్నా, పెద్దవారూ తమవేపు ప్రోత్సహించ వలిసిందేగాని, అడ్డపెట్ట కూడదు.

చేసిన కార్యంవల్ల వొచ్చే ఫలితాన్ని అనుభవించడమే బిడ్డకి శిక్ష. యింటోకి వొచ్చిన స్నేహితుణ్ని అల్లరి చేస్తాడు. వాడు పెద్దవారి అతిథులు గనక, పిల్లవాణ్ణి తల్లితండ్రులాటంక పెట్టవొచ్చు. వీథుల్లో మనుష్యులతో తగువులాడతాడు. వాళ్ళే తన్నుతారు; సరిపోతుంది. వాళ్లు వొచ్చి పెద్దవారితో చెప్తారు. పిల్లవాడు గనక యేదో తెలిక చేశానంటే, సర్దిపెట్టొచ్చు. కావలిసి అది సరైన కార్యమనుకుని చేశానంటే "సరే మీ యిష్టం. దాన్నేమన్నా చెయ్యండి" అని ఆ కొత్త వాళ్ళతో అనాలి. కాని కొన్ని విషయాల్లో యిట్లా ఆగి ఆలస్యం చెయ్యడానికి వీలుండదు. విషం తాగి చూస్తానంటాడు, యితరుల తలబద్దలు కొట్టడమో, యిల్లుకి నిప్పంటించడమో చేస్తూవుంటే అడ్డపెట్టి తీరాలి. కాని వీలైనంతవరకు అతనికి స్వేచ్ఛ నివ్వవలసిందే.

బిడ్డ తండ్రిమాటవినక యేదన్నా పనిచేస్తే, నీపట్టు గెలుస్తుందో, నాపట్టు గెలుస్తుందో చూద్దాం, అనేట్టుచేసి, అతనినిశ్చయశక్తిని ధ్వంసం చెయ్యచూడకూడదు. అప్పటి కాపనిని చెయ్యనిచ్చి, ఆపని అలవాటుకాకండా, దానిని మాన్పడానికి వేరేమార్గా లాలోచించాలి, వేరేపనులు కల్పించాలి.

బిడ్డవొస్తువులూ, అతని అవసరాలూ, అతనిపనులూ, అన్నీ దాన్నే నిర్ణయించుకోనియ్యాలి. ఏవిషయమన్నా "యేంచెయ్యాలి?" అని పెద్దవారి నడిగితే, నువ్వేయోచించుకో అనాలి.

తనకి స్వతంత్రముందికదా అని బిడ్డ యితరుల స్వాతంత్ర్యానికడ్డం రాకూడదు. వొచ్చాడా బిడ్డ స్వాతంత్రం ఆ నిమషానికి తీసెయ్యవొచ్చు.

పెద్దవారికాలమూ, సౌఖ్యమూ, వారిపనులూ, వీటిలో జోక్యంకలగ చేసుకుని, వారిని యిబ్బంది పెట్టడానికి బిడ్డకేమాత్రమూ అధికారం లేదు. బుద్ధితెలిసి నప్పటినించి, బిడ్డ తనొక వ్యక్తినసీ, తనకుయింటో తక్కినవారి మల్లెనే, రైట్సు

వున్నాయనీ, కాని యితరుల స్వేచ్ఛని ఆటంకపరచడానికి తనకి 'రైట్' లేదనిన్నీ, తెలుసుకోవాలి. ఇప్పుడేమిటంటే, పురుషుడికి సర్వాధికారమూ, తరవాత యెదిగిన కుర్రవాళ్ళకీ, తరవాత తల్లికీ, చివరికి కూతుళ్ళకీ యీప్రకారం తారతమ్యం వుంటోంది. ఇట్లాంటి అధీనతనించి స్త్రీలూ, పిల్లలూ, తిరగబడాలి. ఇప్పుడు స్త్రీలకూ పిల్లలకు అన్యాయం జరుగుతోందా అనేప్రశ్న అక్కర్లేదు. ఇట్లాంటి బేధాలు అనారోగ్యం; ఇల్లు ఒక కోఆపరేషన్, అందరికీ సమానమైన రైట్సు వుండి అందరూ కలిసివుండే సహకారసంఘంలాగుండాలి.

ఇప్పుడు సాధారణంగా కొన్ని యిళ్ళల్లోనూ కొంత కాలమూ, బిడ్డ చాలాఘనంగా చూడబడి పెద్దవారిమీద సర్వహక్కులనూ చలాయించడమో, లేక పెద్దవారి కారణమూ అర్ధమూలేని ఆజ్ఞలకిలోబడి, తుచ్ఛజీవనం గడపడమో సంభవిస్తోంది.

పిల్లలకు అర్ధవిహీనమైన గుడ్డివిధేయత నేర్పకూడదు. పిల్లలకి పెట్టే ఆజ్ఞలు కొందుకు అవసరములో యెప్పటికప్పుడు వారికి తెలియచేస్తూ వుండాలి. యెవరి ఆజ్ఞను ప్రశ్నించడానికి

ఏల్లేదో అట్లాంటి అధికారివలెగాక ఒక ఆటలో అధికారాన్ని తక్కినవారి అనజ్ఞచేత పొందిన నాయకుడివలె వుండాలి తల్లిగాని తండ్రిగాని. అందరూ కలిసి కుటుంబనిర్వాహంకం చెయ్యాలి గనకనూ, ఒకరు నాయకత్వం వహించక పోతే యీ సంచారలీల జరగదు గనకనూ, అనుభవశాలియైన జనని నాయకురాలై వుండాలి, ఇంటినియమాలు పిల్లలే గాక పెద్దవారూ పాటించాలి. బిడ్డ టోపీ కొనిపెట్టమంటే అనవసరముని చెప్పి, తండ్రి తను అవసరంగా సిగరెట్లు కాల్చకూడదు.

పొద్దస్తమానం 'అది చెయ్యాకు. చప్పుడు చెయ్యాకు ఆబల్ల ముట్టకోకు. అట్లాకూచో', అనే ఆజ్ఞలతో బిడ్డప్రాణాలు తియ్యకూడదు. బిడ్డచేస్తున్న అక్రమమైన పనులు చూసి, జ్ఞాపకముంచుకుని, సరైన అలవాట్లద్వారా దానికి తెలీకండానే దానితో చెప్పకండానే వాటిని కుదర్చాలి. బిడ్డ చీమిడి వొంటికి రాసుకుంటూ వుంటే అట్లారాసుకో వొద్దుఅని చెప్పివయోజనంలేదు. చేతిరుమాలిచ్చిదాంతో తుడుచుకునే అలవాటు నభివృద్ధి చెయ్యాలి:

తప్పుఆజ్ఞ పెట్టినప్పుడు బిడ్డని క్షమాపణ వేడుకోవాలి. "చలిగావుంది, బైటికివెళ్ళకు" అని బిడ్డవన్నతరవాత చలిగా లేదని తెలిస్తే తనపొరపాటుని వొప్పుకోవాలి తల్లి.

యిట్లా బిడ్డకి విధేయతను నేర్పడం సులభమైన పని కాదు. సదా సాధ్యంకాదు. అప్పుడప్పుడు కఠినంగా అడ్డపెట్ట వలిసి వస్తుంది. కాని సాధ్యమైనంతవరకు యీ పద్ధతుల్ని అవలంభించాలి.

స్వార్థం.

స్వార్థం ఒక బలీయమైన "యిన్స్టింక్టు". అది జీవితానికి చాలా అవసరం కూడాను. అది మితిమీరనూ కూడదు, నశించనూ కూడదు. అన్నీ, బొమ్మలూ, ఫలహారాలూ సౌఖ్యాలూ తనకే కావాలని అనుకోడం బిడ్డకి సహజం. పెద్దవాళ్ళు తన సంగతే చూడాలనీ, తననే ప్రేమించాలనీ అంటుంది. తనకి అన్నీ కావాలనుకోడం తప్పుగాదు. కాని యితరులకుకూడా వుంటే వోర్వలేక పోవడం, యితరులవీ తనవీ, అన్నీ, తనకే కావాలనుకోడం, యితరులతో పంచుకోలేక

పోవడం, యివితప్పు. తననుభవించడంకోసం బిడ్డ సౌఖ్యమూ, వస్తువులూ కోరడం యేమాత్రమూ తప్పుకాదు. తనను నిరాకరించుకుని, తృణీకరించుకునే వేదాంతం ఆత్మనాశనానికి హేతువు, తను అనుభవించాలి, ఆనందించాలి. కానియితరుల అనుభవం, ఆనందం, ఆస్తి, తనకి కావాలని, వారికి వుండకూడదనీ కోరకూడదు.

బిడ్డలోవున్న స్వార్థాన్ని చంపకూడదు. అది సహజం; వుపయోగకరం; అసలది చావదు. దాన్ని చంపాలని బిడ్డని శిక్షిస్తే, అదిమొండిదవుతుంది. స్వార్థం జీవనశక్తి; అదినశిస్తే మనుష్యశక్తి నశించిందన్నమాటే. స్వప్రేమని సంకుచింతంగా వున్నదాన్ని, యితరులయెడల విస్తీర్ణతపొందేట్టు చెయ్యాలి. ముందు యితరుల యెడల బిడ్డ జరపవలసిన న్యాయమూ, వారి అభిప్రాయాలకూ పనులకూ స్వాతంత్ర మివ్వడమూ, నేర్పాలి. ఎంతవారికీ కూడా స్వప్రేమ చావదు. ఆప్రేమ యెంత అధికంగావుంటే అంత గొప్పవారవుతారు. క్రమంగా ఆస్వప్రేమలో యితరుల్ని చేర్చుకోవాలి. వారివారి స్వభా

వాన్ని శిక్షణ చూపట్టి, లోకంలో కొంతకొంత భాగాన్ని ప్రేమనిశాలత్వానికి చేస్తుంటారు. కొందరు తమకుటుంబాన్ని మాత్రమే, కొందరు తమవ్యాపారివాళ్ళనే, కొందరు తమసంఘాన్నే, కొందరు తమదేశాన్నే. యీవిధంగా ప్రేమిస్తారు. కనక ప్రేమను ఎక్కువ చేసి విస్తీర్ణం గావించేట్లు చెయ్యాలి.

ముందు తనను ప్రేమించుకోనివాడు, లోకంలో యెవరినీ, ప్రేమించలేడు. ఈస్వార్థాన్ని చంపాలని పెద్దవాళ్ళు ప్రయత్నించడంవల్లనే చివరికి బిడ్డ తన సౌఖ్యాన్ని కూడా కోరుకోడం, అనుభవించడం చాతకాక, యెవబ్బునో మర్యానో యితరుల అభిప్రాయాన్నో, తన దృష్టిలో నిలిపి, అతిక్షుద్ర పదార్థంకోసం, తన ఆనందాన్నంతా ధ్వంసం చేసుకుంటుంది. సౌఖ్యపడే వాడెప్పుడూ, ఇతరులను ద్వేషించడు. యితరుల మీద యీర్ష్యపడడు. అన్ని సౌఖ్యాలూ వుండి, అనుభవించడం చాతగాక, లేనిదాని కోసం యేడ్చేవాళ్ళని, తమకు లేని దాన్ని యితరునో కలిగివున్నవాళ్ళని చూసి యేడ్చేవాళ్ళని చూస్తూవుంటాము అనేక మందిని. వూరికే సంపాదిస్తూ, కష్టపడుతూ, చీదరించుకుంటూ, తిట్టుకుంటూ, చివరదాకా సంపా

యుంది. అది భరించడం తెలీక, అట్లానే చచ్చేవాళ్ళని చూస్తున్నాను,

కనక ముందు తనకి వున్న దానిని తన ఆనందం కోసం వుపయోగించుకోడం నేర్చాలి, బిడ్డది కాని దొంగ ఆదర్శం బిడ్డముందు పెట్టడంవల్లనే ఇన్ని అవస్థలు సంభవిస్తాయి.

జీవితానికి మూల సూత్రం ఆత్మానందం. ఆ ఆనందాన్ని సంపాయించుకోడం నేర్చాలి. ఇతరులకి కష్టంకలిగించకండా తనకి అనారోగ్యం కాకుండా ఆనందం సంపాయించే నేర్పుని నేర్చాలి, తరవాత క్రమంగా తనసంగతి మరిచిపోయి ఆటలలో, పాటలలో, సంస్థలలో కలిసి సంపాయించగల ఆనందాన్ని, యితరులకి ఆనందంకలిగించీ, కష్టంతొలిగించీ పొందుతునే ఆనందాన్ని, తన ఆనందాన్నిత్యజించడంవల్ల కలిగే ఆనందాన్ని బిడ్డకు రుచిచూపవొచ్చు. కాని కొందరు బిడ్డలు ఎన్నడూ అట్లాంటి ఔన్నత్యాన్ని నేర్చుకోరు; చాల మంది పెద్దలకి నేర్పడమూ చాతకాదు; అందు యీ పెద్దలకి అర్థమౌతేగా! అట్లాంటప్పుడు ఆ బిడ్డకి సుఖంగా తను అనుభవిం

చడం నేర్పడం మంచిది. కాని తమకీ, బిడ్డకీ కూడా చాత కాని ఆదర్శం ప్రయత్నించి బోర్లపడడం అనర్థకం. అట్లాంటి ప్రయత్నంవల్లనే, తమకి చేతగాని ధర్మాలను అందుకోవాలనీ, అధర్మాలన్నీ తమలో వున్నట్టుగా నటించాలనే ప్రయత్నం వల్లనే, ప్రజలు, యితరులకి ఆనంద మివ్వటం లేదు సరికదా, తామూ అనుభవించే శక్తిని పోగొట్టుకున్నారు.

చుట్టూ, ప్రతిచోటా, ఆనంద వుంది. అనుభవించడమే చాతకాదు ప్రజలకి.

బిడ్డకు యివ్వవలిసిన హక్కులు ముందు పెద్దవారివ్వాలి వారు స్వార్థం త్యజించాలి, ముఖ్యంగా బిడ్డ విషయమై తన హక్కుల్ని అనవసరంగా త్యజించకండా బిడ్డ అనుభవించడం నేర్పాలి. పెద్దవారు పిల్లల్నందర్నీ, తమవారినీ, యితరుల్ని సమానంగా చూడాలి. ఒక ఆట వస్తువుగాని, వుయ్యాల గాని, తినేవస్తువుగాని వుంటే, అందర్నీ వరస ప్రకారం, ఆడించి యితరులతో ఆనందం సమానంగా బిడ్డ పంచుకోడం నేర్పాలి. తమహృదయాలలోంచి కూడా పెద్దవారు పక్షపాతం తరిమెయ్యాలి.

అవసరమైనప్పుడైనా త్యాగం చెయ్యమని బలవంతం చెయ్యకూడదు. త్యాగం చెయ్యమని బిడ్డకు బోధించను కూడా కూడదు. త్యాగం మంచిదేగాని నేర్పడంవల్ల వొచ్చేది కాదు. అది సహజంగా నిర్వ్యాజంగా వొస్తుంది. నేర్పితే వొచ్చేది కృతకబలవంత త్యాగం. నిజమైన త్యాగం యేమిటంటే, క్షుద్రసౌఖ్యాన్ని ఉన్నతసౌఖ్యం కోసం త్యజించడం; తను బొమ్మతో ఆడుకుంటే వొచ్చే ఆనందాన్ని, యితరులా బొమ్మతో ఆడుకుంటే తనకు కలిగే ఆనందంకోసం త్యజించడం. కనక ఆ ఉన్నతానందాన్ని ప్రేమించే శక్తినియ్యాలి; ఆ అలవాటుని కలగ చెయ్యాలి. జాలి సానుభూతి, ప్రేమ, నిష్పక్షపాతం, యివి నేర్పాలి. అప్పుడు యితరులకోసం బిడ్డ త్యజిస్తాడు.

కాని బలవంతంగా వెయ్యిసార్లు తనంతట త్యజించేట్టు చేసినా, త్యాగం అలవాటుకాదు. పైగా యెవరికై త్యాగం చేశిందో బిడ్డ వారిమీదా, త్యాగం చేయించిన వారిమీదా క్రోధం అభివృద్ధి అవుతుంది. బలవంతం చేసి చందా లాక్కుపోతే, ఆ చందాతీసు కున్నవాళ్ళమీదా, చందాపోగు

చేసినవాళ్ళమీదా యెంత కోపంవొస్తుంది! ప్రాణాలు తీసేబిచ్చగాడి మీద యెంత ద్వేషం ప్రజలకి?

అనవసరంగా బాధ పడమని ప్రోత్సాహించడం, దేహాన్నిగాని, మనస్సుగాని శుష్కశ్రమలో డిసిప్లినులో పెట్టడం తప్పు. యే గొప్పభావానికో ఆదర్శానికో, శ్రమా బాధా నిగ్రహమూ ఉపయోగించి సౌఖ్యాన్ని త్యాగం చెయ్యడం మంచిదే. కాని వాటిమీద వాసనమైన ప్రేమవల్ల బిడ్డకా త్యాగం సహజంగా రావాలి. కనక నేర్పవలిసింది ప్రేమ; శుభ్రంగా లోకంలోని సౌఖ్యాలన్నీ అనుభవించడం; నిర్జీవవైరాగ్యం ఆరోగ్యకరం కాదు. ఉన్నతాదర్శంకోసం కాక, అర్ధవిహీనంగా దేని నిత్యజించనక్కర్లేదు. అనేక విధాలైన వుత్సాహాలు భక్తులు ఆనందాలు, అభినివేశాలు, ఆదర్శాలు కల్పించి, వాటితో బిడ్డని ఐక్యంచేసి, తన స్వలాభాన్ని మరిచిపోయి, ఆ సంస్థలలో, 'మూవ్‌మెంట్సు' లో, తన బడికోసం, స్నేహితుల కోసం, ఆటల కోసం, దేశం కోసం, సంఘం కోసం, సేవనించి ఆనందాన్ని పొందేట్టు చెయ్యాలి. లోకాన్ని దానితోవన చావనిమ్మని ముక్కుమూసుకుని తన ఆత్మ ముక్తిని కోరేవాడికన్న స్వార్ధపరుడెవ్వడూ లేడు.

ప్రతి మనిషికిన్నీ ప్రతి కార్యానికీ, ఉద్దేశ్యం తనకి ఆనందం కలగ చేసుకోడం. ఎంత బోధించినా యెంత బాధించినా, ఆ వుద్దేశ్యాన్నించి యెవరూ తప్పించుకోలేరు. దుష్టకార్యాలు చేసేవారూ, తమ సౌఖ్యాన్ని యితరుల సౌఖ్యాన్ని ధ్వంసం చేసేవారూ, తమని తామే బాధపెట్టుకునే వారూ, అందరూ ఆనందం కోసమే వెతుకుతున్నారు. కాని ఆ ఆనందాన్ని పొందేవిధం తెలీక, మూర్ఖంవల్ల యీ బాధలలో పడతారు. ముఖ్యమైన తప్పులు రెండు. ఆ నిమిషానకలిగే ఆనందానికి లోబడి ముందు కలగబొయ్యే గొప్ప బాధలను తెచ్చుకోడం తనకి జబ్బు చేస్తుందని తెలిసికూడా తిని, చాలా రోజులు బాధపడడం. రెండో తప్పు తనకు నిజమైన ఆనందంకలిగించుకోడం వదులుకుని, తను ఆనందంగా వున్నట్టు ఇతరులకు అభిప్రాయం కలిగించడానికి సకల బాధలూ పడడం. ఉదాహరణం- మర్యాద కోసం, ఫేషను కోసం ప్రజలు పడే బాధలు, ఈ రెండు తప్పులు చెయ్యకండా వుంటే ప్రపంచం చాలా బాగుపడుతుంది.

బిడ్డకి తాత్కాలికమైన సౌఖ్యాలనూ, నీచమైన సౌఖ్యాలనూ త్యజించి వున్నతానందాను పొందే మార్గం చూపాలి. దీనికి ఒకేవిధం ఉన్నతానందదాన్ని పొందగల శక్తి నివ్వడమే. అంత వరకు బిడ్డ తనచేతిలోని ఆనందాన్ని త్యజించదు. సృష్టిలోని సౌందర్యాన్ని, గొప్ప భావాల ఔన్నత్యాన్ని, ఇతరలమీది ప్రేమనూ, వీటిలోని అనందాన్ని అనుభవించే శక్తికలగ చేసినప్పుడే బిడ్డ తాను ఇతరులను బాధ పెడితే కలిగే అనందాన్ని యీర్ష్యవల్లా, అన్యాయంవల్లా స్వార్థంవల్లా మాట్లాడ్డవల్లా యింద్రియ లోలత్వంవల్లా కలిగే ఆనందదాన్ని త్యజిస్తుంది. పున్నతానందం నేర్పకంపా, వ్యర్థంగా త్యజించడంవల్లా, ప్రేమలేని వారికి త్యాగంచెయ్యమన డంవల్లా, ఉద్దేశ్యం లేకగడానే అనుభవించకండా యింద్రియాల్ని కట్టుకోమనడంవల్లా బిడ్డజీవితం వ్యర్థమూ, శూన్యమూ, అర్థవిహీనమై, కోపమూ, ద్వేషమూ, యీర్ష్యా ఎక్కువవుతాయి. ఈ అందమైన ప్రపంచమంతా, ప్రపంచం లోవుండే వుత్సాహమూ, ధర్మమూ, అనందమూ, బిడ్డవిగా

చెయ్యాలి; యీలోకానికి యువరాజై పుట్టినట్టుండాలి. ప్రజలనూ, సృష్టినీ, జీవితాన్నీ ప్రేమించి అనుభవించాలి. ఇంకా గొప్పతనాన్ని పొంది లోకాన్నంతా తన ఆ ఏగవం లోకి తీసుకోవాలనే ఆశ ఔన్నతం కావాలి. అంతేగాని, ఇదంతా మాయా అనీ, తనకేమీ సంబంధం లేదనీ, తొరగా వొదులుకోవాలనీ, సంకుచితంగా స్వార్థంగా, అంధంగా, తనదోవన తనుబతికే పండితొక్కట్టుగా వుంచకూడదు బిడ్డని బడీ, పిల్లలతో ఆటలూ, ప్రయాణాలు, మీటింగులూ, ప్రజాసేవా, దేశసేవా. యివన్నీ యీ పద్ధతికి సహాయభూతాలు. ప్రస్తుతం వూరికే పుస్తకాలు చదివించడమూ, స్కూల్లో పడేసి నూరడమూ, చేస్తో, తన పొట్టకి తాను సంపాయించుకోడమన్నది ఒకటే ఆదర్శంగా వుంచడమూ లేకపోతే త్వరలో పెళ్ళిచేసి, కుటుంబాన్ని పోషించమనడమూ అన్యాయం

అబద్ధం.

మొదట బిడ్డకి నిజానికీ అబద్ధానికీ భేదం తెలీదు. తనకి తోచిందల్లా మాట్లాడుతుంది. అట్లాంటప్పుడు వూరుకో

వాలి. దాని మాటల్లో అబద్ధాలు మొత్తి చూపనూకూడదు; 'ఎన్కరేజ్' చెయ్యనూ కూడదు. చాలసార్లు బిడ్డ తన భావనాశక్తినుపయోగించి, కథలలాగు, జరగనివన్నీ, జరిగినట్టే మాట్లాడుతుంది. అప్పుడూ పూరుకోవాలి. యిట్లాంటిమాటలు మరీయెక్కువైతే, ఆయిదారేళ్ళు వొచ్చినా మాట్లాడుతో, నిజం మాట్లాడవలసి నప్పుడు కూడా అమాటల్లో బిడ్డ తప్పించుకుంటూ వుంటే, పెద్దవారు 'కాజుఅల్'గా, మామూలుగా "అట్లాఐతే, యిట్లా అంటావేం! నువ్వు సరిగా చూడలేదు. సరిగ్గా చెప్పటం లేదు" అనాలి. బిడ్డ కావలిసి అబద్ధం చెప్పి నట్లున్నప్పుడు కూడా, మొదట్లో, "అట్లా అనాలని యిట్లా అన్నావా? సరిగ్గా మాట్లాడక పోతే నాకెట్లా తెలుస్తుంది? జ్ఞాపకంలేదా? యీసారి జ్ఞాపకముంచుకో" అనాలి వీలైనంత వరకు అబద్ధం చెప్పిదని అనకూడదు.

బిడ్డ అబద్ధాలాడడంకలిగించే పరిస్థితులన్నీ తప్పించాలి; అబద్ధాలాడ వలసిన అవసరం కలిగించకూడదు. శిక్షిస్తారనేభయమే అబద్ధాలకు ముఖ్యకారణం. ప్రేమవల్ల పాలించేచోట నిజం చెప్పడానికి భయముండదు. అబద్ధాలకి శిక్షిస్తే

యింకోసారి పెద్దవారు కనుక్కోడానికి వీలులేకుండా అబద్ధా లాడడం నేర్చుకుంటుంది. అబద్ధాలకి శిక్షించకూడదు. అబద్ధా లాడే పరిస్థితులను కలిగించిన తప్పు పెద్దవారు వారిదిగా తీసుకొని, శిక్షణా పద్ధతుల్ని సవరించుకోవాలి.

ఎప్పుడైనాసరే పూర్తిగా బిడ్డ మాటనమ్మాలి. అనుమానపడకూడదు. 'అబద్ధం! నాకు తెలుసు, నేను చూశాను' అని గదమాయించకూడదు. సంపూర్ణంగా బిడ్డ తప్పు తెలిస్తే నేగాని, బిడ్డని అబద్ధమాడావనకూడదు. యెంతవరకూ బిడ్డ మాట నమ్మితేనే వుండాలి.

అన్నిటికన్న ముఖ్యం పెద్దవారబద్ధాలాడకూడదు; ముఖ్యంగా బిడ్డతో. అది దేన్ని గురించి అడిగినా, స్పష్టంగా సరిగా వున్నదున్నట్టు నిజంచెప్పెయ్యాలి. బిడ్డ కక్కర్లేని విషయమైతే "నేను చెప్పను" అనాలి, అతని కర్థంకానిదైనా బిడ్డ వస్తే చెప్పాలి. కాని పూరికే జోక్యం లేని విషయాల బిడ్డని ప్రశ్నలు వెయ్యనియ్యకూడదు. కాని పెద్ద

వారు స్వలాభంకోసం, బిడ్డకు సంగతులు చెప్పకుండా దాచడంకాని, అబద్ధాలు చెప్పడంకాని కూడదు. బిడ్డతను యెట్లా పుట్టిందో లేక తను జంతువుల్లో చూసిన విషయాలూ, అడిగినా పెద్దవారు యేమీ తడుముకోకుండా నిజం చెప్పాలి. మతమూ దేవుడూ, దెయ్యాలూ, స్వర్గమూ చావూ పాపమూ. వీటిని గురించి అడిగినా, పెద్దవారు వారు యెట్లా నమ్ముతున్నారో అట్లా స్పష్టంగా బిడతో చెప్పాలి. ముందు పెద్దవారు తమ అభిప్రాయాలెటువంటివో నిశ్చయించుకోవాలి. చాలమందికి వాళ్ళ అభిప్రాయాలు నిశ్చయంగా వాళ్ళ కే తెలీవు.

బిడ్డతో మాట్లాడేప్పుడు భద్రంగా మాటల విలవ తెలుసుకుని మాట్లాడాలి. చీకట్లో తిరిగితే తేళ్ళు కుడతాయి అనకూడదు. కుట్టవొచ్చు అనాలి. బహు, మహా, యిట్లాంటివి జాగ్రతగా వుపయోగించాలి. నిజంగా అట్లా ఆకలేస్తే నేతప్ప నాకు చచ్చేటంత ఆకలేస్తోంది అని అనకూడదు. బిడ్డనీ అనకూడదు. యెదన్నా బిడ్డకు యిస్తాననేముందు, చేస్తాననేముందు బాగా ఆలోచించుకుని అనాలి. అన్నారా, మాటనిలబెట్టుకోవాలి. నిలబెట్టుకోలేకపోతే, కారణం బిడ్డకి తెలియ

చెప్పాలి. బిడ్డని శిక్షిస్తానని బెదిరిస్తే, శిక్షించితీరాలి. బిడ్డపడ్డప్పుడు 'నేలనికొడతాలే' అని నేలకిదెబ్బ తగులుతుందనే అబద్ధాలు కల్పించి మోసపుచ్చ కూడదు

సానుభూతి.

బిడ్డ స్వతస్సిద్ధంగా తనదగ్గిరవారిని ప్రేమిస్తుంది. కాని బిడ్డ సహజంగా ప్రేమించని వారిమీదికికూడా బిడ్డ ప్రేమని విస్తీర్ణింప చెయ్యడానికి ప్రయత్నించాలి. అనాథలు, బిచ్చగాళ్ళు, యింటికివొచ్చిన కొత్తవారు, వీరందరితోను బిడ్డకి స్నేహంచేసి, వారికి సంతోషంకలగచేసే ప్రయత్నం చేయించడం మంచిది. ఇతరజాతులు, ప్రజలు, యితరకులాలు, బీదలు, వారి వేషభాషలు, కష్టాలు, వీటిని గురించి కథలు చెప్పాలి. వాళ్ళవేషాలు వేయించి బిడ్డచేత ఆడించాలి. ఎప్పుడూ గొప్పవాళ్లూ, రాజులసంగతేగాక, అధములూ, దురదృష్టవంతులైన వారి సంగతికూడా విస్తారంగా మాట్లాడడం వుత్తమం. తనధనాన్ని సౌఖ్యాన్ని ఆటవస్తువులను, లేనివాళ్ళకి యిచ్చి వారి ఆనందంవల్ల తాను ఆనందపడేవిధం నేర్పాలి. ఇతరుల దుఃఖాన్ని, బాధని తొలగించడం కర్తవ్యమనీ, తను బాధను

కలిగించ కూడదనీ, బిడ్డకి పెద్దవారు తమ ప్రవర్తనవల్లనే చూపగలరు. కథలూ, నాటకాలూ ఒక సాధనం. అంతేగాని ఉపన్యాసాలు వ్యర్థం.

ఇతర ప్రాణులమీద గౌరవం కలిగేట్టుకూడా చెయ్యవొచ్చు. వాటిజీవనం, వాటి ఆనందం, వాటి ఆహారవాంఛ, యివన్నీ కథలలో నాటకాలలో బిడ్డకి తెలియచేసి, పావురాలు పిల్లులు, కుక్కలు, చాపలు, మొదలైన వాటిని పెంచడానికిచ్చి, వాటిమీద ప్రేమనభివృద్ధి చెయ్యవచ్చు. కాని యేజంతువుల్నీ బంధించకూడదు, బాధించకూడదు. అవసరంగా చంపవలిసి వొచ్చినప్పుడు [నల్లులు, తేళ్ళు మొదలైన వాటిని] బిడ్డకి కారణం చెప్పాలి. మృగాల్లో, కీటకాల్లో, తల్లులు, బిడ్డలకోసం యెంతపాటుపడతాయో, ఒక చిన్న పువ్వుకోసం, గడ్డిపరకకోసం, సృష్టియెంత ప్రయత్నిస్తుందో, జాగ్రత తీసుకుంటుందో చూపాలి.

విద్య

బాల్యంలో పాఠశాలకు వెళ్ళకముందూ వెళ్ళేప్పుడూ కూడా, వుపాధ్యాయుడికన్న కూడా, తలితండ్రులు బిడ్డకు జ్ఞానాభివృద్ధి చెయ్యగలరు. విద్య అనగా, చదవడమూ వ్రాయడమూ అనీ, పరీక్షలు ప్యాసు కావడమనీ, వుద్యోగాలు చెయ్యడమూ, అనే అభిప్రాయాలు పెద్దలకూ, బిడ్డలకూ పోవాలి.

బిడ్డ ప్రతివస్తువునీ పరిశీలించేందుకు వీళ్లు కలగచెయ్యాలి. పరిశీలించాలనే కుతూహలం స్వతస్సిద్ధంగానే వుంటుంది బిడకి; దాన్ని చంపంకటా వుంచెచాలు. షికార్లు రైళ్ళమీదా, బళ్ళమీదా, పడవలమీదా ప్రయాణాలూ; ఫ్యాక్టరీలూ, మ్యూజియాలూ, పట్టణాలూ, చూడడమూ, యివన్నీ చాలామంచిది. మృగాల్నీ మొక్కల్నీ పెంచేట్టు చెయ్యాలి. యేది చూడాలని పిల్ల అభిలాషపడ్డా, వీలుకలగచేసి యింకా ప్రోత్సహించి, బిడ్డకెటువంటి వాస్తువులలో, ప్రదేశాల్లో యిష్టమో కనిపెట్టి అటువంటివన్నీ చూపాలి.

సంగతుల్ని బిడ్డంతట బిడ్డనే తెలుసుకోనియ్యాలి; పెద్ద వారు చెప్పకూడదు. బిడ్డఅడిగితే, వీలైనసంగతులన్నీ "నువ్వే చూడు. తెలుసుకో"అనాలి. యింక బిడ్డ తెలుసు కోలేనివైతే, బిడ్డ ప్రయత్నించి తెలుసుకోలేకపోతే, చెప్పాలి. బిడ్డని జ్ఞానం కోసం అపాయకరమైన పనులైనా చెయ్యనియ్యాలి. బాధ కలిగేవైతే, బాధకలుగుతుందని చెప్పడం విధి. అప్పటికీ తనే చూస్తానంటే, చూడనియ్యాలి. వేడిదీపం తాకుతానంటే కాలుతుందనిచెప్పి, అయినా తాకుతానంటే తాకనిచ్చి తీర వలసిందే.

ప్రకృతిశాస్త్రం (సైన్సు)లో బిడ్డకు విశ్వాసం కుద ర్చాలి. ప్రతిదీ మనుషులు తెలుసుకో గలరని, ప్రత్యక్షంగా ఎక్స్పెరిమెంటువల్ల గాక, మూర్ఖంగా నమ్మాలని అనేసంగ తుల్లో చాలా అబద్ధా లుంటాయని బిడ్డకి తెలియచెప్పడం మంచిది. శాస్త్రాలూ, మనుషులూ, చెప్పడంవల్లగాక, తనం తట తానుచూచి, స్వబుద్ధితో విచారించి తెలుసుకునే అభ్యా సాన్ని కలగ చెయ్యాలి. పెద్దవారు మొదోసంగతిచెప్పి, తాము

చెపుతున్నారు గనక, నమ్మమని బిడ్డననకూడదు. తలితండ్రులు చెప్పినా, నమ్మక, తానే స్వబుద్ధి నుపయోగించే అలవాటు వీలైనంతవర కెక్కువ చెయ్యాలి.

బిడ్డ ప్రశ్నలువేస్తుంది. ఒకటే అడగడం; కాని విసుక్కోకూడదు. పనిగావుంటే యిప్పుడు చెప్పననాలి. చెప్పను పొమ్మనకూడదు. పెద్దవాళ్ళకెట్లా సరైన జవాబు పెద్దవాళ్లు చెపుతారో, అట్లానే చెప్పాలి. బిడ్డలికికూడా, తమకి తెలీక పోతే పెద్దవాళ్ళు తెలుసుకొని చెప్పాలి, కాని బిడ్డ తనంతట తాను తెలుసుకోగల విధంవుంటే, పెద్దవారు చెప్పకూడదు. మార్గంచూపి వదలాలి. పెద్దవాళ్ళకి తెలీకపోతే, తెలీదనాలి. కానిఅబద్ధం జవాబు చెప్పకూడదు. బిడ్డ పనిలేకండా అసక్తి లేకండా వేసే సోమరిప్రశ్నలు 'ఎన్కరేజ్' చెయ్యకూడదు. 'నువ్వేచెప్పు జవాబు'అనాలి.

లోకంలోని దారిద్ర్యమూ, మూర్ఖమూ, మోసమూ, కఠినత్వమూ, అన్నీ బిడ్డకు తెలిసేట్టు, పెద్దవాళ్ళు చూపనక్కర్లేదు. బిడ్డ అడిగితేమాత్రం వాటిసంగతి స్పష్టంగా తెలిసేట్టు

చెప్పాలి. ఆచెడుగు [ఈవిల్) శాశ్వతంకాదనీ, దాన్ని తొల గించడానికి వీలుండనీ, యీశ్వరుడో, మాయో కర్మమో దా నికి కారణమైనా కాకపోయినా, మనుషులు ప్రయత్నించి పోరాడి, దాన్ని నిర్మూలం చెయ్యగలరనీ, అట్లా చెయ్యడం ప్రతివారి ధర్మమనీ విశ్వాసింపచెయ్యాలి. చెడ్డవాళ్ళపైన కోపమూ, అసహ్యమూ, లోకువా, కలిగించకూడదు. వారు చాతకాక జీవితాన్ని పాడుచేసుకున్న మనుష్యులని నిరూ పించాలి.

మృగాలవలె, చెట్లవలె, కధల్లో మనుషులవలె అను కుని పిల్లలతో పెద్దవారు కలిసి ఆడించడంవల్లా, చిన్ననాటకా లచేతా, పిల్లలభావనాశక్తినీ, అభినయశక్తినీ అభివృద్ధి చె య్యవొచ్చు.

పనిలేకండానే మాట్లాడించడంవల్లా, కధలూ, అనుభ వాలూ చెప్పమనడంవల్లా భాషనభివృద్ధి చెయ్యవొచ్చు. గొ ప్పకవుల పద్యాలూ వప్పచెప్పేట్టు చెయ్యడం మంచిది; వాళ్ల నే కూచుని చదివి వప్పజెప్పమంటే చెప్పరుగాని పెద్దవారు

ముద్దుగా దగ్గరకూచోపెట్టుకుని పద్యం వొచ్చిందాకానోటితో చెపితే, సంతోషంగా నేర్చుకుంటారు.

దేశాన్ని గురించి, దేశౌన్నత్యాన్ని గురించి సంకుచిత మైన అభిప్రాయాల్ని నేర్చుకోనీకూడదు. దేశంమీద కంటె లోకంమీద ప్రేమ నెక్కువ చెయ్యాలి.

తనవారిదే, తనవూరిదే, తనదేశందే, గొప్పతన మన మనీ, వారి ఆచారాలన్నీ ఉత్తమాలనీ, ఇతరులవి పనికిరానివనీ బిడ్డ అనుకోకూడదు. నిష్పక్షపాతంగా తనవిగాని, తనవారివి గాని, దేశానివిగాని తప్పుల్ని వొప్పుకోవాలి.

చాపలల్లడం, నూలువొడకడం, తవ్వడం, తోటపనులు మట్టిపనులు, కాయితప్పనులు, వడ్రింగం, సీమసున్నంతో బొమ్మలుగియ్యడం, సాధన చేయించాలి,

బడి.

పిల్లని బళ్ళోవెయ్యడంతోటే తమభాధ్యత సర్వవిధ ములా, తీరిందనుకుంటారు. భోజనమూ, బట్టాయియ్యడమూ

రోగం రాకండా చూడ్డము, ఇంతే పెద్దవారు విచారించేది. బడికి పోయి, యేడాదిచివర పైతరగతిలోకి పోతే చాలు. ఈలోపున బిడ్డ యేం చేస్తున్నదీ, యేం నేర్చుకుంటున్నదీ, వారికక్కర్లేదు. ఎట్లానన్నా, బిడ్డ ఒకటి యింటో వున్నదని మరిచిపోవడానికే పెద్దల ప్రయత్నం.

బిడ్డని బలవంతపరచి పాఠశాలకు [illegible] పంపగూడదు. ఏడుస్తో బడికిపోయి పండితురాలు కావడంకన్న, చదువు లేకండా మూర్ఖురాలుగా వుండడం వుత్తమం. కొందరు పిల్లల స్వభావం బళ్ళో శాశ్వతంగా గాయపడతుంది. చాలాబళ్ళు వున్న తెలివిని చంపే విషశాలలూ, పిల్లల్ని బాధపెట్టే కటికస్థలాలూ, అనారోగ్యాన్ని అభివృద్ధిచేసే నరకకూపాలై వున్నాయి.

బళ్ళో బిడ్డని ప్రవేశపెట్టిన తరవాత తలితండ్రులు చాలా సార్లు ఆబడికి వెళ్ళిచూడాలి. అక్కడ యేంచెప్పేదీ, యెట్లా చెప్పేదీ, బిడ్డల్ని బాధపెట్టేదీ, యివన్నీ జాగ్రతగా పరిశీలించాలి. తమసలహాలను వుపాధ్యాయుడు వినేట్టు చెయ్యాలి.

పరీక్షలు గడిచి పైతరగతులలోకి పోతున్నంత మాత్రాన బిడ్డ అభివృద్ధి చెందుతోందను కూడదు. విద్య వుద్దేశ్యంకూడా పైతరగతులకి పోవడంకాదని బిడ్డా పెద్దవారు కూడా విశ్వసించాలి.

కథలు

చాలా కథలూ చెప్పాలి పిల్లలికి. పెద్దవారికి రాకపోతే, నేర్చుకు, చదివి, చెప్పాలి. వాళ్ళ వయసునుపట్టి దేవతలూ, రుషులూ, వుచ్చేకథలూ, జంతువులూ, చెట్లూ, తిరిగి మాట్లాడేకథలూ, పురాణకథలూ, మహాపురుషుల జీవితకథలూ, ఎన్నెన్నో చెప్పాలి. చెప్పినతరవాత మళ్ళీ ఆకథను చెప్పమని బిడ్డను బాధపెట్టకూడదు. బిడ్డ ఉత్సాహపడితే, పెద్దవాళ్ళు చెప్పిన కథల్నిగాని, తన సొంత కథలనుగాని చెప్పనియ్యాలి. నీతి చెప్పనూకూడదు. కథకి నీతేమిటని బిడ్డని అడగనూ కూడదు. ముఖ్యంగా దేశంలో వాడుకలోవున్నకథలు చెప్పాలి. అసహ్యమైనవీ, అమితంగా క్రోధమూ, దుఃఖమూ భయమూ కలిగించే కథలూ చెప్పకూడదు. మంచికథల్ని బిడ్డలచాతనాటకాలుగా ఆడించవొచ్చు.

పెద్దపిల్లలు చిన్నపిల్లలకీ కథలు చెప్పవొచ్చు. బిడ్డకి చదవడం రాగానే చాలా కథల పుస్తకాలియ్యాలి.

కళలు

సృష్టితో యెప్పుడూ బిడ్డకి సంబంధముండేట్టు చూడాలి. తోటలూ, గాలీ, నీళ్లూ, ఆకాశమూ వీటిలో బిడ్డకి ఆనందం కలగచెయ్యాలి. షికార్లు పంపాలి. యింటికి తోట వుంటే; బిడ్డకిష్టమున్నంసేపు దాంట్లోనే వుణ్ణియ్యాలి. పెద్ద వాళ్ళు అనుభవిస్తో, బిడ్డనీ సృష్టి సౌందర్యాన్నీ, సూర్యోదయాన్నీ అస్తమయాన్నీ, వెన్నెలనీ, అనుభవించి, ఆనందించి అమృతంలో నిండేట్టు చెయ్యాలి. కాని పెద్దవారి ఆనందాన్ని బిడ్డ కపటంగా 'ఫాషన్'కి తనూ తలతిప్పే ఆపదలో పడకండా కాపాడాలి. దానికి సృష్టి సౌందర్య మర్థం కాకపోతే వూరుకుంటే మంచిది. కాని సృష్టిని ప్రేమించని బిడ్డ వుండదు లోకంలో.

బాలుడికి యేకళలో యెక్కువ రుచివున్నదో కనిపెట్టి ఆవిధమైన కళావాతావరణలో పెంచాలి. దేంట్లోనూ అభిరుచి లేకపోతే వొదిలెయ్యాలి. కాని నేర్చుకోమని బలవంతం చెయ్యకూడదు.

మాటల్లో, చేష్టల్లో, బట్టల్లో, టేస్టు, అభివృద్ధి చెయ్యాలి. ఏవి అందమైనవో యేవిమర్యాదైనవో తెలియ చెయ్యాలి. కాని తనఅందమే చూసుకుని కులికేవాణ్ణిగా తయారు చెయ్యకూడదు. పెద్దవారి అభిప్రాయాలే సరైనవని అనుకుని అవే అతను 'కాపీ' చేసేట్టు చెయ్యకూడదు. ఇతరులెట్లా చేస్తున్నారో చూసి దాన్నికూడా బిడ్డగుడ్డిగా అనుకరించేట్టూ చెయ్యకూడదు. బిడ్డటేస్టుకి స్వతంత్రముండాలి, జుట్టూకట్టూ తీరుగా, విద్యావంతులకు మర్యాదస్తులకు, తగివుండేటుగా అలవరచాలి. కాని వాటిని నిర్ధారణచేసిన తరవాత, ఆజుట్టుసంగతే, వేషంసంగతే, ఆలోచించక బిడ్డ వాటినీ తననీ మరిచిపోవాలి.

బిడ్డని మంచినాటకాలను, బయస్కోపులను సర్కసులను చూడనివ్వాలి, మంచిసంగీతం విననివ్వాలి. బిడ్డ తననడవడిలోకూడా, యిదిమంచిపనా, అసహ్యమైనపనా, అనిఆలోచించుకోడం మంచిది.

పెద్దవారు తమచేష్టలను బిడ్డనెత్తిమీద రుద్దకూడదు. తనకు అభిలాషవుందని, బిడ్డకి యిష్టంలేక పోయినా సంగీతము మొదలైనవి బిడ్డని బాధపెట్టి నేర్పేవారున్నారు.

సృష్టిజ్ఞానం

స్త్రీ పురుషసంబంధం విషయమై పెద్దవారి నీతి ప్రవర్తనా అభిప్రాయాలూ, చిన్నప్పుడూ నేర్చుకున్న అలవాట్ల మీద చాలా ఆధారపడివుంటుంది. కనక ఆలోచనలలో, పనులలో బిడ్డకి సరైన అలవాట్లు యేర్పరచాలి. ఈవిషయమై యెవరూ ఆలోచించరు, ఎవరికీపట్టదు. ఈసంగతుల్ని గురించి వ్రాయడమూ, మాట్లాడ్డమూ బూతుఐపోయింది. ముఖ్యంగా తలితండ్రులు బిడ్డలతో అసలు మాట్లాడరు. కాని యీ జ్ఞానం తక్కువ కావడంవల్లా, మలినం కావడంవల్లా తమబిడ్డలలో ఎన్ని వక్రత్వాలు, యెంతనష్టం తటస్థిస్తోందో తెలుసుకొన్నట్టయితే పెద్దవారు యెక్కువశ్రద్ధ తీసుకుని తీరతారు.

ముఖ్యంగా జ్ఞాపకముంచుకో వలిసింది రెండుసూత్రాలు ఒకటి- పిల్లలు వీలైనంతవరకు తమ "సెక్సు" జాపకం తెచ్చు

కోనవసరం లేని పరిస్థితులలో వారిని పెంచాలి. బాలుడనీ బాలికనీ, మాటిమాటికీ ఆ బేధాన్ని జ్ఞాపకం తెచ్చుకోవలిసిన అవసరముండకూడదు ఆ బేధమూ, అంది యెందువల్ల కలిగిందో, ఆభేధంవల్ల వారిజీవితంలో బేధమేమిటో వారు యెక్కువగా ఆలోచించకండావుండాలి కోరేది—కాని ఆ బేధాన్ని గురించి ఆలోచించి. తెలుసుకో ప్రయత్నించారా. పెద్దవారు యేమాత్రమూ సంకోచింపక దాచక స్పష్టంగా చెప్పి వెయ్యాలి.

సహజంగా బిడ్డకి తన శరీరంమీదా, ప్రేమా, గౌరవమూ అభిమానమూ వుంటాయి. అవి నశింపకండా చూడడం పెద్దవారి విధి. శరీరము నీచమనీ, పాపభూయిష్టమనీ, దాని ధ్యాసే పాపమనీ, చెప్పే వేదాంతాన్ని వొదిలి, సృష్టిసౌందర్యమంతా కలిసిననిలయము దేహమనీ, లోకంలోని ఆనందాన్ని అనుభవించడానికి సాధనమనీ, యీశ్వరుడు [నమ్మకముంటే] నివసించే గృహమనీ, చెప్పాలి. తన దేహాన్ని యితరులు తాకకండా, ఉపయోగించకండా, బిడ్డ జాగ్రత పడటం నేర్పాలి. శరీరంలో కొన్ని అవయవాలు నీచములని గాని, అవ

రిశుభ్రములని గాని, పాపములని గాని, సిగ్గు పడవలసినవీ, దాచుకోవలసినవనిగాని నేర్పకూడదు. పెద్దవారు తమ మాటలవల్ల ప్రవర్తనవల్ల అట్లాంటి అభిప్రాయాలు కలిగించ కూడదు. ఈ కింద విషయములు జాగ్రతగా గమనించాలి.

1 బంధువులుగాని, ఇతరులుగాని, తలితండ్రులుగాని, బిడ్డల్ని ముద్దు పెట్టుకోకూడదు, నలపకూడదు- బిడ్డ ఇష్టపడ్డా వనికిరాదు.

2 ముసిలమ్మలు మొదలైనవారు బిడ్డ సృష్టి అవయవా లతో ఆడడమూ వాటిని ముద్దుపెట్టుకోడమూ, బిడ్డ దృష్టిని వాటి వేపు మరల్చడమూ, చాలా హానికర మైనపని. అట్లాంటి వారిని వెంటనే కర్రతో చావకొట్టి నా తప్పుకాదు.

3 బిడ్డని యెన్నడూ యెవరూ కొట్టకూడదు.

దెబ్బలు తినడానికి అలవాటు పడ్డబిడ్డ తనవొంటిమీద అభిమానాన్ని పోగొట్టుకుంటుంది. పరాయివాళ్ళేంచేసినా లొంగి హాయ్యే అలవాటులో పడుతుంది. కనక దెబ్బలంతహాని కరమైన విషయం యింకేదీ లేదు.

4. ప్రత్యేకంగా సృష్టి అవయవాలను దాచే, సిగ్గు బిళ్ళలు గోచీలు, యేమాత్రమూ పనికిరావు.

మొగపిల్లలకూ ఆడపిల్లలకు ఒకటే విధమైన బట్టలు వెయ్యడం అవసరం; జుట్టు ఒకటే విధంగా వుండాలి. ఆడ పిల్లలకి మాత్రం ముక్కులు చెవులు కుట్టుట తప్పు. పేర్లుకూడా మొగ ఆడ విచక్షణలేకుండా పెడితే మరీ మంచిది.

వీలైనంతవరకు బట్టలు లేకుండా తిరగనియ్యడమే ఆదర్శంగా వుంచుకోవాలి. చలికి తప్ప బట్టలు వెయ్యనక్కర్లేదు. బైటికి బిడ్డని తీసికెళ్ళేటప్పుడు, మర్యాదకోసం, బట్టలు వెయ్యొచ్చు. బిడ్డకే సిగ్గువొచ్చి బట్టలు అడిగినప్పుడే బట్టలు కుట్టించడం అవసరం. అప్పుడుకూడా వీలైనంతవరకు బట్టలు లేకుండా వుండనియ్యడం మంచిది.

బిడ్డకు తన దేహము పవిత్రమనే అభిప్రాయం స్థిరంగా వుండాలంటే, పెద్దవారుకూడా అమితమైన సిగ్గును కనపరచకూడదు. లోకాచారప్రకారం దుస్తుల్ని ధరిస్తున్నారే గాని ప్రత్యేకంగా యేమీ దాచడానికి కాదన్నట్టుండాలి. పెద్దవారు

బట్టలేకుండా వున్నప్పుడు బిడ్డ చూడడం తటస్థిస్తే అమితంగా సిగ్గుపడడం అరిచి పొమ్మనడం, యేమీ చెయ్యక సహజంగా ప్రవర్తించాలి. బిడ్డ ప్రశ్నలు వేస్తే సిగ్గులేకుండా వాస్తవమైన జవాబులు చెప్పాలి; డాక్టర్లు తమ విద్యార్థులకు బోధించినట్లే. ఇట్లాంటి విషయాల్లో తాము సిగ్గుని వదలక బిడ్డలపైన కేకలు వెయ్యడంవల్ల పెద్దలు బిడ్డలకు అమితమైన హాని చేస్తున్నారు.

రెండో యేడు మొదలు ఎనిమిదో యేటి మధ్య చాల మంది పిల్లలు మాస్టర్బేట్ చేస్తారు; తొడా తొడా రాసుకోడమూ, కుర్చీలకు రాయడమూ, పెద్దవారివొంటికి రాయడమూ మొదలైనవి. కాని సాధారణంగా యిది పెద్దవారు కనిపెట్టలేరు. కాని కనిపెట్టినట్టయితే యేమీ తెలీనట్టు తాము చూడనట్టు వూరుకోవాలి. చాతనైతే బిడ్డని వేరే పనిలో ప్రవేశపెట్టవొచ్చు బిడ్డని అందుకని కోప్పడ్డం కాని అట్లా చెయ్యవొద్దని చెప్పడంగాని, అది చూసి నవ్వడంగాని వెక్కిరించడంగాని పనిరాదు. ఇంకెవరిని "నోటీస్" చెయ్యనీకూడదు. ఎందుకంటే, తానేమి చేస్తోందో బిడ్డకే తెలీదు. దానివల్ల ఏహానీలేదు. ఆ అలవాటు దానంతట అదే పోతుంది. కాని

పెద్దవారు అదిరిపడ్డారా, తాము భయపడి అసహ్యపడి, బిడ్డని బెదిరించారా, ఇంక అది విషతుల్యమై బిడ్డ, సెక్సు జీవితాన్ని నాశనంచేస్తుంది. ఈ అలవాటుకోసం బిడ్డల్ని కొట్టేవారు, తిట్టేవారు మూర్ఖులున్నారు. చెపితేమాత్రం వారు వింటారా? అంతఘోరం జరుగుతో వుంటే, అదిఘోరం కాదంటే అన్నవాడు అవి నీతిబోధిస్తున్నాడంటారు. అంతే బిడ్డని కోపించిన కొద్దిఅలవాటు అంతకన్న ఘోరమైన అలవాట్లూ యెక్కువవుతాయి. ఇరవైనాలుగు గంటలూ బిడ్డని కనిపెట్టి వుండలేరు గనక, శిక్షించి వ్యర్థం, కానివిపరు; ఎంత ఎంత చెప్పి ఏలాభం? చెప్పాలనే యీ వెఱ్రి యెందుకో తెలీదు.

గట్టిబట్టలు, సృష్టిఅవయవాలకు రాసుకునేవి వెయ్యకూడదు. బిగుతులాగువంటివీ, గోచీలవంటివీ, మంచివికావు.

చిన్నప్పటినించీ, పిల్లలకు శుభ్రమైన అలవాట్లు నేర్పాలి. చన్నీళ్ళస్నానమూ, గట్టిపడకలమీద నిద్రా, మంచిగాలీ వ్యాయామమూ, దేహవస్త్రశుభ్రతా, సోమరిగావుండక పోవడమూ మొదలైనవి. స్నానమప్పుడు తక్కిన శరీరంతో

పాటు స్త్రీఅవయవాలను కనుక్కోడము పెద్దవారు అలవాటు చెయ్యాలి.

చిన్నప్పణించి కూడా బిడ్డయొక్క సృష్టిఅవయవాల విషయమైమాట్లాడవలసివొచ్చినప్పుడూ, వాటికి వైద్యము చెయ్యవలసివొచ్చినప్పుడు సిగ్గుగాని, హేళనగాని, యేమీకనపరచక, సహజంగా, చూపులో, మాటలో పనిలో తక్కినవొస్తువుల యెడల ప్రవర్తించినట్టే ప్రవర్తించాలి. సిగ్గూ అసహ్యమూ కనపరచ కూడదు. వాటిని వాటిపేర్లతో సిగ్గులేకండా సహజంగా మాట్లాడాలి. ఇప్పుడున్నపేర్లు బూతులుగా పరిణమించాయి గనక కొత్తపేర్లు పెట్టుకుని పెద్దలూ ఆపేర్లతో వాడుకోవాలి. పిల్లలు తమఅవయవాలతో ఆడుకుంటూ వుంటే మాట్లాడకూడదు, అడ్డపెట్టకూడదు. పరాయివాళ్ళు కూడా యేమీఅనకండా పెద్దవారు జాగ్రతతీసుకోవాలి. బిడ్డకి బుద్ధితెలిసిన తరవాత అసలు యీ అవయవాలు బూతులు అసహ్యాలూ కాకపోయినా, లోకంమాత్రం ఆవిధంగా చూస్తుందన్నీ, వీటినిగురించి మాట్లాడినా చెప్పుకున్నా మర్యాదఅనుగోదని చెప్పవొచ్చు. వాటినిగురించి యింటో స్వేచ్ఛగా

మాట్లాడుతున్నా ఇతరులతో మాట్లాడకూడదనీ, యితరులు వున్నప్పుడు వాటి విషయం మాట్లాడ్డం మర్యాదకాదనీ చెప్పాలి.

మూడు నాలుగేళ్ల లోపునే బిడ్డ తనెట్లా పుట్టిందో, కనుక్కోవాలని ప్రయత్నిస్తుంది. తనులోకంలో మృగాలలో, చూసిన విషయమై ప్రశ్నిస్తుంది.

చిన్నప్పణ్ణించీ పిల్లలతో సఖ్యంగావుండి వాళ్ళప్రశ్నలకు తడుముకోకుండా జవాబుచెప్పే అలవాటులోవుంటే బిడ్డ తలితండ్రుల్నే అడుగుతుంది. అప్పుడు సందేహించకుండా సిగ్గుపడకుండా తడుముకోకుండా తక్కినప్రశ్నలకు జవాబుచెప్పినట్టే దీనికీ చెప్పాలి. ఎన్నడూ యేమాత్రమూ అబద్ధంచెప్పకూడదు. ఏమడిగినానసరే జవాబుచెప్పాలి. "అమ్మ యెందుకు దూరంగా వున్నదన్నా అత్త యెందుకు నెప్పులుపడుతుంది అన్నా, తమ్ముడు యెట్లావొచ్చాడు! అనిఅడిగినా, నిజంగా సంగతేమిటో అదేచెప్పాలి. రహస్యమూ, అబద్ధమూ, బిడ్డలు తెలుసుకోకూడదనే వాతావరణమూ యింటోంచి తొలిగించాలి అంతా సహజమూ, నిర్మలమూ ఆరోగ్యవంతమూ జ్ఞానప్రదంగా వుంచితీరాలి.

ఈవిధమైన జ్ఞానం తలితండ్రుల దగ్గిర్నించి బిడ్డ సంపాయించడం చాలా వుత్తమం. ఎప్పుడు తలితండ్రులూ తక్కిన పెద్దవారూ, యీ విషయమై మాట్టాడరనీ తనుమాటాడితే తిడతారనీ, నిజంచెప్పరనీ బిడ్డకి తోస్తుందో అప్పుడు తన స్నేహితుల్ని వీధుల్లో పిల్లల్ని అడుగుతుంది. తలితండ్రులు ఒక్కటి గ్రహించాలి. కాని గ్రహించే ధైర్యం చాలమందికి లేదు. తాము చెప్పకపోయినంతమాత్రాన, బిడ్డ అంధకారంలో వుండదు. సందేహం కలిగిందా తీర్చుకునేదాకా బిడ్డ నిద్రపోదు- అందులో ముఖ్యంగా ఏదో రహస్యమూ గూఢమూ వుంది అనుకుందా అసలువూరుకోదు. ఎవరినో సగం తెలిసీ తెలీని బూతుగానూ, వక్రంగానూ చెప్పేవాళ్ళని అడుగుతుంది. వాళ్ళుచెప్పిందే నమ్మి రోచియో తనకు తెలుసునని పెద్దవారిదగ్గిర్నించి దాస్తో అనారోగ్యంవృద్ధిచేసుకుంటుంది. బిడ్డకీసంగతులు తెలుసునని పెద్దవారికి తెలుసు తనకి తెలుసునని పెద్దవారికి తెలుసునని బిడ్డకి తెలుసు. కాని యెవరికివారు తెలీనట్టే ప్రవర్తించడం మర్యాద అయింది. అయిపోతూంది పిల్లలయెదట, పిల్లలతో బూతులు మాట్లాడే తలితండ్రులకి కూడా ఆరోగ్యంగా యీ విషయాలు మాట్లాడడం సిగ్గు.

కొందరు బిడ్డలు యీవిషయమై తెలుసుకోవాలనే ఆసక్తికలిగివుండకపోవొచ్చు. వాళ్ళకికూడా యెనిమిదేళ్ళు రాకపూర్వమే సృష్టిజరిగే విధము తెలీడం ముఖ్యం. క్రిమంగా పువ్వులు కాయలయ్యేవిధమూ, జంతువులు బిడ్డల్ని కనేవిధమూ చూపి జ్ఞాపకంచేసి మనుష్య సృష్టికూడా అవిధంగానేనని చెప్పాలి. ఈ సృష్టిఆనందాన్ని బిడ్డ అర్థం చేసుకునేట్టు చెయ్యాలి.

చిన్నప్పటించీ, సఖ్యంగా, పిల్లలతో వుండి వాళ్ళప్రశ్నలకి తడుముకోకండా జవాబు చెప్పేఅలవాటుగా వుంటే, బిడ్డ తల్లితండ్రుల్నే అడుగుతుంది. అది అడిగినదానికి సందేహించకండా, సిగ్గుపడకండా, తడుముకోకండా జవాబుచెప్పాలి. అన్నిసంగతులూ, యెట్లామాటాడతారో, యివీ అట్లానే మాట్లాడాలి. యెప్పుడూ యేమాత్రమూ అబద్ధం చెప్పకూడదు యిది నువ్వు తెలుసుకోకూడదు అనే వాతావరణము యింటోంచి తొలిగించాలి.

సహజమైన యీవిషయాలు, భోజనంవలెనే బిడ్డ త్వరలో నేర్చుకోవలిసిన యీజ్ఞానము, మలినమనీ, నిర్మలమై

నబిడ్డ నేర్చుకోకూడనివనీ, పెద్దవారిఅభిప్రాయం. కాని యెంత దాచినా, బిడ్డదగ్గిర్నించి దాగవనీ సృష్టిబిడ్డకి బోధిస్తుందనీ, అజ్ఞానవాంఛ బిడ్డలోస్వభావసిద్ధంగావున్నదనీ తెలుసుకోరు. ఆ మూర్ఖవల్ల బిడ్డలో యెక్కడెక్కడ ఏకోర్కె, అజ్ఞానం సంపాయించాలని ఆశఅదిన్వాలు కనపడ్డా, నిర్మూలం చెయ్యాలని ప్రయత్నిస్తారు. సహజమైన సృష్టివాంఛమీదనే పెద్దఅనుమానం యేర్పడ్డది. అది అసహ్యమూ రోత అయింది. దానికి సంబంధించిన మాటలన్నీ బూతుమాటలుగా మారాయి. పెదవాళ్ళదెబ్బలూ, తిట్లూ బిడ్డనివక్రమార్గాలకు తిప్పుతాయి ఏకోర్కెని నిర్మూలం చెయ్యాలనుకొంటారో, అదే పెద్దవారి మూర్ఖంవల్ల, క్రౌర్యంవల్ల, అసహజమూ మలినమూ ఐన మార్గాల వర్తిస్తుంది. స్వభావానిః వదలక, పెద్దవారు జోక్యం కలగచేసుకొన్నకొద్దీ బిడ్డకి హాని జరుగుతుంది.

పెద్దవారు చూపేకోపమే అనుమానమే, సిగ్గే అసహ్యమే, బిడ్డస్వభావానికి విషతుల్యమవుతుంది.

ఈ జ్ఞానంబిడ్డలకి లేకపోవడంవల్ల, రజస్వలలై వాడిలిపోయినవాళ్ళు, మతిపోయినవాళ్ళు, ఆడపిల్లలు వున్నారు. గర్భా

దానవుగదిలో భయపడి చాలాసంవత్సరాలు బాధపడ్డవాళ్ళున్నారు. యీవ్యసనచిహ్నాలు అర్థంచేసుకోని బాలురు వున్నారు. వీరుసకృతే కావొచ్చు కాని వొక్కరు అపరికారం బాధపడి, స్వభావాన్ని వికృతంచేసుకున్న వాళ్లున్నా దానికి తలితండ్రులూ, సంఘమూ బాధ్యులవునా కాదా?

తలితండ్రులకు బిడ్డలకూ నిర్మలమైన విశ్వాసం లేకపోవడంవల్ల, వారితో చెప్పుకోడానికి వెరిచి లోపలలోపల కృశించే పిల్లలు ఎక్కడచూచినా ప్రతియింటా వున్నారు. పెద్దవారు పసిపిల్లలమీద జరుపుతున్న రహస్యవిషయమైన అక్రమాలూ, బైటికి రానేరావు. పాపమాబిడ్డ తనతల్లితో కూడా చెప్పుకోదు, ఎందుకు? సిగ్గు. ఇతరులు కొడితే, తిడితే చెప్పుకోవొచ్చు ఈ విషయమై తనకు కలిగే బాధలు బైటికి అనడం అభిమానం. ఎందుకు? బిడ్డలతో యీవిషయమై పెద్దవారు మాట్లాడరు గనక! పైపెచ్చు, బిడ్డదే తప్పుగా, దండిస్తారు గనక! బిడ్డతో స్పష్టంగా చెప్పాలి. వారిమీద అక్రమం జరప జూచే దుష్టులు వుంటారని. అట్లాంటి పరిస్థితులను బిడ్డనించి తొలిగించాలి. బిడ్డగ్రహించేట్టూ తమతో చెప్పేట్టూ, నేర్పాలి. అంటేయీవిషయమై, అవయవాల ఆరోగ్యం మొద

లైనవి స్వేచ్ఛగా సిగ్గుపడకుండా మాట్లాడి బిడ్డని శిక్షించరనే విశ్వాసం కలగ చేస్తే అంతా సులభమౌతుంది. ఈ రహస్య వ్యవహారంవల్ల ప్రజలలో అనేకదుర్గుణాలు ఏర్పడుతున్నాయి. కనక యింత ప్రాముఖ్యమిచ్చి చెపుతున్నాను. బిడ్డలు పడే బాధలు పైకిరావటంలేదు.

పిల్లల్ని యేమన్నాలకన్నా (ముఖ్యంగా యీ విషయాల్లో) కోప్పడ్డా, శిక్షించినా, సహజంగా పెద్దవారితో యీ విషయాలుమాట్లాడ్డం మానేస్తారు. పిల్లలు పెద్దవారితో చెప్పకుంటే సానుభూతి తప్ప యిబ్బందేమీ రాదని నిశ్చయంగా వాళ్లకి తెలిస్తేనేతప్ప వాళ్ళుసంగతులు దాస్తారు. బిడ్డ ఎంత తప్పుపని అసహ్యమైన పనిచేసినా, పెద్దవాళ్ళు వూరుకుని బిడ్డ యింక మళ్లీఆపని చెయ్యకుండా తప్పించుకోడానికి సలహానివ్వాలి; సహాయం చెయ్యాలి. పెద్దవాళ్ళమాటల్లో బిడ్డలకు సంపూర్ణ విశ్వాసం కలగచెయ్యాలి.

తనేంచేసినా పెద్దవారు సహాయం చేస్తారుగాని, కోపం తెచ్చుకోరని బిడ్డకి స్పష్టంగా తెలియాలి. ముఖ్యంగా యీ విషయాల్లో శిక్షయెప్పుడూ అన్యాయమూ అనారోగ్యమూ; యీ విషయంలో విషమవుతుంది.

చిన్నప్పటి నించీకూడా బిడ్డలకి వివాహాన్ని గురించి ప్రేమని గురించీ, చక్కని నిజమైన అభిప్రాయాలను యివ్వాలి. ఆడపిల్ల పెళ్లికోసమే పుట్టినట్టూ ఎవరికో పెళ్ళాంగా పుట్టినట్టూ మాట్లాడకూడదు. ఆమె జీవితంయెప్పుడు పరాధీనమేననీ, పురుషులకు సేవచెయ్యడం ఆమెవిధి అనీ, అన్నలకు, తమ్ముళ్ళకూ, చాకిరీచేయించరాదు: మాట్లాడితే ఆడపిల్లని ఆనిజ్ఞావశముంచుకో, అనకూడదు స్త్రీదగ్గర్నించి విధేయతా చాకిరీ, తీసుకోడం బాలుడి హక్కులైనట్టు నేర్పకూడదు. బాల్యంన్నించికూడా ప్రచారంలోవుండే, యీ నీచాభిప్రాయాల్ని, స్త్రీ పురుషునికి సంతోషమివ్వ డానికే పుట్టిందనీ, పురుషుడు స్త్రీలశీలాన్ని వినాశం చేసేపెనుభూతమనీ యీ అభిప్రాయాల్ని ఖండించాలి. పిల్లలకువారి దేహంమీద, శీలం మీదా అమితమైన గౌరవంవుండాలి. ప్రేమా, ఇతరులని ప్రేమించడం అనే అనుభవం అతిఅద్భుతంగానూ వున్నతంగానూ కనపడాలి. వారికి సంపూర్ణంగా ప్రేమిస్తేనేగాని తమమనసునంతా అర్పిస్తేనేగాన్ని, దేహాన్ని స్వాధీనంచెయడం అతినీచమని తెలుసుకోవాలి. స్త్రీపురుషులకువుండే యీ అసహజమై

రమూ అనుమానమూ పోల్చుంచి తొలిగించే ప్రయత్నం చేసితీరవలిసిందే బుద్ధివున్న మనుషులందరూ

పెద్దవారు యీసంగతుల్ని గమనించాలి 10 మొదలు 18 ఏళ్ళవరకు

1 బిడ్డ ఆరోగ్యకరమూ, సహజమూ ఐన జీవితాన్ని గడపాలి. మంచివ్యాయామమూ, చన్నీళ్ళస్నానమూ, ముఖ్యమైనవి.

2 ఈ విషయమై బిడ్డస్నేహితు లెటువంటివారో గమనిస్తో వుండాలి.

3 లోకంలో నీతిఅనేదానికి నిజమైని నీతికీ భేధం చూపాలి.

4 బిడ్డల్ని అనేక అభిరుచులతో, అభినివేశాలతో కాలమంతా, తీరికలేకండా గడిపేటట్టు చెయ్యాలి.

ఆఖరిమాట

ఇప్పుడిప్పుడే ప్రపంచం, బిడ్డలవిషయమై తానునమ్మిన అబద్ధాలగురించి మేలుకుని పెద్దవారి అంధత్వంవల్ల బిడ్డలకి అన్యాయం జరుగుతోందనీ, బాధకలుగుతోందనీ గ్రహిస్తోంది తక్కిన వర్గాలవలె బిడ్డతన బాధల్ని చెప్పుకుని, వాటిని వారణకోసం ఆందోళన చెయ్యలేదు. కనక పెద్దవారే బిడ్డకోసం శ్రమపడి, వారిజీవితాన్ని ఆనందకరంగానూ ఫలవంతంగానూ చెయ్యాలి.

ఇంతకాలమూ స్త్రీమెట్లా పురుషుడి ఆస్తిగావుందో, బిడ్డకూడా అట్లానేవుంది. ఒక్కచంపడంతప్ప తక్కిన యేబాధలు తలితండ్రులు, వారులేనప్పుడు, సవతితల్లులు, మామలు అత్తలు మొదలైనవారు యేంచేసినా బిడ్డకినోరెత్తడానికి తెలివి శక్తీలేవు ఏడ్చినా వినేవారులేరు.

బిడ్డకి యీలోకంలో ఆనందం అనుభవించడానికీసౌఖ్యపడడానికి హక్కువున్నదనే సంగతేమరచి యింతవరకు పెద్దవారికి సహాయపడగలదనే ఆలోచనలోనే వున్నారు. బిడ్డకిప్రత్యేకవ్యక్తిత్వమిచ్చి, బిడ్డయెవరి ఉపయోగం కోసంకాదనిన్ని, దనకోసం తాను జీవించేహక్కును పొందాలనీ

మనుషులు గుర్తించాలి. బిడకూడా పెద్దవారివలెనే వివేకము కలదని విశ్వసించి, బిడ్డకి సంపూర్ణమైన బాధ్యతలను యిచ్చి నప్పుడే అది అభివృద్ధి చెందుతుంది. లోకంలోకి స్వేచ్ఛగా పోనిచ్చి, అన్నిస్వయంగా చూసి నేర్చుకునేట్టు సహాయం చెయ్యాలి. తనశక్తుల్ని పంచేంద్రియాలను, బుద్ధినివుపయోగించి, సత్యాసత్యాల్ని, న్యాయాన్యాయాల్ని, నీతి అవినీతుల్నీ స్వయంగా తెలుసుకునేట్టు వుండాలి. బిడ్డని వీలైనంత వరకు స్వేచ్ఛగా వొదిలి పెద్దవారు తటస్థంగా నుంచోడం మంచిది. అపాయంలోకి తెలివితక్కువగా నడుస్తోందని తోచి నప్పుడు తప్ప పెద్దవారు జోక్యంకలగ చేసుకోకూడదు. బిడ్డ చేతిని పట్టుకుని నడిపించి జ్ఞానాన్ని యివ్వడానికి గొప్పతల్లి ప్రపంచంవుంది. పెద్దవారుయెక్కువ ఆదుర్దాపడనక్కర్లేదు. ఏ ఆజ్ఞపెట్టినా యేశిక్ష విధించినా, యేజోక్యం కల్గచేస్తు కున్నా ముందు పెద్దవారు తమఆత్మపరిక్ష చేసుకుని, బిడ్డ క్షేమం కోసమా, తమస్వంత క్షేమంకోసమా అని యోచించుకుంటే, బిడ్డలు చాలా సౌఖ్యపడిపోతారు. ప్రేమపేర పెద్దలు బిడ్డలకి చేసేఅపచారాలంత ఘోరమైన కార్యాలు యెక్కడా వుండవు.